Pubilshed from Eluru

PRGI NO : APTEL/25/A1219

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com




ఏలూరు ELURU | సంపుటి : 02 Vol.No : 02 | సంచిక : 245 Issue No : 245 | శనివారం Saturday | ఆగస్టు 22, 2026 22 AUGUST 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి Editor : Ankireddypalle Ramamohan Reddy | పేజీలు : 12 Pages 12 | వెల : 3 రూ Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana

## పోలీస్ స్టేషన్ ముందు రాహుల్ గాంధీ ధర్నా..

- పెల్లెట్ గన్ బాధితుడితో కలిసి ఎఫ్ఐఆర్ కోసం డిమాండ్
- పెల్లెట్ గన్ బాధితుడితో పోలీస్ స్టేషన్‌కు రాహుల్ గాంధీ
- ఎఫ్ఐఆర్ కోసం సీనియర్ పోలీస్ అధికారి కార్యాలయం ముందు ధర్నా
- జులై 20 నిరసనల్లో పెల్లెట్లు తగిలాయని యువకుడి ఆరోపణ
- పెల్లెట్ గన్స్ వాడలేదని ఢిల్లీ పోలీసుల వాదన



ఢిల్లీ : పెల్లెట్ గన్ గాయాల వ్యవహారంలో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శుక్రవారం ఢిల్లీలో ఆందోళనకు దిగారు. జులై 20న జరిగిన జెన్-జీ విద్యార్థుల నిరసనల్లో పెల్లెట్ గన్ గాయాలయ్యాయని ఆరోపిస్తున్న సాహిల్ లోచాబ్‌ను వెంటబెట్టుకుని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అనంతరం సీనియర్ పోలీస్ అధికారి కార్యాలయం బయట బాధితుడితో కలిసి ధర్నాకు కూర్చున్నారు.

- మిగతా 2లో..

## ఘోర విమాన ప్రమాదం

» 8మంది మృతి



అమెరికా : అమెరికాలోని అలస్కాలో ఘోర విమాన ప్రమాదం జరిగింది. పశ్చిమ అలస్కాలోని ఒక మారుమూల రాడార్ కేంద్రం సమీపంలో చార్టర్డ్ విమానం కూలిపోయి ఎనిమిదిమంది మృతి చెందినట్లు అధికారులు నిర్ధారించారు. జాతీయ రవాణా భద్రతా మండలి (చీూదీ)ను ఉటంకిస్తూ అసోసియేటెడ్ ప్రెస్ (ూూ) ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలను వెల్లడించింది. చీూదీ బోర్డు ఛైర్మన్ క్లింట్ జాన్సన్ వివరాల ప్రకారం ... ప్రమాదానికి గురైన విమానంలో ఇద్దరు పైలట్లు, ఆరుగురు ప్రయాణికులున్నారు. ప్రమాదం జరిగిన అనంతరం వెంటనే సహాయక, గాలింపు బృందాలు రంగంలోకి దిగాయని, అయితే విమానంలోని వారంతా అప్పటికే మృతి చెందారని అధికారులు తెలిపారు.

2 లో

## కోటబొమ్మాళి సామాజిక ఆసుపత్రికి మహర్దశ

- త్వరలో వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- వైద్య రంగాన్ని బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యం
- ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

ప్రజాభూమి ప్రతినిధి,కోటబొమ్మాళి : కోటబొమ్మాళి సామాజిక ఆసుపత్రిని త్వరలో వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడతామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కోటబొమ్మాళి సామాజిక ఆరోగ్య కేంద్రంలో నాబార్డు

⏭ వివరాలు 2లో..



## ఢిల్లీలో స్వైన్ ఫ్లూ కలకలం..



» వైద్యుల హెచ్చరిక

న్యూఢిల్లీ : రాజధాని ఢిల్లీలో హెచ్1ఎన్1 (స్వైన్ ఫ్లూ) కేసులు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. మారుతున్న వాతావరణ పరిస్థితులు, అధిక తేమ కారణంగా వైరల్ ఇన్ఫెక్షన్ల వ్యాప్తి పెరుగుతోందని వైద్యులు చెబుతున్నారు. సాధారణ జ్వరంగా భావించి నిర్లక్ష్యం చేయవద్దని, కొందరు బాధితుల్లో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఆక్సిజన్ స్థాయిలు తగ్గడం వంటి తీవ్ర లక్షణాలు కనిపించే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.తాజాగా ఢిల్లీలోని ఒక ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన పలువురు వైద్యులు, ఇతర సిబ్బంది హెచ్1ఎన్1 బారినపడినట్లు సమాచారం.

- మిగతా 2లో..



## నేడు కేరళం రాష్ట్రానికి పవన్ కళ్యాణ్

వైద్యుల సూచన మేరకు భుజానికి ఆయుర్వేద థెరపీ

ప్రజాభూమి ప్రతినిధి అమరావతి :

ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ శనివారం కేరళం రాష్ట్రానికి వెళ్లనున్నారు. ఇటీవల ముంబైలో కుడి భుజం రొటేటర్ కఫ్ గాయానికి శస్త్ర చికిత్స చేయించుకున్న ఆయన, వైద్యుల సూచన మేరకు తదుపరి చికిత్సలో భాగంగా ఆయుర్వేద థెరపీ చేయించుకోనున్నారు. శస్త్ర చికిత్స అనంతరం వైద్యులు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని తెలిపారు. కొంతకాలం బహిరంగ కార్యక్రమాలు , విధులకి దూరంగా ఉండాలని వైద్యులు సూచించారు. పాలనా బాధ్యతల దృష్ట్యా వారం రోజుల్లోనే పవన్ కళ్యాణ్ క్యాంపు కార్యాలయానికి అందుబాటులోకి వచ్చారు. ముందస్తుగా ఖరారైన ప్రభుత్వ కార్యక్రమాలలో పాల్గొనడం, వరుసగా శాఖాపరమైన సమీక్షలు, పార్టీ అంతర్గత సమావేశాలను నిర్వహించడం చేశారు. ఈ క్రమంలో శస్త్ర చికిత్స చేసిన భుజం భాగంలో వాపు పెరగడంతోపాటు తీవ్రమైన జ్వరం కూడా వచ్చింది. ప్రస్తుతం వైద్యుల సలహా మేరకు భుజం పూర్తిస్థాయిలో కోలుకునేందుకు కేరళంలో ప్రత్యేక ఆయుర్వేద థెరపీ చేయించుకోనున్నారు.

## తెలంగాణ సిఎం అమెరికా పర్యటన రద్దు

» లండన్‌లో పర్యట ముగించుకుని రానున్న రేవంత్




ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన రద్దయ్యింది. ప్రస్తుతం ఆయన లండన్ పర్యటనలో ఉన్నారు. యూకే నుంచి అమెరికా వెళ్లాల్సిన ఆయన.. అక్కడకు వెళ్లకుండానే పర్యటనను రద్దు చేసుకుని తిరిగి హైదరాబాద్ చేరుకోనున్నట్లు తెలుస్తోంది. ఈనెల 19 నుంచి 30 వరకు పదిరోజుల పాటు విదేశాల్లో సీఎం పర్యటించాల్సి ఉంది. విదేశీ పర్యటనలో భాగంగా బ్రిటన్‌తో పాటు అమెరికాలో ఉన్న ప్రముఖ యూనివర్సిటీలను సందర్శించి విద్యా విధానం, స్కిల్ డెవలప్‌మెంట్ విషయంలో ఆయా దేశాలు ఎలాంటి విధానాలను అవలంబిస్తున్నా యనే దానిపై ముఖ్యమంత్రి అధ్యయనం చేయాల్సి ఉంది.

⏭ వివరాలు 2లో..

## ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు..

24,252 వద్ద స్థిరపడ్డ నిఫ్టీ

» 3.11 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్ » 20.15 పాయింట్లు లాభపడ్డ నిఫ్టీ » ట్రెంట్, మారుతీ సుజుకీ ఇండియా, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ షేర్లకు నష్టాలు » ఎఫ్ఎంసీజీ, ఆటో, ఐటీ రంగాల షేర్లలో నష్టాలు » రాణించిన మెటల్, ప్రైవేట్ బ్యాంక్ షేర్లు



2 – పేజీలో..



## ఇంద్రకీలాద్రిపై కనకదుర్గ అన్నప్రసాద సదనం

» 'శ్రీ దుర్గా భవాని మహాప్రసాద భవనం'లను ప్రారంభించిన దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి » రెండవ ఘాట్ రోడ్డు నిర్మాణం, శాశ్వత పార్కింగ్ సదుపాయాలపై కార్యాచరణ » రాబోయే దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు. » భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించిన మంత్రి, ఎంపీ

ప్రజాభూమి ప్రతినిధి అమరావతి : విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం రూ. 52.50 కోట్ల వ్యయం తో నూతనంగా నిర్మించిన "శ్రీ కనకదుర్గ అన్నప్ర సాద సదనం" మరియు "శ్రీ దుర్గా భవాని మహాప్రసాద భవనం" లను రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి శుక్రవారం శాస్త్రోక్తంగా ప్రారంభించారు.

2 – పేజీలో..

## మద్యం మత్తులో హత్యలు, ప్రమాదాలు పెరుగుతున్నాయి

- అయినా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు
- బడి, గుడి పక్కన కూడా మద్యం.. రాష్ట్రాన్ని బెల్ట్ షాపుల మయంగా మార్చిన వెన్నుపోటు పార్టీ ప్రభుత్వం
- బీర్ అమ్మకాలు 1.12 కోట్ల కేసుల నుంచి 2.32 కోట్ల కేసులకు పెరిగినా మద్యం ఆదాయం మాత్రం ఆశించిన స్థాయిలో పెరగలేదు
- మద్యం డోర్ డెలివరీతో ప్రజల ఇళ్లకే మద్యం చేర్చే స్థాయికి కూటమి ప్రభుత్వ పాలన దిగజారింది
- రాజమండ్రి నుంచి కర్నూలు వరకు మద్యం మత్తులో వరుస విషాదాలు.. ప్రజల ప్రాణాలతో చెలగాటం
- రూ.99కే మద్యం పేరుతో నాసిరకం బ్రాండ్లను ప్రజలపైకి వదులుతున్న కూటమి ప్రభుత్వం
- ఒక్క తంబళ్లపల్లి నియోజకవర్గంలోనే వెయ్యి బెల్ట్ షాపులంటూ వార్తలు.. రాష్ట్రవ్యాప్తంగా పరిస్థితిపై ప్రభుత్వం లెక్క చెప్పాలి
- ప్రజల ఆరోగ్యం, కుటుంబాల భద్రత కంటే మద్యం వ్యాపారానికే కూటమి ప్రభుత్వం పెద్దపీట
- ప్రెస్‌మీట్‌లో కారుమూరు వెంకట్‌రెడ్డి




2 – పేజీలో..

ప్రజాభూమి ప్రతినిధి,తాడేపల్లి : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ఆంధ్రప్రదేశ్‌ను మద్యం మత్తులో ముంచేసిందని, మద్యం అమ్మకాలను విచ్చలవిడిగా పెంచుతూ ప్రజల ప్రాణాలు, కుటుంబాల భద్రతను గాలికొదిలేసిందని వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కారుమూరు వెంకట్‌రెడ్డి ధ్వజమెత్తారు. మద్యం మత్తులో హత్యలు, రోడ్డు ప్రమాదాలు, కుటుంబ విషాదాలు వరుసగా జరుగుతున్నా ప్రభుత్వానికి కనీస చలనం లేదని మండిపడ్డారు. బడి, గుడి పక్కన కూడా మద్యం అందుబాటులోకి రావడం, గ్రామగ్రామాన బెల్ట్ షాపులు విస్తరించడం, చివరకు డోర్ డెలివరీ వరకు మద్యం వ్యాపారం చేరడం కూటమి ప్రభుత్వ మద్యం విధానం ఎంత ప్రమాదకరంగా మారిందో స్పష్టం చేస్తోందన్నారు.

## ఈనెల 29 నుంచి సీడ్ యాక్సెస్ రోడ్డు మూడో దశ పనులు

- మంత్రి నారాయణ
- ప్రస్తుతం ఇన్నర్ రింగ్ రోడ్డు, రైల్వే లైన్ పనులపై దృష్టి సారించామన్న నారాయణ
- ఆ తర్వాత విమానాశ్రయం నిర్మాణంపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడి
- ఇకపై ప్రతినెలా ఒక టవర్ పూర్తయ్యేలా ప్రణాళికలు రూపొందించామన్న మంత్రి



ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. కీలకమైన సీడ్ యాక్సెస్ రహదారి మూడో దశ పనులపై మంత్రి నారాయణ ప్రకటన చేశారు. ఈ నెల 29వ తేదీన మూడో దశ పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. గుంటూరు జిల్లా తుళ్లూరులోని వందల ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి, శ్రీ బాలకోటేశ్వర స్వామి ఆలయాల పునఃప్రతిష్ఠ మహోత్సవంలో మంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

2 లో

# నిరుద్యోగ యువత నుంచి భారీగా వసూళ్లు

### పోలీసుల అదుపులో ఫ్లయింగ్ బోర్డర్స్ నిర్వాహకురాలు

**ప్రజాభూమి ప్రతినిధి, విశాఖపట్నం :** ఐరోపా దేశాల్లో ఆకర్షణీయ కొలువుల పేరిట విశాఖ, అల్లూరి సీతారామరాజు, విజయనగరం జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువత నుంచి భారీగా వసూలు చేసిన ఫ్లయింగ్ బోర్డర్స్ నిర్వాహకురాలిని విశాఖ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కన్స్టలెన్సీని నమ్మి మోసపోయిన బాధితులు ఉత్తరాంధ్ర జిల్లాల్లో వందల మంది ఉన్నారు. ఇందులో 15 మందిపైగా బాధితులు రూ.70 లక్షల మేర కోల్పోయామంటూ విశాఖ నగరంలోని గురుద్వారా పోలీసులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. విశాఖ పోలీసులు సెర్చ్ వారెంట్‌తో గురువారం కృష్ణాజిల్లా పెనమలూరు మండలం తాడిగడపలోని నిర్వాహకురాలు సౌజన్య ఇంటికి వెళ్లారు. పోలీసులు రావడం గమనించిన ఆమె ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకొని ఎంత ప్రయత్నించినా తెరవలేదు. అతికష్టంపై లోపలికి వెళ్లి ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఆమె ఇంట్లో ఉన్న బంగారం, వెండి, కొన్ని ఆస్తుల పత్రాలు, కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. కృష్ణాజిల్లా నుంచి ఆమెను విశాఖకు తీసుకు వస్తున్నారు. ఫ్లయింగ్ బోర్డర్స్ పేరుతో సౌజన్య, శ్రీనివాస్ దంపతులు ఓ కన్స్టలెన్సీ ఏర్పాటు చేశారు. విదేశీయుల పేరుతో ఫేక్ ఈ-మెయిల్స్ పంపి, కొన్ని నకిలీ ఇంటర్వ్యూలు చేయించి వాటిని సామాజిక మాధ్యమాల్లో పెట్టి నిరుద్యోగులకు వల వేశారు. 'తమకు ఉద్యోగాలు వచ్చాయంటూ' సోషల్ మీడియాలో తన గ్యాంగ్‌తోనే కామెంట్లు పెట్టించారు. అది నిజమని నమ్మిన వందలాది మంది నిరుద్యోగులు ఐరోపా దేశాల్లో ఉద్యోగాలు అనగానే రూ.లక్షల్లో తెచ్చి చెల్లించారు. 750 మందిపైగా నిరుద్యోగుల నుంచి రూ.11.46 కోట్లు వసూలు చేసినట్లు కృష్ణాజిల్లా పరిధిలో పలు స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. హైదరాబాద్‌లో సౌజన్య, శ్రీనివాసరావు దంపతులను అక్కడి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తాజాగా విశాఖలో తెరపైకి వచ్చిన బాధితుల ఫిర్యాదుతో బెయిల్‌పై ఉన్న ఆమెను మరోసారి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ఈ బాధితుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

### పోలీస్ స్టేషన్ ముందు

# రాహుల్ గాంధీ ధర్నా..


జులై 20న పరీక్షల పేపర్ లీక్‌లకు నిరసనగా వందలాది మంది విద్యార్థులు పార్లమెంట్ వైపు మార్చ్ చేపట్టిన విషయం తెలిసిందే. ఆ సమయంలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. 'ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్' (ఆర్ఏఎఫ్) సిబ్బంది పెల్లెట్ గన్స్ ఉపయోగించారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఈ ఘటనలో గాయపడినట్లు పలువురు నిరసనకారులు చెప్పడంతో పాటు వైద్య నివేదికలు కూడా ఉన్నాయని కాంగ్రెస్ పేర్కొంది.అయితే జులై 20న పెల్లెట్ గన్స్ ఉపయోగించలేదని ఢిల్లీ పోలీసులు పలుసార్లు తెలిపారు. ఈ అంశంపై సీఆర్‌పీఎఫ్ మాత్రం ఇప్పటివరకు స్పందించలేదు. మరోవైపు, గాయపడిన నిరసనకారుల వాంగ్మూలాలు, వైద్య నివేదికలు పెల్లెట్ గన్స్ వాడలేదన్న వాదనపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని కాంగ్రెస్ పేర్కొంది.

# ఘోర విమాన ప్రమాదం

రెండు ఇంజిన్లతో కూడిన సెస్నా చార్టర్ విమానం యాంకరేజ్ నుంచి కేప్ న్యూన్‌హామ్ వైపు ప్రయాణిస్తోంది. ఈ క్రమంలో పశ్చిమ అలస్కాలోని మారుమూల ప్రాంతంలో విమానం ప్రమాదానికి గురైంది. ప్రమాదం జరిగిన ప్రాంతం గుడ్‌న్యూస్ బేకు దక్షిణంగా సుమారు 40 మైళ్ల దూరంలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. కేప్ న్యూన్‌హామ్ ప్రాంతంలో వైమానిక దళానికి చెందిన రన్‌వే ఉంది. అక్కడి నుంచి దూర ప్రాంతంలో ఉన్న రాడార్ స్టేషన్‌కు ప్రవేశం ఉంటుంది. విమానం కూలిపోయిన సమాచారం అందిన వెంటనే పలు సంస్థలు సహాయక చర్యలు ప్రారంభించాయి. యూఎస్ కోస్ట్ గార్డ్, అలస్కా స్టేట్ ట్రూపర్స్, రెస్క్యూ కోఆర్డినేషన్ సెంటర్ సిబ్బంది ప్రమాద స్థలానికి స్పందించారు. మారుమూల ప్రాంతం కావడంతో సహాయక చర్యలు, ప్రమాదానికి సంబంధించిన వివరాల సేకరణలో సవాళ్లు ఎదురైనట్లు అధికారులు తెలిపారు. అమెరికా సైన్యం కూడా విమాన ప్రమాదంలో ఇద్దరు పైలట్లతో సహా ఎనిమిది మంది మరణించినట్లు ధ్రువీకరించింది. ప్రస్తుతం విమానం ఎందుకు కూలిపోయిందనే విషయం స్పష్టంగా తెలియరాలేదు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై యూఎస్ దర్యాప్తు ప్రారంభించింది. వాతావరణ పరిస్థితులు, విమానం సాంకేతిక పరిస్థితి, పైలట్లకు సంబంధించిన అంశాలు తదితర కోణాల్లో దర్యాప్తు జరిగే అవకాశం ఉంది. అధికారులు మరింత సమాచారం సేకరించిన అనంతరం ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించనున్నారు. ఈ ఘటనతో అలస్కాలో తీవ్ర విషాదం నెలకొంది. ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు సమాచారం అందించే ప్రక్రియతో పాటు, ప్రమాదానికి అసలు కారణాన్ని గుర్తించే దర్యాప్తు కొనసాగుతోంది.

# ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు..

**న్యూఢిల్లీ :** దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం దాదాపు ఫ్లాట్‌గా ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో ప్రతికూల పరిస్థితులు, బాండ్ ఈల్డ్స్ పెరగడం, ముడిచమురు ధరల్లో పెరుగుదల ఇన్వెస్టర్లను అప్రమత్తం చేశాయి. అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు కూడా మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపాయి.సెన్సెక్స్ 3.11 పాయింట్లు పెరిగి 77,540.83 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 20.15 పాయింట్లు లాభపడి 24,252.00 వద్ద ముగిసింది. నిఫ్టీ 0.08 శాతం పెరిగింది.నిఫ్టీకి 24,000-24,200 స్థాయి కీలక మద్దతుగా ఉంటుందని మార్కెట్ నిపుణులు తెలిపారు. పైస్థాయిలో 24,300-24,400 మధ్య నిరోధం ఉందని చెప్పారు. ఈ స్థాయిని దాటితే నిఫ్టీ 24,500-24,600 వరకు పుంజుకునే అవకాశం ఉందని అంచనా వేశారు.ప్రధానంగా నష్టపోయిన షేర్లలో ట్రెంట్, మారుతీ సుజుకీ ఇండియా, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ ఉన్నాయి. మరోవైపు విస్తృత మార్కెట్‌లో కొంత ఉత్సాహం కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.1 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 0.69 శాతం లాభపడ్డాయి.రంగాల వారీగా చూస్తే ఎఫ్ఎంసీజీ, ఆటో, ఐటీ సూచీలు వెనుకబడ్డాయి. మెటల్, ప్రైవేట్ బ్యాంక్ సూచీలు మెరుగ్గా రాణించాయి.



# కోటబొమ్మాళి సామాజిక ఆసుపత్రికి మహర్దశ


నిధులు రూ.2.90 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన ప్రసూతి, శిశు ఆరోగ్య విభాగం భవనాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు.
ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. ప్రభుత్వం వైద్య, ఆరోగ్య రంగానికి అత్యంత ప్రాధాన్యమిస్తూ మౌలిక వసతులను బలోపేతం చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సైతం నాణ్యమైన వైద్య సేవలు సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కోటబొమ్మాళి సామాజిక ఆసుపత్రిని వంద పడకల స్థాయికి పెంచి మరింత మెరుగైన వైద్య సేవలు అందించేలా అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు.



**సాధారణ ప్రసవాలపై అవగాహన కల్పించాలి :** ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించేలా గర్భిణులకు అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రసూతి, శిశు ఆరోగ్య సేవలను మరింత విస్తృతం చేసి ప్రజలకు చేరువ చేయాలని అన్నారు.
**మానవతా దృక్పథంతో సేవలందించాలి :** వైద్యులు, నర్సులు, ఇతర వైద్య సిబ్బంది మానవతా దృక్పథంతో వ్యవహరించి రోగులకు ఆప్యాయతతో సేవలందించాలని మంత్రి సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సంతృప్తికరమైన వైద్య సేవలు అందించి ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని కోరారు.ఆసుపత్రి పరిసరాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. రోగులకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేలా ఆసుపత్రి ప్రాంగణాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆసుపత్రి నిర్వహణ, పరిశుభ్రత పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహమ్మద్ ఖాన్, ఆర్డీఓ ఎం. కృష్ణమూర్తి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డా. విజయలక్ష్మి, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరిప్రసాద్, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఝాన్సీలక్ష్మి, మెడికల్ ఆఫీసర్లు పి. గణేష్, వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో స్వైన్ ఫ్లూ కలకలం..

ఇదే సమయంలో ఫ్లూ తరహా లక్షణాలతో ఆసుపత్రులను ఆశ్రయిస్తున్న వారి సంఖ్య కూడా పెరుగుతోంది. జ్వరం, దగ్గు, ఒళ్లు నొప్పులు వంటి సమస్యలతో పలువురు వైద్యులను సంప్రదిస్తున్నారు. హెచ్1ఎన్1 సోకిన వారిలో సాధారణంగా అకస్మాత్తుగా జ్వరం రావడం, పొడి దగ్గు, తలనొప్పి, గొంతునొప్పి, చలి, తీవ్రమైన అలసట, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొన్ని సందర్భాల్లో ఇన్ఫెక్షన్ తీవ్రరూపం దాల్చి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఆక్సిజన్ స్థాయిలు తగ్గడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. అయితే ప్రతి జ్వరాన్ని స్వైన్ ఫ్లూగా భావించాల్సిన అవసరం లేదని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఇతర శ్వాసకోశ ఇన్ఫెక్షన్లలో కూడా ఇలాంటి లక్షణాలు కనిపించే అవకాశం ఉందని, లక్షణాలు తీవ్రంగా ఉంటే తప్పనిసరిగా వైద్యుల సలహా తీసుకోవాలని సూచిస్తున్నారు.



**ఈ లక్షణాలుంటే అప్రమత్తం కావాలి...**జ్వరం, దగ్గుతో పాటు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఛాతీలో నొప్పి, తగ్గని అధిక జ్వరం, గందరగోళం, పెదాలు నీలం రంగులోకి మారడం లేదా లక్షణాలు క్రమంగా తీవ్రమవడం వంటి సంకేతాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం పొందాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణులు, మధుమేహం ఉన్నవారు, గుండె లేదా ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడుతున్నవారు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు.
**వ్యాప్తిని నివారించాలంటే..**ఫ్లూ, ఇతర శ్వాసకోశ సంబంధిత ఇన్ఫెక్షన్ల వ్యాప్తిని అరికట్టేందుకు వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. చేతులను తరచూ శుభ్రంగా కడుక్కోవడం, దగ్గేటప్పుడు లేదా తుమ్మేటప్పుడు నోరు, ముక్కును కప్పుకోవడం, అనారోగ్యంగా ఉన్నప్పుడు ఇతరులకు దూరంగా ఉండడం, లక్షణాలు ఉన్న సమయంలో ఇంట్లోనే విశ్రాంతి తీసుకోవడం వంటి జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. మొత్తంగా ఢిల్లీలో ఫ్లూ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో అనవసరంగా భయపడాల్సిన అవసరం లేదని, అదే సమయంలో నిర్లక్ష్యం కూడా తగదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. జ్వరంతో పాటు లక్షణాలు తీవ్రంగా మారుతున్నాయా? శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలుగుతోందా? అనే అంశాలను గమనించి, అవసరమైతే వెంటనే వైద్యులను సంప్రదించడం కీలకమని సూచిస్తున్నారు.

# సిఎం అమెరికా పర్యటన రద్దు

పలు అంతర్జాతీయ యూనివర్సిటీలను సందర్శించే విధంగా షెడ్యూల్‌ను ఖరారు చేశారు.
ప్రస్తుతం లండన్‌లో ఉన్న సీఎం.. అక్కడ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ, లండన్ బిజినెస్ స్కూల్‌ను సందర్శించాల్సి ఉంది. 23 వరకు లండన్‌లో పర్యటించనున్న సీఎం.. అక్కడి నుంచి అమెరికాలోని బోస్టన్‌కు వెళ్లాల్సి ఉంది. ఈనెల 29 వరకు అమెరికాలో పర్యటించి.. తిరిగి 30న హైదరాబాద్‌కు తిరిగి రావాల్సి ఉంది. అయితే, విదేశీ పర్యటనలకు వెళ్తున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతుల కోసం సీఎంవో అధికారులు దరఖాస్తు చేశారు. యూకే పర్యటనకు అనుమతి లభించినప్పటికీ, అమెరికా పర్యటనకు అనుమతి లభించకపోవడంతోనే సీఎం రేవంత్ పర్యటనను రద్దు చేసుకున్నట్లు సమాచారం.

## ఈనెల 29 నుంచి సీడ్ యాక్సెస్ రోడ్డు మూడో దశ పనులు

గతంలో రాజధాని రైతులు అమరావతి పరిరక్షణ కోసం చేపట్టిన 'న్యాయస్థానం టు దేవస్థానం' పాదయాత్ర ఇదే తుళ్లూరు ఆలయం నుంచే ప్రారంభమై విజయవంతమైందని మంత్రి గుర్తుచేశారు. రైతుల త్యాగాల పునాదులపైనే అమరావతి మళ్లీ పునర్నిర్మాణం అవుతోందన్నారు. రాజధాని నిర్మాణంలో భాగమైన ఇన్నర్ రింగ్ రోడ్డు, రైల్వే లైన్ పనులపై ప్రస్తుతం ప్రధానంగా దృష్టి సారించామని, ఆ తర్వాత విమానాశ్రయం నిర్మాణ అంశంపై తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.అమరావతి పరిపాలనా నగరంలో టవర్ల నిర్మాణాన్ని వేగవంతం చేస్తూ ప్రతినెలా ఒక్కో టవర్ నిర్మాణాన్ని పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. అలాగే, రాజధాని రైతుల రిటర్నబుల్ ప్లాట్ల అభివృద్ధి పనులకు సంబంధించి ఈ నెల 27న టెండర్లు ఓపెన్ చేస్తున్నామని, ప్రక్రియ పూర్తి కాగానే క్షేత్రస్థాయిలో పనులు వేగంగా మొదలుపెడతామని మంత్రి స్పష్టం చేశారు.



# ఇంద్రకీలాద్రిపై కనకదుర్గ అన్నప్రసాద సదనం

అంతకుముందు శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి గారు, అనంతరం ప్రజాప్రతినిధులు మరియు ఉన్నతాధికారులతో కలిసి నూతన భవనాలను భక్తులకు అంకితం చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ ఆలయ భవిష్యత్ అభివృద్ధి, రాబోయే ఉత్సవాల ఏర్పాట్లపై కీలక అంశాలను వెల్లడించారు.
**రెండవ ఘాట్ రోడ్డు ఏర్పాటుకి చర్యలు :** ఇంద్రకీలాద్రిపై ట్రాఫిక్ సమస్యలను శాశ్వతంగా నివారించేందుకు, అత్యవసర సమయాల్లో రాకపోకలు సజావుగా సాగేలా రెండవ ఘాట్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన సాధ్యాసాధ్యాలను పరిశీలించి, త్వరితగతిన నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కుమ్మరి పాలెం నుంచి 700 మీటర్ల మేర ఈ ఘాట్ రోడ్డు నిర్మించేందుకు ఇప్పటికే ఆర్ అండ్ బి, ఓ కన్సల్టెన్సీ సంస్థకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.
**టీటీడీ స్థలంలో మల్టీ లెవెల్ బిల్డింగ్ నిర్మాణం ?** కుమ్మరిపాలెంలో ఉన్న 3 ఎకరాల టీటీడీ స్థలాన్ని తీసుకుని దుర్గమ్మ భక్తుల కోసం వినియోగిస్తామని మంత్రి అన్నారు. ఆ స్థలంలో ఏడు అంతస్తుల బిల్డింగ్ నిర్మించి.. అక్కడ మల్టీ లెవెల్ పార్కింగ్, భక్తుల కోసం గదులను నిర్మించి సుమారు 15 వేల మందికి ఉపయోగపడేలా బిల్డింగ్ త్వరలో నిర్మిస్తామన్నారు.
**కేశఖండనశాల, ఆదిశంకరాచార్యుల విగ్రహం ఏర్పాటు :** దుర్గఘాట్ దగ్గర నూతన కేశఖండనశాల నిర్మించేందుకు ప్రతిపాదనలు ఉన్నాయని.. ఇప్పటికే సమీపంలో ఉన్న కార్పొరేషన్ స్థలాన్ని కూడా తీసుకుని భారీ కేశఖండనశాల నిర్మిస్తామన్నారు. ఇక.. ప్రస్తుతం ఉన్న ఘాట్ రోడ్డు మొదటి మలుపులో 25 అడుగుల ఆదిశంకరాచార్యులు విగ్రహం నిర్మించేందుకు ప్రణాళికలు ఉన్నాయన్నారు.
రాబోయే దసరా ఉత్సవాల ప్రత్యేక ఏర్పాట్లు: త్వరలో రానున్న ప్రతిష్టాత్మక 'దేవి శరన్నవరాత్రి దసరా మహోత్సవాలు'కు లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం, పోలీస్, మున్సిపల్ మరియు రెవెన్యూ విభాగాల సమన్వయంతో పకడ్బందీ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. క్యూ లైన్లలో నిరంతర తాగునీరు, పాలు, ప్రసాదాల వితరణ, పారిశుద్ధ్యం మరియు భద్రతకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తామని స్పష్టం చేశారు.
**భక్తులకు అన్నప్రసాదం వడ్డన - లడ్డూ ప్రసాదాల కొనుగోలు :** నూతన శ్రీకనకదుర్గ అన్నప్రసాద సదనంలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తదితరులు భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు. అనంతరం మహాప్రసాద భవనంలో పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొని, వేద పండితుల ఆశీస్సులు పొందారు. ప్రసాద భవనంలో ఏర్పాటు చేసిన ప్రసాదం విక్రయ కౌంటర్ వద్ద నగదు చెల్లించి శ్రీ అమ్మవారి లడ్డూ ప్రసాదాలను మంత్రి ఆనం కొనుగోలు చేశారు.
**ప్రారంభించిన నూతన భవనాల వివరాలు :** శ్రీ కనకదుర్గ అన్నప్రసాద సదనం (రూ. 26.00 కోట్లు): మొత్తం 5,400 చదరపు మీటర్ల విస్తీర్ణంలో (సుమారు 58,125 చ.అ) నిర్మితమైన ఈ భవనంలోని మొదటి అంతస్తు భోజన శాలలో ఒకే విడతలో 800 మంది భక్తులు కూర్చుని భోజనం చేసే వసతి ఉంది. గ్రౌండ్ ఫ్లోర్‌లో సెంట్రల్ స్టోర్, వంట ప్రిపరేషన్ ఏరియా, వాష్‌రూమ్‌లు మరియు మూడు వైపుల నుండి వాహనాల రాకపోకలకు వీలుగా మార్గాలు సిద్ధం చేశారు. శ్రీ దుర్గా భవాని మహాప్రసాద భవనం (రూ. 26.50 కోట్లు): మొత్తం 3,600 చదరపు మీటర్ల విస్తీర్ణంలో (సుమారు 38,748 చ.అ) 4 అంతస్తులుగా నిర్మించారు. గ్రౌండ్, మొదటి అంతస్తుల్లో ప్రసాదం విక్రయ కౌంటర్లు, క్యూ లైన్లు ఉండగా.. రెండు, మూడవ అంతస్తులలో పులిహోర, చక్కెరపొంగలి, లడ్డూల తయారీ, ప్యాకింగ్, స్టాకింగ్ (నిల్వ) అత్యాధునిక వసతులు సమకూర్చారు.
**త్వరలో 'యాంత్రీకృత వంటశాలలు' :** (Mechanised Kitchens): భవిష్యత్ రద్దీని దృష్టిలో ఉంచుకుని అత్యున్నత పరిశుభ్రత (హైజీన్) ప్రమాణాలతో వేగంగా వంటలు తయారు చేసేందుకు ఈ రెండు భవనాల్లో త్వరలోనే యాంత్రీకృత వంటశాలలను ప్రవేశపెడతామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయవాడ లోక్‌సభ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రామ్ ప్రసాద్, దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్, దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్, ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# మద్యం మత్తులో హత్యలు, ప్రమాదాలు పెరుగుతున్నాయి

మద్యం అమ్మకాలను పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం.. దాని వల్ల జరుగుతున్న అనర్థాలకు మాత్రం బాధ్యత వహించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం తాడేపల్లిలోని వైయస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో కారుమూరు వెంకట్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు."
"చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో మద్యం విచ్చలవిడిగా అందుబాటులోకి వచ్చింది. మద్యం మత్తులో హత్యలు, రోడ్డు ప్రమాదాలు, కుటుంబ విషాదాలు వరుసగా చోటుచేసుకుంటున్నాయి. రాజమండ్రిలో మద్యం మత్తులో వైద్యురాలి మృతి, కర్నూలు జిల్లాలో బెల్ట్ షాపు నుంచి మద్యం కొనుగోలు చేసి తాగిన ఇద్దరు యువకుల కారణంగా జరిగిన బస్సు ప్రమాదంలో 19 మంది మృతి వంటి ఘటనలు కళ్లముందే ఉన్నాయి. ఒకే రోజు మూడు జిల్లాల్లో అన్నను తమ్ముడు, తండ్రిని కుమారుడు, భార్యను భర్త హత్య చేసిన ఘటనలు కూడా మద్యం మత్తు ఎంతటి విషాదాలకు దారితీస్తుందో చెబుతున్నాయి. మద్యం తాగి వాహనాలు నడిపి తాము చనిపోవడమే కాకుండా ఇతరుల ప్రాణాలు కూడా తీస్తున్నారు. అయినా ప్రభుత్వం మద్యం విక్రయాలను నియంత్రించకుండా మరింతగా ప్రోత్సహిస్తోంది. మద్యం డోర్ డెలివరీ, 24 గంటలూ అందుబాటులో ఉండే పరిస్థితి, గ్రామాల్లో విస్తరిస్తున్న బెల్ట్ షాపులతో ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతున్నారు."
"మద్యం అమ్మకాలు భారీగా పెరిగాయి. 2023--24లో బీర్ అమ్మకాలు 1.12 కోట్ల కేసులు ఉండగా, 2025--26 నాటికి 2.32 కోట్ల కేసులకు చేరాయి. ఇంతగా అమ్మకాలు పెరిగినా ప్రభుత్వ మద్యం ఆదాయం మాత్రం 2023--24లో రూ.25,117 కోట్ల నుంచి 2024--25లో రూ.28,844 కోట్లకు, 2025--26లో సుమారు రూ.29 వేల కోట్లకు మాత్రమే చేరింది. అమ్మకాలు రెట్టింపవుతున్నప్పుడు ప్రభుత్వ ఆదాయం అదే స్థాయిలో ఎందుకు పెరగడం లేదు? బెల్ట్ షాపులు, నకిలీ మద్యం, పక్క రాష్ట్రాల నుంచి వస్తున్న మద్యం వల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోందా? ప్రజలకు మద్యం అందుబాటును పెంచి, ప్రభుత్వానికి ఆదాయం మాత్రం పెరగని ఈ విధానంపై చంద్రబాబు ప్రభుత్వం పూర్తి లెక్కలు చెప్పాలి. "బెల్ట్ షాపులు, డోర్ డెలివరీతో మద్యం ప్రతి గ్రామానికీ చేరింది. బడి, గుడి పక్కన కూడా మద్యం దొరికే పరిస్థితి తీసుకొచ్చారు. ఒక్క తంబళ్లపల్లి నియోజకవర్గంలోనే వెయ్యి బెల్ట్ షాపులు ఉన్నాయనే వార్తలు వస్తున్నాయి. మరి రాష్ట్రవ్యాప్తంగా ఎన్ని బెల్ట్ షాపులు ఉన్నాయో ప్రభుత్వం చెప్పాలి. రూ.99కే మద్యం పేరుతో సుమో, షార్ట్, బెంగళూరు బ్రాంది, కేరళ మాల్టెడ్ విస్కీ, డాక్టర్స్ బ్రాంది వంటి బ్రాండ్లను తీసుకొచ్చారు. వీటి నాణ్యతపై ప్రజల్లో అనుమానాలు ఉన్నందున ప్రభుత్వం వెంటనే నాణ్యత పరీక్షలు నిర్వహించి వాస్తవాలను వెల్లడించాలి. వైయస్ జగన్ ప్రభుత్వం గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీలు తీసుకొస్తే.. కూటమి ప్రభుత్వం బడి వైన్స్, గుడి వైన్స్‌లను తీసుకొచ్చింది."

- "ఈ ఏడాది 11 క్యాబినెట్ సమావేశాలు జరిగితే ఎనిమిది సమావేశాలకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హాజరుకాలేదు. జ్వరం కారణంగా క్యాబినెట్ సమావేశాలకు రాలేని పవన్ కళ్యాణ్ ఇతర కార్యక్రమాలకు మాత్రం ఎలా హాజరవుతున్నారు? కీలకమైన ప్రభుత్వ సమావేశాలకు ఎందుకు దూరంగా ఉంటున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలి."
- "చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ కోసం ప్రత్యేక విమానాలు, హెలికాప్టర్లు, ప్రత్యేక కాన్వాయ్‌ల పేరుతో ప్రజాధనం ఖర్చు చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రజలకు తాగునీరు కూడా అందని పరిస్థితి ఉంది. ఆడపిల్లల హాస్టళ్లలో నీటి కోసం విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల అవసరాలను పక్కనపెట్టి పాలకుల విలాసాలకు ప్రజాధనం ఖర్చు చేయడం ఏంటి?"
- "హైదరాబాద్‌లో ఈ నెల 16న ప్రమాదం జరిగితే నాలుగు రోజుల తర్వాతే విషయం బయటకు వచ్చింది. జనసేన ఎంపీ కుమారుడు కావడంతోనే ఈ ఘటనను ఇంతకాలం బయటకు రానివ్వలేదనే అనుమానాలు కలుగుతున్నాయి. కూటమి నేతల కుటుంబాలకు ఒక న్యాయం, సామాన్యులకు మరో న్యాయం ఉండకూడదు. ఈ ఘటనపై పూర్తి వాస్తవాలను బయటపెట్టి, చట్టం అందరికీ సమానంగా అమలు చేయాలి."
- "వైయస్ జగన్ ఇవాళ హైదరాబాద్‌లో ఒక వివాహానికి హాజరైతేనే భారీగా ప్రజలు తరలివచ్చారు. ఆయన ఎక్కడికి వెళ్లినా ప్రజలు స్వచ్ఛందంగా వస్తున్నారు. ఎన్ని ప్రచారాలు చేసినా ప్రజలకు, వైయస్ జగన్‌కు మధ్య ఉన్న అనుబంధాన్ని ఎవరూ విడదీయలేరు. రెండేళ్ల కూటమి పాలనపై ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతకు ఈ జనాభిమానమే నిదర్శన"మని కా రుమూరు అన్నారు.

# రోడ్డు భద్రతలో ఆదర్శ పట్టణంగా విజయవాడను నిలబెడదాం



**ఐడియల్ టౌన్ ఆన్ రోడ్ సేఫ్టీ ప్రాజెక్టుతో లక్ష్యాలను చేరుకుందాం**

**ప్రమాద మరణాలు, క్షతగాత్రులను 10–15 శాతం తగ్గించడమే లక్ష్యంగా చర్యలు నాలుగు కీలక అంశాలతో**

**సమగ్ర రోడ్డు భద్రత కార్యాచరణ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:
రోడ్డు భద్రతలో విజయవాడను ఆదర్శ పట్టణంగా ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని.. అదేవిధంగా లక్ష్యాల సాధనకు ఐడియల్ టౌన్ ఆన్ రోడ్ సేఫ్టీ కార్యక్రమం దోహదం చేస్తుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.విజయవాడను రోడ్డు భద్రతలో ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఐడియల్ టౌన్ ఆన్ రోడ్ సేఫ్టీ ప్రాజె క్టుకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం కలెక్ట ర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆవిష్కరించారు.హోండా ఇండియా ఫౌండేషన్ సీఎస్ఆర్ భాగస్వామిగా, ట్రాక్స్ – రోడ్ సేఫ్టీ ఎన్జీవో అమలు సంస్థగా ఈ ప్రాజె క్టును చేపడుతున్నాయి. రవాణా, పోలీస్ శాఖల సహకా రంతో కార్యక్రమాన్ని అమలు చేయను న్నా రు.ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల వల్ల సంభవించే మరణాలు, క్షతగాత్రులను 10–15 శాతం మేర తగ్గించడం, ప్రజల్లో రోడ్డు భద్రతపై బాధ్యతాయుతమైన ప్రవర్తనను పెంపొం దించడం ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమన్నారు. ఈ ప్రాజెక్టును ప్రధానంగా ఇంజినీరింగ్, ఎన్ఫోర్స్మెంట్, ఎడ్యుకేషన్, ఎమర్జెన్సీ కేర్ అనే నాలుగు అంశాల ఆధారంగా అమలు చేయడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా బ్లాక్స్పాట్లలో మౌలిక వసతుల లోపాలను గుర్తించి సరిచేయడం, జీరో టాలరెన్స్ జోన్ల ద్వారా ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేయడం, 105 పాఠశాలలు, 14 కళాశాలల్లో సుమారు 70 వేల మంది విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడం, హెల్మెట్, సీటుబెల్ట్, లేన్ క్రమశిక్షణ, పాదచారుల భద్రతపై ప్రచారం నిర్వహించడం, అలాగే ప్రమాదాల సమయంలో సకాలంలో ప్రాథమిక సహాయం అందించేందుకు ఫస్ట్ రెస్పాండర్లకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. రోడ్డు ప్రమాద మరణాలను తగ్గించేందుకు ప్రభుత్వ శాఖలు, పోలీస్, ప్రైవేటు సంస్థలు, విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ఇతర భాగస్వామ్య సంస్థలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి సమన్వయంతో పనిచేయడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో హోండా ఇండియా ఫౌండేషన్ ప్రతినిధులతో పాటు విజయవాడ–ఎన్హెచ్ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ విద్యాసాగర్, ట్రాక్స్ – రోడ్ సేఫ్టీ ఎన్జీవో (ఢిల్లీ) జనరల్ సెక్రటరీ రజనీ గాంధీ, రీజినల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎం. వాసు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక స్వావలంబనకు 'రైజ్' కార్యక్రమం చుక్కానిలా నిలుస్తుంది

**శిక్షణలో పొందిన నైపుణ్యాలను ఉపాధి, స్వయం ఉపాధిగా మలుచుకోవాలి**

**మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబానికి వెన్నుదన్నుగా నిలుస్తారు**

ప్రజాభూమి ప్రతినిధి ,విజయవాడ:
మహిళలు శిక్షణ ద్వారా పొందిన నైపుణ్యాలు, అనుభవాన్ని వినూత్న ఆలోచనలతో మేళవించి వివిధ ఉత్పత్తులను తయారు చేసి, వాటిని మార్కెటింగ్ చేసుకోవడం ద్వారా ఆర్థికంగా ఎదిగేందుకు 'రైజ్' కార్యక్రమం చుక్కానిలా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి రైజ్ కేంద్రంలో నిర్వహించిన క్రాఫ్ట్ అండ్ ఆర్ట్స్ సెల్ఫ్ ఎంప్లాయ్మెంట్ మినీ ఎక్స్పోను శనివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఢిల్లీ నుండి వచ్చిన ఓడీఓపి అధికారి ఇషాదీప్ సింగ్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో ప్రతి మహిళ తనకంటూ ఒక నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకుని స్వశక్తితో ఎదగాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. మహిళ ఆర్థికంగా బలపడినప్పుడు కుటుంబానికి ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలవడంతో పాటు, కుటుంబ జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుత జీవనశైలి అధిక ఖర్చులతో ముడిపడి ఉందని, కుటుంబ అవసరాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో మహిళలు తమకు ఆసక్తి ఉన్న రంగంలో ఏదో ఒక పనిని ఉపాధిగా లేదా వ్యాపకంగా చేపట్టి ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ సూచించారు. మహిళల కలలను కార్యరూపంలోకి తీసుకురావడానికి ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా కోట్లాది రూపాయల రుణాలను అందిస్తోందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు చిన్నతరహా వ్యాపారాలను ప్రారంభించడంతో పాటు, తాము నేర్చుకున్న నైపుణ్యాలకు అనుగుణంగా ఉత్పత్తులను తయారు చేసి విక్రయించడం ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చన్నారు. ప్రతి మహిళ ఏదో ఒక నైపుణ్యాన్ని కలిగి ఉండేలా రైజ్ కేంద్రంలో వివిధ రకాల శిక్షణా కోర్సులను నిర్వహిస్తున్నామని తెలిపారు. శిక్షణ పొందిన మహిళలు కేవలం శిక్షణతో ఆగిపోకుండా, తమ నైపుణ్యాలను ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్, బ్రాండింగ్ తదితర అంశాలతో అనుసంధానం చేసుకుని స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగాలని సూచించారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల వివరాలను అడిగి తెలుసుకున్న ఆయన, వాటి ఉత్పత్తి వ్యయం, విక్రయ ధర, మార్కెటింగ్ విధానం, బ్రాండింగ్, ఉత్పత్తులకు లభిస్తున్న ఆదరణ తదితర అంశాలపై మహిళలతో చర్చించారు. ఉత్పత్తుల నాణ్యతను మరింత మెరుగుపరచడంతో పాటు, వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా కొత్త ఉత్పత్తులను రూపొందించాలని సూచించారు. మంచి ఉత్పత్తి తయారీతో పాటు దానికి సరైన మార్కెటింగ్, ఆకర్షణీయమైన ప్యాకేజింగ్, బ్రాండింగ్ ఎంతో ముఖ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. రైజ్ కేంద్రం ద్వారా అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలను మహిళలు సద్వినియోగం చేసుకుని తమలోని ప్రతిభను వెలికితీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. శిక్షణ ద్వారా పొందిన నైపుణ్యాలను ఆదాయ వనరులుగా మార్చుకుని, కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడంతో పాటు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే స్థాయికి మహిళలు ఎదగాలని ఆకాంక్షించారు. మహిళలకు అవసరమైన శిక్షణ, మార్గదర్శకత్వం, ఆర్థిక సహకారం అందించడం ద్వారా వారిని స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ ఏఎన్వీ నాంచారరావు, రైజ్ మేనేజర్ బి. తేజస్విని, డీఆర్డీఏ సిబ్బంది, రైజ్ కేంద్రం సిబ్బంది, శిక్షణ పొందిన మహిళలు తదితరులు పాల్గొన్నారు.




# కూటమి ప్రభుత్వ రెండేళ్ల అభివృద్ధి

సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి గోపు సత్యనారాయణ

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా
కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరవేసే లక్ష్యంతో నిర్వహిస్తున్న "కూటమి ప్రభుత్వం 2 ఏళ్ల అభివృద్ధి–సంక్షేమం" ఇంటిం టి ప్రచార కార్యక్రమంలో భాగంగా పెడన నియోజకవర్గం గూడూరు మండలం క్లస్టర్–2లో కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ ఇంటింటి పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజలను నేరుగా కలుసు కుని కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, ప్రజలకు అందుతున్న ప్రయోజనాలు, గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి–సంక్షేమ ఫలాలను ప్రతీ కుటుంబానికి తీసుకెళ్లి ప్రజలకు వాస్తవాలను వివరించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని గోపు సత్యనారాయణ తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని, ప్రభుత్వం అందిస్తున్న ఫలాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా పార్టీ శ్రేణులు ప్రజలతో మమేకమై పనిచేయాలని ఆయన సూచించారు.ప్రధాన ముఖ్యాంశాలు:ప్రచార లక్ష్యం: రెండేళ్ల పాలనలోని అభివృద్ధి–సంక్షేమ పథకాల వాస్తవాలను నేరుగా ప్రజలకు వివరించడం.కార్యకర్తలకు దిశానిర్దేశం: అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు అందేలా నాయకులు, కార్యకర్తలు నిరంతరం శ్రమించాలి.పాల్గొన్న నాయకులు: ఈ కార్యక్రమంలో గూడూరు మండల పార్టీ అధ్యక్షుడు గోపి నాగబాబు, కృష్ణా జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు అన్నం హరి రామకృష్ణ, జిల్లా కార్యాలయ కార్యదర్శి బత్తిన దాస్, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి ఎస్.ఎ. బేగ్, ప్రభుత్వ ఆసుపత్రి డైరెక్టర్ బేతాళ స్వామి పాల్గొన్నారు. వీరితో పాటు టీడీపీ నాయకులు సూరిబాబు, గోరిపర్తి రాజబాబు, శీలం పవన్ కళ్యాణ్, బచ్చుల రామాంజనేయులు, గోరిపర్తి బుచ్చిరాజు తదితరులు పాల్గొని ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# మచిలీపట్నం జనసేనలో మేయర్ పదవి రాజకీయం



**పవన్ కళ్యాణ్ పుట్టినరోజు భేటీ పేరుతో డ్రామా?**

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా
మచిలీపట్నంలో జనసేన పార్టీ అంతర్గత విభేదాలు ఒక్కసారిగా బట్టబయలయ్యాయి. మేయర్ పదవిని దక్కించుకునేందుకు బండి రామకృష్ణ మద్దతుదారులు వేసిన ఎత్తుగడలు పార్టీలో తీవ్ర దుమారం రేపుతున్నాయి. పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకల ప్రణాళికపై చర్చించేందుకని పిలిచి, రహస్యంగా మేయర్ పదవి కోసం ఏకగ్రీవ తీర్మానం రాయించుకుని సంతకాలు సేకరించడంపై కొట్టే వెంకట్రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.కొట్టే వెంకట్రావు లేవనెత్తిన ప్రధాన ప్రశ్నలు & ఆరోపణలు: పుట్టినరోజు సాకుతో కుట్ర: అధినేత పుట్టినరోజు వేడుకల సమావేశం అని చెప్పి, ముందస్తు సమాచారం లేకుండా మేయర్ పదవికి తీర్మానం చేయడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటి?ఏకగ్రీవం ఎలా అవుతుంది?: కొంతమంది నాయకులు మాత్రమే సంతకాలు చేస్తే, దాన్ని జనసేన పార్టీ మొత్తం తీసుకున్న "ఏకగ్రీవ నిర్ణయం" అని అధిష్టానానికి ఎలా పంపుతారు?మాట మార్చడం ఏంటి?: గతంలో టీడీపీ నుంచి జనసేనలోకి ఆహ్వానించే సమయంలో తన అనుభవం, ప్రజాదరణ గుర్తించి మేయర్ పదవికి తగిన అర్హత ఉందని నమ్మించారని, తీరా పార్టీలోకి వచ్చాక మాట మార్చడం ఏంటని కొట్టే వెంకట్రావు ప్రశ్నించారు.ఏకపక్ష నిర్ణయాలు చెల్లవు: స్థానిక ఎంపీ, అసెంబ్లీ నియోజకవర్గ నాయకులు మరియు ప్రజాప్రతినిధుల అందరి అభిప్రాయాలు తీసుకోకుండా హడావిడిగా నిర్ణయం ఖరారు చేయడం సరైన పద్ధతి కాదని స్పష్టం చేశారు.మున్సిపాలిటీపై పట్టున్న వెంకట్రావు డిమాండ్తనకు సుదీర్ఘ రాజకీయ అనుభవంతో పాటు మున్సిపాలిటీ వ్యవహారాలపై పూర్తి అవగాహన, ప్రజల్లో మంచి ఆదరణ ఉన్నాయని పేర్కొన్న వెంకట్రావు, మేయర్ ఎంపికపై అధిష్టానంతో పాటు ఎంపీ సమక్షంలో విస్తృత స్థాయి చర్చ జరగాలని డిమాండ్ చేస్తున్నారు.కొద్దిమంది సంతకాలతో మేయర్ ఎంపిక ముగిసిపోయిందా? లేక అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అధిష్టానం న్యాయం చేస్తుందా? అన్నది ఇప్పుడు మచిలీపట్నం జనసేన వర్గాల్లో హాట్ టాపిక్గా మారింది. ఈ విభేధాలపై పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ మరియు అధిష్టానం ఎలా స్పందిస్తుందో వేచి చూడాల్సి ఉంది.

# 629 ఏఈఈ పోస్టులకు 1.05 లక్షల మంది పోటీ

**23 నుంచి పారదర్శకంగా ఏపీసీపీడీసీఎల్ కంప్యూటర్ ఆధారిత పరీక్షలు**

**రోజుకు రెండు షిఫ్టుల్లో సీబీటీ విధానం**

**దళారులను నమ్మి మోసపోవద్దు: సీఎండీ**



**పి. పుల్లారెడ్డి హెచ్చరిక**

ప్రజాభూమి బ్యూరో కృష్ణ జిల్లా
రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో ఖాళీగా ఉన్న 629 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఎలక్ట్రికల్) పోస్టుల భర్తీకి ఈ నెల 23 నుంచి 27 వరకు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (CBT) నిర్వహించనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి తెలిపారు. ఈ పోస్టుల కోసం రాష్ట్రవ్యాప్తంగా 1.05 లక్షల మంది అభ్యర్థులు పోటీపడుతున్నారని, పరీక్షలను పూర్తి పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన వెల్లడించారు.పరీక్ష నిబంధనలు & మార్గదర్శకాలు:పరీక్షల సమయాలు:పరీక్షలు రోజుకు రెండు షిఫ్టుల్లో జరుగుతాయి.మొదటి షిఫ్ట్: ఉదయం 9:00 నుండి మధ్యాహ్నం 12:00 వరకురెండో షిఫ్ట్: మధ్యాహ్నం 2:30 నుండి సాయంత్రం 5:30 వరకునిబంధనలు & తనిఖీలు:అభ్యర్థులు ఒరిజినల్ హాల్టికెట్తో పాటు ఏదైనా ఒక ఒరిజినల్ ఫొటో గుర్తింపు కార్డు (ఆధార్, పాన్, ఓటర్ ఐడీ, పాస్పోర్ట్ లేదా డ్రైవింగ్ లైసెన్స్) తప్పనిసరిగా తీసుకురావాలి.కేంద్రాల వద్ద ఫేస్ వెరిఫికేషన్, మెటల్ డిటెక్టర్లతో కఠిన తనిఖీలు ఉంటాయి.నిషేధిత వస్తువులు:మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచీలు, కాలిక్యులేటర్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, పుస్తకాలు, కాగితాలకు కేంద్రాల్లోకి అనుమతి లేదు.జాగ్రత్త:ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ దళారులు చేసే ఆశల ప్రచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దు. కేవలం అధికారిక ప్రకటనలను మాత్రమే విశ్వసించాలని సీఎండీ పి. పుల్లారెడ్డి అభ్యర్థులకు స్పష్టం చేశారు.

# కూటమి ప్రభుత్వంలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట

**ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం**

**ప్రజల నుంచి వినతులు స్వీకరించిన విక్కుర్తి**



ప్రజా భూమి ప్రతినిధి అవనిగడ్డ
ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలనే ఉద్దేశంతో అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ విక్కుర్తి శ్రీనివాసరావు శ్రీకాకుళంలో ప్రజాదర్బార్ నిర్వహించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమ స్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రాలు అందజేశారు.ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని విక్కుర్తి శ్రీనివాసరావు స్వయంగా స్వీకరించి, సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామా ల్లో నెలకొన్న రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, సంక్షేమ పథకాలు, ఇతర ప్రజా సమస్యలను పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని విక్కుర్తి శ్రీనివాసరావు తెలిపారు. గతంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులకు ఊపునిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.ప్రజలకు అందుబాటులో ఉండే పాలన అందించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనాలు క్షేత్రస్థాయిలో ప్రతి కుటుంబానికి చేరేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని విక్కుర్తి సూచిం చారు. ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి ప్రజాదర్బార్ను నిరంతరం నిర్వహిస్తూ, ప్రజలకు మరియు ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తానని విక్కుర్తి శ్రీనివాసరావు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



# మచిలీపట్నం జనసేన మేయర్ అభ్యర్థిగా 'బండి రామకృష్ణ'




**నగర అధ్యక్షుడు గడ్డం రాజు ప్రతిపాదన..**

**ఏకగ్రీవంగా ఆమోదించిన నాయకులు, శ్రేణులు**

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా
మచిలీపట్నం నగరపాలక సంస్థ రాబోయే ఎన్నికల నేపథ్యంలో జనసేన పార్టీ కీలక అడుగు వేసింది. మచిలీపట్నం మేయర్ అభ్యర్థిగా జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్, డిసిఎంఎస్ (DCMS) చైర్మన్ బండి రామకృష్ణ పేరును పార్టీ శ్రేణులు ఏకగ్రీవంగా తీర్మానించాయి.స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో నగర అధ్యక్షుడు గడ్డం రాజు అధ్యక్షతన నిర్వహించిన 'జనసేన కుటుంబ సభ్యుల ఆత్మీయ సమావేశం'లో ఈ ప్రతిపాదన రూపుదిద్దుకుంది.సమావేశంలో చోటుచేసుకున్న ముఖ్య విశేషాలు:ఏకగ్రీవ ప్రతిపాదన: నగర అధ్యక్షుడు గడ్డం రాజు.. మేయర్ అభ్యర్థిగా బండి రామకృష్ణ పేరును సమావేశంలో అధికారికంగా ప్రతిపాదించి తీర్మానం ప్రవేశపెట్టారు.పూర్తి మద్దతు: మచిలీపట్నం పరిధిలోని 34 పంచాయతీలు, 50 డివిజన్ల ఇన్చార్జిలు, మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు మరియు వివిధ విభాగాల జనసేన నాయకులు ఈ తీర్మానానికి హర్షధ్వానాల మధ్య ఏకగ్రీవ ఆమోదం తెలిపారు.
పవన్ కళ్యాణ్ వద్దకు ప్రతిపాదనలు: తీర్మానించిన సంతకాల పత్రాలను జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి, బండి రామకృష్ణ అభ్యర్థిత్వాన్ని మేయర్ అభ్యర్థిగా ఆఖరిగా ఖరారు చేయాల్సిందిగా కోరనున్నట్లు గడ్డం రాజు వెల్లడించారు.సమావేశంలో నాయకుల ప్రసంగాలు:బండి రామకృష్ణ: తన పేరును మేయర్ అభ్యర్థిగా ప్రతిపాదించి, ఏకగ్రీవంగా మద్దతు తెలిపినందుకు జనసేన పార్టీ కుటుంబ సభ్యులకు, నాయకులకు పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.గడ్డం రాజు (నగర అధ్యక్షుడు): పార్టీ శ్రేణులంతా ఒకే మాటపై నిలబడి బండి రామకృష్ణ పేరును ఏకగ్రీవంగా ఆమోదించడం పట్ల తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. జనసేన జెండాను మచిలీపట్నంలో రెపరెపలాడించేందుకు ప్రతీ ఒక్కరూ శ్రమించాలని పిలుపునిచ్చారు.ఈ ఆత్మీయ సమావేశంలో మచిలీపట్నం నియోజకవర్గానికి చెందిన వివిధ స్థాయిల జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఎల్.పొన్నవోలు గ్రామంలో రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాభూమి ప్రతినిధి, మాడుగుల:
మాడుగుల మండలం ఎల్.పొన్నవోలు గ్రామంలో నూతన రామాలయ నిర్మాణానికి గురువారం భూమిపూజ నిర్వహించారు. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి రూ.30 లక్షల నిధులు మంజూరు చేసినట్లు గ్రామ పెద్దలు తెలిపారు.ఈ కార్యక్రమానికి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన రామాలయ నిర్మాణం పూర్తయితే గ్రామ ప్రజలతో పాటు భక్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు.కార్యక్రమంలో సత్తిబాబు, రాజ్కుమార్, సంతోష్తో పాటు గ్రామ పెద్దలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రోడ్డు మార్జిన్ పనులు పూర్తి చేయండి

ప్రజాభూమి ప్రతినిధి-పెదపాడు



గత 5 సంవత్సరాలుగా జరుగుతున్న వంకాయ గూడెం, పెరికిడు రోడ్డు అభివృద్ధి పనులు స్థానిక గ్రామస్తులకు ప్రయాణదారులకు చాలా ఇబ్బందికరంగా మారాయి. సంవత్సరాలు తరబడి పనులు మాత్రం నత్తనడకనే సాగుతున్నాయి. ఒక్కొక్క గ్రామంలో ప్రజలు ఈ రోడ్డు పనులు వల్ల అనేక అవస్థలు పాలవుతున్నారు. వాహనదారుల పరిస్థితి అయితే చెప్పనక్కర్లేదు. రోడ్డు పనులు జరుగుతున్నంత సేపు వాహనాల రాకపోకలకు చాలా అవస్థలు పడాల్సిందే. ఇటీవల కాలంలో పెదపాడు మండలం కొత్తూరు గ్రామంలో గ్రామ శివారు వ్యవసాయ మార్కెటింగ్ చెక్పోస్ట్ దగ్గర రోడ్డు అభివృద్ధి పనులను గుత్తేదారులు ప్రారంభించారు. దీంతో రోడ్డు పక్కన 100 మీటర్ల పైగా రోడ్డు మార్జిన్ తవ్వారు. తర్వాత పరిన్ని పూర్తి చేయడానికి మాత్రం పట్టించుకున్న దాఖలాల శూన్యం. ఆ ప్రాంతంలో ఉన్న నివాసదారులు, చిరు దుకాణాలతో వ్యాపార నిర్వహించేవారు చాలా ఆస్తులు పడుతున్నారు. రాకపోకలు సాగించే వాహనాలు సైతం ఆ ప్రాంతంలో ఎటువంటి ప్రమాదం పొంచి ఉందని తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్ అండ్ బి అధికారులు అక్కడ ఉన్న సమస్యపై దృష్టి సారించి త్వరితగతిన రోడ్డు మార్జిన పనులను ప్రారంభించి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రోడ్డు పనులను తక్షణం ప్రారంభించి ప్రజలు పడుతున్న అవస్థలను తొలగించాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

# శోభనాచల క్షేత్రంలో వైభవంగా పవిత్రోత్సవాలు

- శాస్త్రోక్తంగా నాలుగు రోజుల పాటు ఉత్సవాలు
- గరుడోత్సవంతో ముగింపు

ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి



సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఆగిరిపల్లిలోని శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి వారి పవిత్రోత్సవాలను శనివారం నుంచి మంగళ వారం వరకు శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి సిహెచ్. సాయి తెలిపారు. శనివారం అంకురార్పణతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టి, ఆదివారం సర్వదేవతాహ్వానం, వాస్తుపూజ, వాస్తుహోమం, నవకలశ పంచామృత స్నపనం, సహస్రనామార్చన, పవిత్రముల ధాన్యాధివాసం, శాంతిహోమం, చతుర్వేద పారాయణం, తీర్థప్రసాద వినియోగం నిర్వహించనున్నట్లు తెలిపారు. సోమవారం స్వామివారికి విశేషార్చన, చతుర్దశ కలశారాధన, స్నపన అలంకరణ, మూలమంత్ర హోమం, దిగువ సన్నిధి స్వామివార్లకు పవిత్రముల సమర్పణ, నవకుంభారాధన, శాంతిహోమం, నీరాజన మంత్రపుష్పాలు, తీర్థప్రసాద వినియోగం జరుగుతాయని పేర్కొన్నారు. మంగళవారం విశేషార్చన, నిత్యహోమాలు, శ్రీ లక్ష్మీనరసింహ సుదర్శన మూలమంత్ర హోమం, పవిత్రముల విసర్జన, మహాపూర్ణాహుతి, శ్రీ భూనీళా సమేత శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామివార్ల శాంతి కల్యాణం, ఉభయదాతలకు ఆశీర్వచనం, పవిత్రముల వితరణ, నీరాజనం, మంత్ర పుష్పం, తీర్థప్రసాద వినియోగం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విశ్రాంత ఆచార్యులు, పొన్నూరు శ్రీ భవన్ నారాయణ ఓరియంటల్ కళాశాల అధ్యాపకులు నిష్ఠల సుబ్రహ్మణ్యశాస్త్రి ఆధ్వర్యంలో 'శ్రీ నరసింహ వైభవం' ప్రవచనం నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు గరుడోత్సవంతో పవిత్రోత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రధానార్చకులు వేదాంతం శేషుబాబు తెలిపారు.

# జీలుగుమిల్లి సర్కిల్ పోలీసులకు నేర పరిశోధన మరియు పరేడ్‌పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించిన పోలవరం డిఎస్పి శ్రీ జయ కృష్ణ

ప్రజా భూమి ప్రతినిధి-జీలుగుమిల్లి



ఏలూరు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, పోలవరం డీఎస్పీ జయకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమమును శుక్రవారం జీలుగుమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో పోలీస్ సిబ్బందికి పరేడ్ నిర్వహించారు. జీలుగుమిల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. యాదగిరి ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బందికి శిక్షణ తరగతులు చేపట్టారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేర దర్యాప్తు సమయంలో నేరం జరిగిన ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించడం మరియు నేరస్తుల పరిశీలన నివేదికను పద్ధతి ప్రకారం ఎలా రూపొందించాలనే అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. నేర స్థలాన్ని ఫోటోగ్రఫీ చేసే విధానం, సీన్ ఆఫ్ ఎఫెక్ట్స్‌ను ముందుగా ఎలా చిత్రీకరించాలి, మరియు ఆ ప్రాంతాన్ని భద్రపరిచే మెలుకువలను వివరించారు. ఘటనా స్థలంలో లభించే భౌతిక మరియు ఇతర సాక్ష్యాలను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా శాస్త్రీయ పద్ధతిలో సేకరించి భద్రపరిచే విధానంపై శిక్షణనిచ్చారు. ఘటనా స్థలంలో కచ్చితమైన స్కెచ్ తయారీ, సాక్షుల వాంగ్మూలాల నమోదు మరియు సమర్థవంతమైన నేర పరిశోధనలో పాటించాల్సిన విధివిధానాలపై చర్చించారు. నేర పరిశోధనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ, కోర్టులో నిలిచేలా సాక్ష్యాలను పకడ్బందీగా సేకరించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో జీలుగుమిల్లి ఎస్సై వి. క్రాంతి కుమార్, బుట్టాయగూడెం ఎస్సై చెన్నా రావు, టి. నరసాపురం ఎస్సై జయ బాబు మరియు సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది యొక్క వృత్తిగత నైపుణ్యాలను, దర్యాప్తు ప్రమాణాలను పెంచడానికి ఈ పరేడ్ మరియు శిక్షణా తరగతులు ఎంతగానో దోహదపడ్డాయి అని పోలవరం డీఎస్పీ శ్రీ జయ కృష్ణ తెలియ చేసినారు.

# సౌభాగ్యాన్ని, ఐశ్వర్యాన్ని ఇచ్చే వరలక్ష్మి దేవత పూజలు

ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.



శ్రావణమాసం శుక్లపక్షంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారాన్ని వరలక్ష్మీ వ్రతంగా జరుపుకోవడం ఒక హిందూ ఆచారం, వరలక్ష్మీ దేవత విష్ణు మూర్తి భార్య. హిందూ మతం ప్రకారం ఈ పండగ విశిష్టమైనది, వరాలు యిచ్చే దేవతగా, సౌభాగ్యాన్ని, ఐశ్వర్యాన్ని ఇచ్చే వరలక్ష్మీ దేవిని కొలుస్తారు, అట్టి వరలక్ష్మి దేవి వ్రతంని మండలంలోని గ్రామ గ్రామాన మహిళా భక్తులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ రోజున వరలక్ష్మి దేవతను పూజిస్తే అష్టలక్ష్మీ పూజలకు సమానం అనే నమ్మకంతో కుటుంబ సభ్యులు కూడా పాలుపంచుకుంటారు. ముఖ్యంగా మంచి భర్త, కుమారులు కలగాలని కూడా అమ్మాయిలు పూజిస్తారు. ఈ దేవతను పూజిస్తే అష్టైశ్వర్యాలు అయిన సంపద, భూమి, శిక్షణ, ప్రేమ, కీర్తి, శాంతి, సంతోషం, శక్తి వంటివి లభిస్తాయని ప్రగాఢ విశ్వాసం. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా మండల ప్రజలు ఉదయాన్నే లేచి తలస్నానం చేసి, ఇంటిని శుభ్రం చేసుకోనీ, ఇంట్లోని పూజా మందిరంలో ఒక మండపాన్ని ఏర్పాటు చేసుకొన్నారు. ఈ మండపం పైన బియ్యపు పిండితో ముగ్గువేసి, కలశం ఏర్పాటు చేసుకోనీ అమ్మవారి ఫొటో లేదా రూపును తయారుచేసి అమర్చు కున్నారు. పూజా సామగ్రి, తోరాలు, అక్షతలు, పసుపు గణపతిని ముందుగానే సిద్ధం చేసుకుని ఉంచారు. తెల్లటి దారాన్ని ఐదు లేక తొమ్మిది పోగులు తీసుకుని దానికి పసుపు రాశి ఆ దారానికి ఐదు లేక తొమ్మిది పూలు కట్టి ముడులు వేసి అంటే ఐదు లేక తొమ్మిది పోగుల దారాన్ని ఉపయోగించి, ఐదు లేక తొమ్మిదో పువ్వులతో ఐదులేక తొమ్మిది ముడులతో తోరాలను తయారుచేసుకుని, పీఠం వద్ద ఉంచి పుష్పాలు, పసుపు, కుంకుమ, అక్షతలు వేసి, తోరాలను పూజించి ఉంచుకోవాలి.

ఆవిధంగా తోరాలను తయారుచేసుకునీ, పులిహోర, పరవణ్ణం, బూరెలు అన్ని పిండి వంటలు నైవేద్యంగా సమర్పించి పండుగను అత్యంత ఘనంగా జరుపుకున్నారు. అలాగే ఇరుగు పొరుగు వారికి, బంధువులకు ముత్తైదువులకు తాంబూలాలు సమర్పించారు.

## ర్యాలి గ్రామంలో ఘనంగా

# యువ నాయకుడు బండారు సంజీవ్ జన్మదిన వేడుకలు

**ఊబలంక మదర్ థెరిస్సా అంధుల మనోవికాస కేంద్రంలో చిన్నారులకు స్వీట్లు, దుప్పట్ల పంపిణీ.**



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.

కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తనయుడు, యువ నాయకుడు బండారు సంజీవ్ జన్మదిన వేడుకలు ర్యాలి గ్రామంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కూసంపూడి రామకృష్ణంరాజు, గ్రామ టీడీపీ నాయకుడు పాలింగి రవిచంద్ర ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంజీవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యువ నాయకుడు బండారు సంజీవ్ తండ్రి ఎమ్మెల్యే బండారు సత్యనందరావు బాటలో పయనిస్తూ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని యువతకు మేఘాజాబ్ మేళా నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పించడం, సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం ఊబలంక గ్రామంలోని మదర్ థెరిస్సా అంధుల మనోవికాస కేంద్రాన్ని సందర్శించిన నాయకులు అక్కడి చిన్నారులకు స్వీట్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. చిన్నారులతో కొంత సమయం గడిపి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పుట్టినరోజు వేడుకలను సామాజిక సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ద్వారా మానవతా విలువలను చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మద్దూరు సుబ్బారావు, పెండెం వెంకన్న, పాలింగి రవిచంద్ర, తోట రజిని, గార్లపాటి గోపాలకృష్ణమూర్తి, గుడెల నాగేంద్ర, కోటారపు మణికంఠ, దిడ్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఈగల్ టీం ఆధ్వర్యంలో రైళ్లలో గంజాయి అక్రమ రవాణాపై తనిఖీలు

ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా



ఈగల్ ఐజీపీ ఆకే రవికృష్ణ, ఏలూరు ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఆదేశాలపై ఏలూరులో ఈగల్ ఆధ్వర్యంలో 12841 కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో ఈగల్, పోలీస్, ఎక్సైజ్, జీఆర్పీ, ఆర్‌పీఎఫ్ విభాగాల సిబ్బంది సంయుక్తంగా పాల్గొని, ఒడిశా నుండి ఏలూరు మీదుగా వచ్చే 12841 కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించే అనుమానిత వ్యక్తులు, వారి బ్యాగులు, లగేజీ అనుమానాస్పద వస్తువులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు రూరల్ ఎస్ఐ నాగబాబు, ఈగల్ ఆర్ఎస్ఐ బి. ఉదయభాస్కర్, ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ ఎస్ఐ గౌరీ శంకర్ ఇతర పోలీస్, ఎక్సైజ్, జీఆర్పీ, ఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రావణ శుక్రవారం ప్రత్యేక పూజలు

ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి



శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా శోభనాచల గట్టుపై శ్రీ మల్లికార్జున స్వామి వారికి, బస్టాండ్ సమీపంలోని శ్రీ విశ్వేశ్వర స్వామివారి సన్నిధిలో ప్రత్యేక అభిషేకాలు, అలం కరణ, సహస్ర నామార్చనలు నిర్వహించారు. వరాహ పుష్కరిణి సమీపంలోని స్వయంభు శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో లలితా సహస్రనామార్చన, కుంకుమార్చన, సహస్ర పుష్పార్చన చేపట్టారు. ఆలయ అర్చకులు దేవులపల్లి శ్రీనివాసమూర్తి తీర్థప్రసా దాలు అందజేశారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి సి. హెచ్. సాయి పర్యవేక్షించారు.

## మెగా డీఎస్సీపై వైసీపీ ఆరోపణలు నిరూపించాలి



ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు

మెగా డీఎస్సీపై అసత్య ఆరోపణలు చేస్తున్న వైసీపీ నేతలు వాటిని నిరూపించేందుకు అసెంబ్లీలో ప్రస్తావించలేకపోయారని టీడీపీ జిల్లా అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి విమర్శించారు. శుక్రవారం ఏలూరు పవర్‌పేటలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విసిరిన బహిరంగ సవాల్‌ను స్వీకరించలేక వైసీపీ నేతలు చేతులెత్తేశారని ఎద్దేవా చేశారు. మెగా డీఎస్సీపై విచారణ కోరుతున్న వైసీపీ నేతలు ఆ అంశాన్ని అసెంబ్లీలో ఎందుకు లేవనెత్తలేదని ప్రశ్నించారు. గతంలో గ్రూప్-1 పరీక్షలపై సిట్ నివేదికలో వెల్లడైన అంశాలపై ముందుగా విచారణ కోరాలని సూచించారు. ప్రజా సమస్యలను పక్కనపెట్టి స్వలాభం కోసం రాద్ధాంతం చేస్తే రానున్న రోజుల్లో వైసీపీకి ఒక్క సీటు కూడా దక్కదని బడేటి చంటి హెచ్చరించారు.

## దుగ్గిరాల బాలరావమ్మకు ఘనంగా ప్రత్యేక పూజలు

### -శ్రావణ మాస రెండో శుక్రవారం సందర్భంగా భక్తుల సందడి


ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి



శ్రావణ మాస రెండో శుక్రవారం సందర్భంగా ఆగిరిపల్లి ఇలవేల్పయిన శ్రీ దుగ్గిరాల బాలరావమ్మ అమ్మవారికి విశేష అభిషేకాలు, అలంకరణ, కుంకుమార్చన వంటి ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై పాలు, పొంగళ్లు అమ్మవారికి సమ ర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా ఉదయం విజయవాడ రోడ్డులోని పోతురాజు దిమ్మ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామానికి శాంతి, సౌభాగ్యం కలగాలని ప్రార్థించారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని ఊరేగింపుగా తీసుకువచ్చి పసుపు, కుంకుమలు సమర్పిం చి ఉత్సవాలను ప్రారంభించారు. సాయంత్రం డప్పు వాయిద్యాల నడుమ అమ్మవారికి ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి.

## తడికలపూడిలో తాగునీటి తిప్పలు: వాటర్ ట్యాంకర్లే దిక్కు!

ప్రజా భూమి ప్రతినిధి-కామవరపుకోట



తడికలపూడి పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీ నాగుల చెరువు గట్టు వద్ద ఉన్న మంచి నీటి మోటార్ కేబుల్ వైరు పాడై సుమారు పది రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోక పోవడంతో తాగునీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చింది. నీటి సరఫరా నిలిచిపోవడంతో కాల నీవాసులు నీటి కోసం తీవ్ర అవస్థలు పడుతున్నారు. మోటార్ పునరుద్ధరణకు నానాటికీ ఆలస్యం అవుతుండటంతో, పంచాయతీ సరఫరా చేసే వాటర్ ట్యాంకర్ల వద్ద లేదా స్వచ్ఛందంగా తెప్పించే ట్యాంకర్ల వద్ద పెద్ద ఎత్తున బిందెలు, డ్రమ్ములు పట్టుకుని క్యూ లైన్లలో నిలబడాల్సిన దుస్థితి ఏర్ప డింది. గంటల తరబడి కాచి ఉండి వాటర్ ట్యాంకర్ల నుండి నీటిని పట్టుకుంటూ కాలనీ ప్రజలు తీవ్ర నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ సమస్యను పది రోజులుగా పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహించడంపై పంచాయతీ అధికారుల తీరుపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, మోటార్ కేబుల్ ను బాగు చేయించి పైపులైన్ ద్వారా తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రజాదర్బార్ లో వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే బండారు

ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట.



కొత్తపేట మండలం వాడపాలెం గ్రామంలోని తన కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆయన వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 13 వినతులు, ఫిర్యాదులు అందినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలు సమర్పించిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు పంపించి, వాటిని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు స్పష్టం చేశారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్



ప్రజా భూమి ప్రతినిధి-చింతలపూడి

చింతలపూడి పట్టణంలోని శాసనసభ్యుల వారి కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారుఈ సందర్భంగా కార్యాలయానికి వచ్చిన ప్రజలు వారి సమస్యలను శాసనసభ్యులు శ్రీ సొంగా రోషన్ కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల నుంచి వినతులను స్వీకరించి, ఆయా సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని శాసనసభ్యులు తెలిపారు.

## చింతలపూడి పోలీసుల ప్రత్యేక కవాతు





ప్రజా భూమి ప్రతినిధి-చింతలపూడి

ఏలూరు జిల్లా చింతలపూడి పోలీసులు స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో ప్రత్యేక కవాతు నిర్వహించారు. ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాలపై జంగారెడ్డి గూడెం డిఎస్పి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చింతలపూడి సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, స్టేషన్ సిబ్బంది కి కవాతు నిర్వహించినట్లు ఇన్స్పెక్టర్ క్రాంతి కుమార్ తెలిపారు. ఈ కవాతు వలన సిబ్బందికి దేహదారుఢ్యం, వృత్తిపరమైన క్రమశిక్షణ మరియు అప్రమత్తత పెరిగి మానసిక ఒత్తిడికి లోను కాకుండా విధులు నిర్వహించే అవకాశం ఉంటుందని సీఐ తెలిపారు. అనంతరం డా. నరేష్ (ఐటిబిపి) ఆధ్వర్యంలో సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

## ఘనంగా బండారు సంజీవ్ జన్మదిన వేడుకలు



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.

కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తనయుడు, యువ నాయకుడు బండారు సంజీవ్ జన్మదిన వేడుకలను శుక్రవారం ఆయన అభిమానులు, తెలుగు యువత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కొత్తపేట మండలం వాడపాలెం, కొత్తపేటలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. వాడపాలెం గ్రామంలో అభిమానులు కేక్ కట్ చేసి సంజీవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పేదలకు స్వీట్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. గ్రామ దేవత మారెమ్మ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి బండారు రాజేష్ సమకూర్చిన రూ.50 వేల విరాళాన్ని సంజీవ్ చేతుల మీదుగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అలాగే కొత్తపేట పాత బస్టాండ్ సెంటర్‌లోనూ అభిమానులు కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. స్థానిక అన్నా క్యాంటీన్‌లో కొత్తపేట నియోజకవర్గ తెలుగు యువత ఆధ్వర్యంలో పేదలకు ఉచితంగా భోజనం అందించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు బండారు సంజీవ్ పాల్గొని భోజనం పంపిణీ చేశారు. జన్మదినం సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు, ప్రముఖులు సంజీవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# పెండింగ్ లో ఉన్న ఇంటి విలువల నగదును తక్షణమే లబ్ధిదారులకి ఇవ్వాలి

ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో నిర్వాసితులవుతున్న వారి పెండింగ్ లో ఉన్న ఇంటి విలువల నగదును తక్షణమే లబ్ధిదారుల ఇవ్వాలని, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సున్నం రాజులు అన్నారు. మండలంలోని రేకపల్లి కేంద్రంలో బొప్పెన్ భీమయ్య కార్యాలయంలో కారం సుందరయ్య అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సున్నం రాజులు మాట్లాడుతూ మండలంలోని వడ్డిగూడెం, విఆర్ పురం, గుండుగూడెం, చింతరేగుపల్లి, రాజుపేట గ్రామాల్లో ఇంటి నిర్మాణ విలువల నగదును ఇంతవరకు పడలేదని రీవాల్యుయేషన్ పెట్టుకున్న వారికి అమౌంటు లక్ష తగ్గించి కొడతామని చెప్పటం ఏ జీవోలో ఉందని, ఏ జీవో ప్రకారం గా తగ్గించి కొడతారని యద్దోవా చేశారు. లక్ష తగ్గించి కొడుతున్న అన్న అమౌంటు ఎవరి జేబులోకి వెళ్తుంది ప్రభుత్వం అధికారులు చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారులు మాకు ఇష్టం వచ్చినట్టు చేస్తాం అనడం ఎంతవరకు న్యాయం అమాయక ప్రజలను ఇష్టమొచ్చినట్టుగా మాట్లాడటం సరైన పద్ధతి కాదని, ప్రాజెక్ట్ కోసం ఇంత త్యాగం చేస్తుంటే ప్రభుత్వం అధికారులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారా, రివాల్యుయేషన్ పెట్టుకున్న వారికి అమౌంటు కొట్టడానికి అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఇంటి వాల్యుయేషన్ కొంత మందికి చిన్న ఇంటి నిర్మాణానికి పెద్ద అమౌంట్, కొంత మందికి పెద్ద ఇంటికి నిర్మాణానికి చిన్న అమౌంట్, ఇది అధికారుల నిర్లక్ష్యమే ఇంటి వ్యాల్యువేషన్ అమౌంట్ కొట్టడానికి లక్ష తగ్గించి కొడతామని అనడంలో అంతర్యం ఏమిటని అన్నారు. పోలవరం ప్రాజెక్టుకి ఇంత త్యాగం చేస్తున్నా పేద ప్రజలకు అధికారులు ఇచ్చే బహుమతి ఇదే అని నిలదీశారు. పెండింగ్ లో ఉన్న ఇంటి వ్యాలివేషన్ రీవాల్యుయేషన్ పెట్టుకున్న వారికి ఒక్క రూపాయి కూడా తగ్గకుండా రీ సర్వే చేసి



తక్షణమే అమౌంటు వాళ్ళ ఖాతాలోకి జమ చేయాలని, లేని పక్షంలో ప్రజల్ని కూడగట్టి ఐటిడి ముందు ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు కేటాయించడంలో విభజించి పాలిస్తున్న అధికారులు గ్రామ సభలో ఎక్కువ నిర్వాసిత కుటుంబాలు ఉంటే ఎక్కడ వారు కోరుకుంటే అక్కడే వాళ్లకి స్థలం ఇచ్చి ఇల్లు కట్టించి ఇవ్వాలి, కానీ ప్రభుత్వం వాళ్ల మధ్య విభేదాలు సృష్టించి గందరగోళానికి తెర లేపుతున్నారని వారు మండిపడ్డారు. తక్షణమే వారు కోరుకున్న చోటనే స్థలం కేటాయించి ఇల్లు కట్టించాలని వారు డిమాండ్ చేశారు. 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులకు కెప్టేట్ డేట్ తో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని అన్నారు. అధికారులు చేస్తున్న తప్పుల వలన, చట్టాల ఉల్లంఘనల వలన నిర్వాసిత కుటుంబాలకు రానున్న కాలంలో మరిన్ని సమస్యలు ఉత్పన్నం అయ్యే పరిస్థితి గిరిజనులలో ఓ టి ఎస్ ఆప్షన్ ఎంచుకోవడం ఇబ్బందులను కలుస్తుంది. గిరిజనులలో ఉండే ప్రభుత్వ ఉద్యోగులు కేవలం తమ వ్యక్తిగత ప్రయోజనాలను పరిగణించి అభిప్రాయాలు తెలియకుండా, పూర్తి గిరిజన సమూహ భవిష్యత్తు సురక్షిత స్థానంలో ఉంచే నిర్ణయాలను తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సోయం చిన్నబాబు, మండల కార్యదర్శి వర్గ సభ్యులు పంకు సత్తిబాబు, కారం సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా స్థానాలు పెంచాలి

## టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల బాబ్జి

ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో చేపడుతున్న వార్డుల పునర్విభజనలో భాగంగా గ్రామాల్లో పెరిగిన జనాభా, ఓటర్ల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని కొత్తపేట గ్రామ పంచాయతీలో వార్డుల సంఖ్యను పెంచాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల బాబ్జి కోరారు. కొత్తపేట గ్రామ పంచాయతీలో ప్రస్తుతం మొత్తం 20,674 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. వీరిలో 10,158 మంది పురుషులు, 10,516 మంది మహిళలు ఉన్నారని చెప్పారు. ప్రస్తుతం పంచాయతీలో 20 వార్డులు ఉండగా, ఒక్కో వార్డులో సుమారు 1,000 మందికి పైగా ఓటర్లు నమోదు కానున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా వార్డుల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. వార్డుల సంఖ్య పెరిగితే ఎంపీటీసీ స్థానాలు కూడా పెరిగే అవకాశం ఉందని బాబ్జి తెలిపారు. ప్రస్తుతం కొత్తపేట పంచాయతీలో ఆరు ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయని, వాటిలో నాలుగు ఎంపీటీసీ పరిధుల్లో ఒక్కో ఎంపీటీసీకి మూడు వార్డుల చొప్పున 3,000 మందికి పైగా ఓటర్లు



ఉండనున్నారని వివరించారు. మిగిలిన రెండు ఎంపీటీసీ పరిధుల్లో 4,000 మందికి పైగా ఓటర్లు ఉండనున్నారని తెలిపారు. అధిక సంఖ్యలో ఓటర్లు ఉండటం ఎంపీటీసీ అభ్యర్థులకు ఎన్నికల సమయంలో భారంగా మారే అవకాశం ఉందన్నారు. మండలంలోని ఇతర ప్రాంతాల్లో ఒక్కో ఎంపీటీసీ పరిధిలో సాధారణంగా 2,000 నుంచి 3,000 లోపు ఓటర్లు ఉండగా, కొత్తపేటలో రెండు ఎంపీటీసీ పరిధుల్లో 4,000 మందికి పైగా ఓటర్లు ఉండటం గమనార్హమన్నారు. జనాభా, ఓటర్ల నిష్పత్తిని పరిగణనలోకి తీసుకుని కొత్తపేట గ్రామ పంచాయతీలో వార్డుల పునర్విభజన చేపట్టి, వార్డుల సంఖ్యను పెంచాలని ముత్యాల బాబ్జి కోరారు. అదే విధంగా ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా ఎంపీటీసీ స్థానాలను కూడా పెంచాలని ప్రభుత్వానికి సూచించారు.

## స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం పై బొర్రా నరేష్ కుమార్ హర్షం





ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.

ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో బీసీల సాధికారతకు కూటమి ప్రభుత్వం మరో చారిత్రాత్మక అధ్యాయాన్ని లిఖించిందనీ, స్థానిక సంస్థల్లో బీసీలకు గ్రామీణ ప్రాంతాల్లో 34 శాతం, పట్టణాల్లో 33.33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని సీఎం చంద్రబాబు శాసనసభ వేదికగా ప్రకటించడం పై టీడీపీ మండల అధ్యక్షుడు బొర్రా నరేష్ కుమార్ శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. ఆవిర్భావం నుంచే బీసీలకు అండగా నిలిచిన టీడీపీ, ఎన్టీఆర్ వేసిన బలమైన పునాదిని మరింత బలోపేతం చేస్తూ ఈ నిర్ణయం తీసుకుంది. గతంలో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన ఘనత చంద్రబాబుదే కాగా, నేడు మళ్లీ ఆ హామీని నెరవేర్చి గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు బీసీ నాయకత్వాన్ని బలపరిచేందుకు శ్రీకారం చుట్టారనీ అన్నారు. బీసీలకు రాజకీయంగా మరింత ప్రాతినిధ్యం కల్పించేందుకు ఈ నిర్ణయం గొప్ప అవకాశంగా మారుతుందని, స్థానిక సంస్థల్లో బీసీల భాగస్వామ్యం పెరగడం ద్వారా నిర్ణయాధికారంలో వారికి మరింత ప్రాధాన్యం లభిస్తుందని అన్నారు.

## శ్రావణ సహకార డిపాజిట్ స్కీమ్..!

-అధిక వడ్డీ పరిమిత కాల వ్యవధి..

ప్రజా భూమి ప్రతినిధి-చంద్రగిరి

ది చిత్తూర్ జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ లిమిటెడ్, చిత్తూరు డిసిసి బ్యాంక్ నందు శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని శ్రావణ సహకార డిపాజిట్ స్కీమ్ ప్రవేశ పెట్టినట్లు చంద్రగిరి బ్రాంచ్ మేనేజర్ కె.ఆర్. ఉషా మాధవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధిక వడ్డీ పరిమిత కాల వ్యవధితో కీలక పథకమును ప్రవేశపెట్టి నట్లు ఆమె తెలిపారు. ఆగస్టు 21 నుండి సెప్టెంబర్ 30 వరకు తమ ఖాతాలు తెరుచుకుని మీరు ఎంచుకున్న మొత్తాన్ని 456 రోజులు కాల పరిమితితో డిపాజిట్ చేసుకోవాలని తెలిపారు. ఇందులో 60 సంవత్సరాలలోపు ఖాతాదారులకు 7.60 శాతం. 79 సంవత్సరాలు లోపు సీనియర్ సిటిజనులకు 8.20 శాతం. 80 సంవత్సరాలు పైబడిన సూపర్ సీనియర్ సిటిజన్స్ కు8.30 శాతం వడ్డీ చెల్లించబడుతుందని అన్నారు. మరిన్ని వివరాలకు బ్యాంకు పని వేళల్లో ఫీల్డ్ ఆఫీసర్ ( సూపర్వైజర్) ఏ. సాయి ప్రదీప్‌ను సంప్రదించాలని కోరారు.

# వైభవంగా వరలక్ష్మీ వ్రతం

- దేవాలయాల్లో ప్రత్యేక పూజలు
- మొక్కుబడులు తీర్చుకున్న మహిళలు

ప్రజాభూమి ప్రతినిధి-హిందూపురం టౌన్

శ్రావణమాసం రెండవ శుక్రవారం మహిళలకు ప్రత్యేకం. అదే వరలక్ష్మీ వ్రతం. తెల్లవారుజాము నుండి మహిళలు ప్రత్యేక స్నానాలు ఆచరించి ఇళ్లలో వరలక్ష్మీ అమ్మవారిని ఏర్పాటు చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా పట్టణంలోని వరలక్ష్మి అమ్మవారు, వాసవి కన్యకా పరమేశ్వరి, రేణుకా యల్లమ్మ, జలదుర్గమ్మ, మధుగిరి మారెమ్మ, పేట వెంకటరమణ స్వామి వంటి దేవాలయాల్లో తెల్లవారుజాము నుండి ప్రత్యేక పూజా



కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మూల విరాట్ లను వివిధ రకాల పుష్పాలు, అలంకరణ సామాగ్రితో ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలను వేద పండితులు మంత్రోచ్ఛారణల నడుమ నిర్వహించారు. మహా మంగళ హారతి అనంతరం భక్తులందరికీ తీర్థ ప్రసాద వినియోగం చేశారు. మహిళలు దేవాలయాలకు వెళ్లి మొక్కుబడును తీసుకొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఇళ్లలో సైతం కొలువుదీరిన వరలక్ష్మి అమ్మవారిని దర్శించుకునేందుకు పరిసర ప్రాంతాల్లోని మహిళలను ఆహ్వానించి వాయినాలు అందజేసి ఆశీర్వాదాలు తీసుకున్నారు.

# వరలక్ష్మీ వ్రతం సందర్భంగా కనకదుర్గ అమ్మవారికి విశేష అలంకరణ

ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి

అన్నదేవరపేట గ్రామంలోని బీసీ కాలనీలో వేంచేసి ఉన్న శ్రీ శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవాలయంలో శ్రావణమాసం సందర్భంగా ప్రతి శుక్రవారం అమ్మవారికి విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శ్రావణమాసం తొలి శుక్రవారం అమ్మవారిని అనేక రకాల కూరగాయలతో శాకంబరి అమ్మవారిగా అలంకరించి ప్రత్యేక



పూజలు నిర్వహించారు. రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా అమ్మవారిని వరిపిండితో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, సామూహిక కుంకుమార్చనలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దేవాలయంలో భక్తిశ్రద్ధలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# మలకపల్లిలో నూతన రైస్ మిల్‌కు శంకుస్థాపన

ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి

తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామంలో గ్రామ టీడీపీ అధ్యక్షులు చెరుకూరి వెంకట్రావు నూతనంగా నిర్మించనున్న రైస్ మిల్‌కు శంకుస్థాపన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొవ్వూరు నియోజకవర్గ శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన కార్యక్ర



మంలో పాల్గొన్నారు. టుమెన్ కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, మద్దిపాటి ప్రకాశం, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని చెరుకూరి వెంకట్రావుకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన రైస్ మిల్ త్వరగా పూర్తై రైతులకు, స్థానిక ప్రజలకు ఉపయోగకరంగా ఉండాలని నాయకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# చించినాడ- దిండి బ్రిడ్జికి మోక్షం

-భారీ వాహనాల రాకపోకలకు అనుమతులు జారీ



ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

పశ్చిమగోదావరి జిల్లా చించినాడ- తూర్పుగోదావరి జిల్లా దిండి వంతెనపై పూర్తిస్థాయి రాకపోకలు ఎట్ట కేలకు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయినట్లు తెలిసింది. ఈ వంతెన భారీ వాహనాలు రాకపోకలతో బలహీన పడిందని, మరమ్మతులు చేయాలని ఎడాది క్రితం భారీ వాహనాలు రాకపోకలు నిలిపివేసిన సంగతి తెలిసిందే. అయితే ద్విచక్ర వాహనాలు, ఆటోలు, చిన్న కార్లు మాత్రం రాకపోకలు అనుమతించారు. బస్సులు,పెద్ద వాహనాలు నిలిపివేసి మరమ్మతులు ఏడాదికాలంగా చేపట్టారు. దీంతో స్కూలు, కళాశాల విద్యార్థులు బస్సులు ఇరువైపులా నిలిపివేసి వంతెనపై నడిపించి తిరిగి బస్సులు ఎక్కే విధంగా ఇబ్బందులు పడ్డారు. మరమ్మతుల్లో భాగంగా బేరింగ్లు కూడా వేసినట్లు తెలిసింది. ఏది ఏమైనప్పటికీ ఇప్పటికైనా వాహనాలు అనుమతులు జారీ చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా వందల కోట్ల విలువైన ఈ వంతెన కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అందువల్ల భారీ ఇనుపు, అధిక బరువు లోడ్ల లారీలు ఎప్పటికీ అనుమతించకూడదని ఉపయోగ గోదావరి జిల్లాల ప్రజలు కోరుతున్నారు.

# ఎన్నికల పనులు వేగవంతం చేయాలి



ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ఎన్నికలకు సంబంధించిన కంప్యూటరీకరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీవో అబ్దుల్ సలాం సూచించారు. శుక్రవారం డిప్యూటీ ఎంపీడీవో దుర్గారావుతో కలిసి మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల పనుల పురోగతిని పరిశీలించి, మిగిలిన పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని కార్యదర్శులకు సూచించారు.

## ముత్తూట్ అనుబంధ సంస్థ బెల్ట్ స్టార్ గోల్డ్ లోన్ నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన మాజీ ఎంపీపీ మరియు సొసైటీ చైర్మన్ మోరంపూడి మల్లికార్జునరావు.



ప్రజా భూమి ప్రతినిధి-చింతలపూడి

లింగపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా ఉన్న ముత్తూట్ అనుబంధ సంస్థ బెల్ స్టార్ గోల్డ్ లోన్ నూతన కార్యాలయాన్ని శుక్రవారం శింగగూడెం సొసైటీ చైర్మన్ మోరంపూడి మల్లికార్జునరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా బెల్ స్టార్ మైక్రో ఫైనాన్స్ స్టేట్ రీజనల్ మేనేజర్ తానికొండ రాము మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అతి తక్కువ వడ్డీ రేట్లకు గోల్డ్ లోన్ సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యాలయాన్ని ప్రారంభించామన్నారు. అనంతరం బ్రాంచ్ మేనేజర్ తోకల సతీష్ మాట్లాడుతూ ఇతర బ్యాంక్ల నుంచి బంగారాన్ని విడిపించి తక్కువ చేసి వడ్డీ రేటుకు మా వద్ద లోన్ చెయ్యడం జరుగుతుందన్నారుకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వారిని దుశ్యాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ధర్మాజీగూడెం ఎస్సై కె. వెంకన్న, నాయకులు చల్లా నాగబాబు, ప్రబాకరరెడ్డి, ఘంటా శ్రీను, మోరంపూడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజల ఆరోగ్యానికి సీఎంఆర్ఎఫ్ సంజీవని వంటిది

ఆగిరిపల్లి మండలంలోని 18 మంది బాధిత కుటుంబాలకు రూ.10.82 లక్షల సాయం






ప్రజాభూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

పేద ప్రజల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి సంజీవని వంటిదని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఇటీవల వైద్య చికిత్సలు చేయించుకున్న ఆగిరిపల్లి మండలానికి చెందిన 18 మంది బాధిత కుటుంబాలకు రూ. 10,82,181 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను నూజివీడులోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి పంపిణీ చేశారు. పేద ప్రజల ఆరోగ్య భద్రత కోసం ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తోందని, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందిస్తున్న ఆర్థిక సాయాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. వైద్య ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఆర్థికంగా అండగా నిలుస్తుందని తెలిపారు. చెక్కులు అందుకున్న బాధిత కుటుంబ సభ్యులు తమ ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని సహాయం అందించినందుకు మంత్రి కొలుసు పార్థసారథికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిట్టినేని శివరామకృష్ణయ్య, కొల్లిపర సాంబశివరావు, పుసునూరి నాగమణి, ఏసు పాదం మరియు పార్టీ కార్యకర్తలు నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వికసించిన బ్రహ్మ కమలం

ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు



వరలక్ష్మి వ్రతం రోజున వికసించిన బ్రహ్మ కమలం. లంకలకోడేరు గ్రామంలో వేగశ్న మురళీ కృష్ణంరాజు ఇంటి ఆవరణలో ఈరోజు తెల్లవారుజామున బ్రహ్మ కమలం వికసించింది ఇది చూపరులను ఆకట్టుకుంటుంది. వరలక్ష్మీ వ్రతం రోజున వికసించడం వలన ప్రతి ఒక్కరూ వచ్చి ఈ పుష్పానికి నమస్కరించి వెళుతున్నారని మురళీకృష్ణ రాజు దంపతులు తెలిపారు.

## ఘనంగా జాతీయ వృద్ధుల దినోత్సవం వేడుకలు



ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

ఘనంగా జాతీయ వృద్ధుల దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహణజాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా లైన్స్ రూరల్ ఆధ్వర్యంలో వృద్ధుల సంక్షేమం మరియు గౌరవార్థం ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి లయన్ రూరల్ ప్రెసిడెంట్ కుక్కల అజయ్ కుమార్ సెక్రటరీ శ్రీధర్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సంగినీడి వెంకట రంగారావు, కారుమూరి రామలింగేశ్వర రావు. మానవతావాది భవానీ ప్రసాద్ రాయపూడి ముఖ్య అతిథులుగా పాల్గొని వృద్ధుల సేవలో సమాజ బాధ్యత గురించి ప్రసంగించారు. ఈ సందర్భంగా సమాజ సేవలో అసమాన కృషి చేసిన సన్మాన గ్రహీత డాక్టర్ పోదూరు కృష్ణమూర్తి ఘనంగా సన్మానించారు. డాక్టర్ పోదూరు కృష్ణమూర్తి గారి వయసు 92 సంవత్సరాలు అంతటి వయసులోనూ సమాజానికి అందించిన సేవలను సభికులు కొనియాడారు. వృద్ధులు మనకు జ్ఞాన భాండాగారం. వారి అనుభవాల నుండి యువతరం ఎన్నో విషయాలు నేర్చుకోవాలని, వృద్ధులను గౌరవించడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని వక్తలు పేర్కొన్నారు. అనంతరం శాలువ తో ఘనంగా సత్కరించారు.

## కూటమి ప్రభుత్వం పారదర్శకంగా పాలన అంది అయింది

ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.



కూట మి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, పారదర్శక పాలన అంది స్తోందనీ, తెలుగు దేశం పార్టీ మండల అధ్యక్షుడు బొర్రా నరేష్ కుమార్ అన్నారు. ములకనపల్లి పంచాయితీ, జల్లివారి గూడెం గ్రామంలో శుక్రవారం కూటమి ప్రభుత్వం రెండేళ్ల నమ్మకం అభివృద్ధి -సంక్షే మం డోర్ టు డోర్ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బొర్రా నరేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియచేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఐ టి డి పి కన్వీనర్ ఆకోజు భాగ్యలక్ష్మి, ముత్యాల శ్రీధర్, ఆకోజు రంగాచారి, జల్లి లక్ష్మణ్, జల్లి నరేష్, శ్రీను, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి
అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6
శనివారం 22 ఆగష్టు 2026

## ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బీసీలకు పెద్దపీట వేశారన్నారు: ఎంపీ, ఎమ్మెల్యే



ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

నూతనంగా ఎమ్మెల్సీగా ఎన్నికై ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తొలిసారిగా అనంతపురం విచ్చేసిన శ్రీమతి దలవాయి రమాదేవిని కరిడికొండలో శుక్రవారం అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ కలిసి హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. అమ్మవారి దర్శనం అనంతరం నిర్వహించిన ర్యాలీలో పాల్గొనడం జరిగింది. బీసీ మహిళకు, రాయలసీమ ప్రాంతానికి ఎమ్మెల్సీ పదవి కేటాయించడం ద్వారా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బీసీలకు పెద్దపీట వేశారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని ఈ సందర్భంగా తెలియజేశారు. వెనుకబడిన అనంతపురం జిల్లాకు ప్రాధాన్యత కల్పిస్తూ శ్రీమతి దలవాయి రమాదేవికి ఎమ్మెల్సీ పదవి ఇవ్వడం కూటమి ప్రభుత్వ బీసీల పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనం ఎంపీ అంబికా కొనియాడారు. ఎమ్మెల్సీగా బాధ్యతలు చేపట్టిన రమాదేవి అనంతపురం జిల్లా అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి అంకితభావంతో కృషి చేయాలని ఆకాంక్షిస్తున్నారు. అనంతపురం జిల్లాను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు మనమంతా కలిసి పనిచేద్దాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, స్థానిక నాయకులు, వెంకటేశ్వర్ రెడ్డి, బంధువుకు రాజా, లవ్ కుమార్, కార్యకర్తలు, వివిధ పార్టీల ముఖ్య నాయకులు, వడ్డే సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అనంతపురం జిల్లా రాయదుర్గానికి 25న మంత్రి నారా లోకేష్ రాక

**– పర్యటన ఏర్పాట్లను సమీక్షించిన ఎమ్మెల్యే కాలవ., ఎస్పీ జగదీష్.**



ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు ఈ నెల 25న రాయదుర్గం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. నియోజక వర్గంలో 300 మెగావాట్ల సుజలాన్ కంపెనీ ప్లాంటుకు ఆయన శంకుస్థాపన చేస్తారు. ఈ నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు శుక్రవారం కనేకల్లు క్రాస్ సభాస్థలిని సందర్శించారు. జిల్లా ఎస్పీ జగదీష్, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి పర్యటన కొనసాగే ప్రాంతాలను సందర్శించి ఏర్పాట్లపై సమీక్షించారు. మంత్రి పర్యటన సందర్భంగా ఏర్పాటు చేయనున్న సభా వేదిక, స్టాల్స్, పెద్ద సంఖ్యలో తరలివచ్చే ప్రజలకు అవసరమైన సౌకర్యాలు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు తదితర అంశాలపై చర్చించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. వాహనాల పార్కింగ్, రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ జగదీష్ అధికారులకు సూచించారు. పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

## అనంతపురం ప్రెస్ క్లబ్ సభ్యత్వ నమోదులో మార్పు

**ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు సభ్యత్వ రుసుం స్వీకరణ**

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం



అనంతపురం ప్రెస్ క్లబ్ అడ్ హక్ కమిటీ తొలుత నిర్ణయించిన మేరకు శుక్రవారం నుంచి స్వీకరించాల్సి ఉన్న ప్రెస్ క్లబ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం వాయిదా పడింది. తాజా సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడతామని గత మీటింగ్ లో మెజార్టీ సభ్యుల ఆమోదం మేరకు శుక్రవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం శ్రీకారం చుట్టాల్సి ఉండేది. ఆ మేరకు కమిటీలో ఏకగ్రీవ తీర్మానం చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో శుక్రవారం నిర్వహించిన సమావేశానికి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గైర్హాజరయ్యారు. మిగతా మెజారిటీ ఈసీ సభ్యులు ఐదుగురు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆగస్టు 24వ తేదీ సోమవారం నుంచి ఆగస్టు 27తేది గురువారం వరకు ప్రెస్ క్లబ్ లో సభ్యత్వం నమోదు చేసేందుకు మెజార్టీ ఈసి సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. కనుక జర్నలిస్ట్ సోదరులు ప్రెస్ క్లబ్ సభ్యత్వాలు స్వీకరించాల్సిందిగా ప్రెస్ క్లబ్ తాత్కాలిక ఈసీ కమిటీ మెంబర్స్ విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యక్షుడు మల్లెబోయిన రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సభ్యులు అనిల్ కుమార్ రెడ్డి(కోశాధికారి), కేపీ కుమార్, లక్ష్మీనారాయణ, శ్రీకృష్ణ పాల్గొన్నారు.

## రైతుల ప్రయోజనాలే ముఖ్యం -- బీటెక్ రవి

**మబ్బుచింతలపల్లె చెరువుకు కృష్ణా జలాల విడుదల**

ప్రజాభూమి, వేముల



వేముల మండలం మబ్బుచింతలపల్లె గ్రామ చెరువుకు వేల్పుల పంప్‌హౌస్ నుంచి లిఫ్ట్ ద్వారా కృష్ణా జలాలను విడుదల చేశారు. పులివెందుల టీడీపీ ఇన్‌చార్జ్ బీటెక్ రవి,తుంగభద్ర హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, టీడీపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు పేర్ల పార్థ సారథి రెడ్డిలతో కలిసి నీటిని విడుదల చేశారు.ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ రైతుల సాగునీటి అవసరాలే ప్రధాన లక్ష్యమని, రాజకీయాలకు అతీతంగా పనిచేస్తున్నామని తెలిపారు. లిఫ్ట్‌కు ఉన్న చిన్నచిన్న మరమ్మతులు, ట్రాన్స్‌ఫార్మర్ సమస్యలను అధికారులతో మాట్లాడి పరిష్కరించామన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా మోటార్లు, ఇతర పరికరాలు కూడా సమకూర్చేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు.మబ్బుచింతలపల్లె చెరువు నింపిన అనంతరం కనంపల్లె, కనంకింద కొట్టాల చెరువులకు కూడా నీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. చెరువుకు నీరు రావడంతో గ్రామస్థులు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం నీటి వనరుల అభివృద్ధికి కట్టుబడి ఉందని నాయకులు పేర్కొన్నారు.

# స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ చారిత్రాత్మకం

- **రాజకీయ ప్రాతినిధ్యం కోసం గాండ్ల కులస్తులం ఎన్నికల్లో పోటీ పడదాం**
- **గాండ్ల మహిళలూ ముందుకు రండి**
- **రాష్ట్ర గాండ్ల తెలికుల ఉద్యోగుల సంఘం, ప్రజా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వాకాటి హరికృష్ణ పిలుపు**

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

స్థానిక, పంచాయతీ రాజ్ సంస్థల్లో బీసీ కులాలకు 34 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేయడం ఆహ్వానించదగ్గ విషయమని అఖిల గాండ్ల తెలికుల ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సంక్షేమ సంఘం (ఏ జి టి యు పి ఎస్ ఎస్), సమస్త గాండ్ల తెలికుల ప్రజా సంక్షేమ సంఘం (ఎస్ జి టి పి ఎస్ ఎస్) రాష్ట్ర అధ్యక్షులు వాకాటి హరికృష్ణ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకొన్న ఈ నిర్ణయం చారిత్రాత్మకమన్నారు. ఈ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గాండ్ల తెలికుల సామాజిక వర్గీయులు రిజర్వేషన్ల మేరకు ఆయా స్థానాల్లో పోటీ చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ పత్రిక ప్రకటన విడుదల చేశారు. త్వరలో జరగన్న స్థానిక సంస్థల ఎన్నికలలో గ్రామస్థాయిలో సర్పంచ్ మొదలు జిల్లా పరిషత్ చైర్మన్ పదవుల వరకూ బీసీ కులాలు పోటీ పడనున్నాయన్నారు. అలాగే, మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లోనూ పోటీకి అవకాశం ఏర్పడిందన్నారు. కనుక ప్రధానంగా గాండ్ల తెలికుల కులాలు ఈ ఎన్నికల్లో పోటీ చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గాండ్ల తెలికుల కులాలు, సంఘాలు ఈ సమయంలో ఐక్యతతో ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. రాష్ట్రంలోని గాండ్ల ఉప కులాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రత్యేక కార్పొరేషన్ సాధనకు మన కులస్తులందరం ఐక్యతా రాగం చాటుకోవాలన్నారు. ముఖ్యంగా గాండ్ల కులస్తుల మహిళలు ఉత్సాహాన్ని కనబరుస్తూ అత్యధికంగా ముందుకు వచ్చి



పోటీపడి రాజకీయ పదవుల్లో భాగస్వాములు కావాలని కోరారు. చక్కటి అవగాహన, చైతన్యం కలిగిన మహిళలకు ఆయా కుటుంబ సభ్యులు సహకారం కల్పిస్తే గాండ్ల తెలికుల ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సంక్షేమ సంఘం సారథ్యంలో నడుస్తున్న సమస్త గాండ్ల తెలికుల ప్రజా సంక్షేమ సంఘం (ఎస్ జి టి పి ఎస్ ఎస్) తమ తోడ్పాటు అందిస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ లో రాజకీయ భాగస్వామ్యం కోసం ఉత్తరాంధ్ర, రాయలసీమ, కోస్తాంధ్ర ప్రాంతాల్లోని గాండ్ల తెలికుల సామాజిక వర్గీయులం అందరం "ఒకే జెండా -- ఒకే అజెండా" అనే నినాదంతో ముందుకు కదలుదామని విజ్ఞప్తి చేశారు. మన తరం, భవిష్యత్తులో భావి తరాల పిల్లల కోసం సాధించాల్సిన ఎన్నో అంశాలు ఇంకా ఎన్నో ఉన్నాయన్నారు. కనుక, ఐక్యతతో సాగితే ఏదైనా సాధించవచ్చని భరోసా కల్పించారు. కనుక మన కులస్థులు ఐక్యత కోసం ఏకాభిప్రాయంతో ముందుకు రావాలని వంకాటి హరికృష్ణ పిలుపునిచ్చారు.

# సంతేబిదనూరులో భూవివాదం -ఇరువర్గాల ఘర్షణ -ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం రూరల్ మండల పరిధిలోని సంతేబిదనూరులో భూమి వివాదంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ ఇరువురు తీవ్ర గాయాలకు గురైన సంఘటన చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. సంతేబిదనూరు రెవెన్యూ పొలంలో గ్రామానికి చెందిన జయ రంగప్ప, పెద్ద రాజప్ప కుటుంబాలకు సంబంధించిన సాగు భూములు ఉన్నాయి. ఇరువురు రైతుల భూముల్లోకి వెళ్లడానికి రహదారి వివాదం నెలకొంది. రహదారి వివాదం పరిష్కారం కోసం సర్వే చేయాలని జయ రంగప్ప కుటుంబ సభ్యులు భూమి సర్వే చేయడానికి చలానా చెల్లించారు. అయితే శుక్రవారం పెద్దరాజప్ప కుటుంబ సభ్యులు తమ పొలంలోకి వెళ్లడానికి రహదారి ఏర్పాటు చేస్తుర్నన్న విషయం తెలుసుకుని జయరంగప్ప కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకొని సర్వే చేసే వరకు రహదారి ఏర్పాటు చేయకూడదని అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల వారు ఘర్షణకు తలబడ్డారు. ఇరు వర్గాల ఘర్షణలో రామాంజి, హనుమంతప్పలకు తీవ్ర గాయాలయ్యాయి. ఇరవర్గాల



ఘర్షణకు ఎలాంటి సంబంధం లేని అబుబకార్ అనే వ్యక్తిని కూడా ఓ వర్గం వారు చితకబాదారు. వెంటనే సమీపవాసుల జోక్యం చేసుకొని బాధితులను చికిత్స నిమిత్తం హిందూ పురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఓ వర్గానికి చెందిన రామాంజి అనే బాధితుడు మాట్లాడుతూ, గత కొన్ని సంవత్సరాల క్రితం తమ సమీప బంధువైన జయ రంగప్ప సాగు భూమి కొనుగోలు చేశారని, ఆ భూమిలో పంటల సాగు చేసుకుని కుటుంబ జీవనాలు సాగిస్తున్నామన్నారు. తమ గ్రామానికి చెందిన పెద్దరాజప్ప, ఆవులప్ప కుటుంబ సభ్యులకు కూడా తమ భూమి సమీపంలోనే



సాగు భూమి ఉందన్నారు. భూమిలోకి వెళ్లడానికి తమ భూమి సమీపంలో రహదారి ఏర్పాటు చేయడానికి పూనుకున్నారన్నారు. భూమిలోకి వెళ్లడానికి దారి లేదని వేరే దారి చూసుకోవాలని వారికి నచ్చ చెప్పామని, అయితే తమ మాటలను పట్టించుకోకుండా రహదారి కోసం సర్వే చేయాలని చలానా కట్టడం జరిగిందన్నారు. అయితే సర్వే చేసి కొలతలు వేయకుండానే వారు ఇష్టారాజ్యంగా రహదారి ఏర్పాటు చేయడానికి పూనుకున్నారని, దీన్ని తాము అడ్డుకుంటే తమపై దాడి చేశారని ఆరోపించారు. ఆవులప్ప, పెద్ద రాజప్ప కుటుంబానికి సంబంధించిన హనుమంతప్ప మాట్లాడుతూ, కొన్ని సంవత్సరాల క్రితం తాము భూమి కొనుగోలు చేసి పంటలు సాగు చేసి సాగిస్తున్నామన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా జయరంగప్ప భూమి సమీపంలోనే తమ పొలాలకు రాకపోకలు సాగిస్తుండవారమని, అయితే ఇటీవల కాలంలో తమ పొలానికి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తమకు ఉన్న సమాచారం మేరకు తమ పొలంలోకి వెళ్లడానికి దారి ఏర్పాటు చేసుకుంటే ఇది జీర్ణించుకోలేని రామాంజి కుటుంబ సభ్యులు తమపై దాడులు చేసి గాయపరిచారని విమర్శించారు. అబుబకర్ అనే బాధితుడు మాట్లాడుతూ, తమ నీటి కొళాయికి సంబంధించిన సామాన్లు తెచ్చదానికి గ్రామం వైపు వెళుతుండగా ఇరువర్గాలు ఘర్షణ పడుతున్నారని, ఇరు వర్గాల ఘర్షణ తనకు ఎలాంటి సంబంధం లేదని, అయితే అనవసరంగా రామాంజి కుటుంబ సభ్యులు తనను విపరీతంగా చితకబాదారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై ఇరు వర్గాల వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# ఓటేసిన వృద్ధుడే.. ఓటరని నిరూపించుకోవాలా....!!!

- **ఇంటి పేరు మారిందని.., అక్షరం తేడా వచ్చిందని నోటీసులు...!**
- **46,739 మందికి ఎస్ఐఆర్ నోటీసులు**
- **వృద్ధులు, కూలీలు, దూర ప్రాంత నివాసీకులకు తిప్పలు**
- **ఒక్క నోటీసు వెనుక ఒక రోజు కూలీ.. వందల రూపాయల ఖర్చు...**

ప్రజాభూమి, హిందూపురం టౌన్

ఇన్నేళ్లుగా ఇదే ఊరిలో ఉంటున్నాం.. ఎన్నో ఎన్నికల్లో ఓటేశాం, ఓటరు కార్డు ఉంది, మా పేరుతో ఓటు కూడా వేశాం, ఇప్పుడు మేము ఓటర్లమేనని నిరూపించుకోవడానికి కార్యాలయానికి రావాలా ఇందిరమ్మ కాలనీకి చెందిన వృద్ధ దంపతులు అంజనమ్మ, బసప్పల ఆవేదన ఇది. ఓటు హక్కును వినియోగించుకోవడం వారి జీవితంలో కొత్తేమీ కాదు. అయితే ఇప్పుడు అదే ఓటు హక్కు తమదేనని నిరూపించుకునేందుకు అధికారుల ముందు హాజరు కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. కారణం.. ఓటరు జాబితాలో ఇంటిపేరు విషయంలో తేడా.

ఇదే తరహాలో కొల్లకుంటకు చెందిన ఉప్పర నరసింహప్పకు కూడా నోటీసు అందింది. 2002 జాబితాలో ఒక విధంగా, 2006 జాబితాలో మరో విధంగా, ఆధార్‌లో ఇంకో విధంగా పేరు ఉండటమే కారణం. దశాబ్దాలుగా ఓటు హక్కును వినియోగించుకున్న వ్యక్తి, ఇప్పుడు తన పేరులోని తేడాలకు వివరణ ఇచ్చేందుకు అధికారుల ఎదుట హాజరు కావాల్సి వచ్చింది. ఇది ఒక్క అంజనమ్మల బసప్పల కథ కాదు, ఒక్క నరసింహప్ప సమస్య కాదు, హిందూపురం నియోజకవర్గంలో వేలాది మంది ఓటర్లను వెంటాడుతున్న ప్రశ్న.

ఓటరు జాబితా సవరణా.. ఓటరుకే పరీక్షా....

ఎస్ఐఆర్ పేరుతో ఓటరు జాబితాను ప్రక్షాళన చేయడం అవసరమే. అనర్హుల పేర్లు తొలగాలి.. డూప్లికేట్ ఓట్లు బయటపడాలి. మరణించిన వారి పేర్లు ఉండకూడదు. శాశ్వతంగా వలస వెళ్లిన వారి వివరాలు సరిచేయాలి. అయితే ఈ ప్రక్రియలో నిజమైన ఓటర్లు సైతం అనుమానితులుగా మారుతున్నారు. పేరులో ఒక అక్షరం తేడా, ఇంటిపేరు ముందు ఉండటం, వెనుక ఉండటం, తండ్రి పేరులో స్వల్ప మార్పు, తెలుగు పేరు సరిగ్గా ఉన్నా ఇంగ్లీష్ స్పెల్లింగ్ భిన్నంగా ఉండటం ఇలాంటి కారణాలతో వేలాది మందికి నోటీసులు జారీ అవుతున్నాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

46,739 నోటీసులు.. ప్రతి నోటీసు వెనుక ఓ కుటుంబం...!

ఆగస్టు 21వ తేదీ సాయంత్రం 4 గంటల నాటికి హిందూపురం నియోజకవర్గ పరిధిలో మొత్తం 46,739 నోటీసులు జనరేట్ అయ్యాయి. వీటిలో ఇప్పటికే 34,697 నోటీసులు పంపిణీ అయ్యాయి. అంటే 74.24 శాతం నోటీసులు ఓటర్లకు చేరాయి. ఇంకా 12,042 నోటీసులు పంపిణీకి పెండింగ్‌లో ఉన్నాయి. మొత్తం నోటీసుల్లో 25.76 శాతం ఇంకా పంపిణీ కావాల్సి ఉంది. హిందూపురం అర్బన్‌లో మొత్తం 30,467 నోటీసులు జనరేట్ కాగా, ఇప్పటి వరకు 20,534 నోటీసులు పంపిణీ అయ్యాయి. పంపిణీ శాతం 67.40గా ఉంది. ఇంకా 9,933 నోటీసులు పంపిణీ కావాల్సి ఉంది. హిందూపురం రూరల్‌లో 5,590 నోటీసులకు గాను 4,724 పంపిణీ అయ్యాయి. పంపిణీ శాతం 84.51. మరో 866 నోటీసులు పెండింగ్‌లో ఉన్నాయి. లేపాక్షి మండలంలో 4,456 నోటీసులకు గాను 4,331 పంపిణీ అయ్యాయి. పంపిణీ శాతం 97.19. కేవలం 125 నోటీసులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. చిలమత్తూరు మండలంలో 6,226 నోటీసులకు గాను 5,108 పంపిణీ అయ్యాయి. పంపిణీ శాతం 82.04 కాగా, 1,118 నోటీసులు పెండింగ్‌లో ఉన్నాయి.

ఒక నోటీసు.. ఒక రోజు కూలీ పోయినట్టే...!

నోటీసు అందుకున్న ఓటరు ఏం చేయాలి, నిర్దేశించిన తేదీ, సమయానికి తహసీల్దార్ కార్యాలయం లేదా మున్సిపల్ కార్యాలయానికి వెళ్లాలి. అవసరమైన పత్రాలు తీసుకెళ్లాలి. గంటల తరబడి వేచి ఉండాలి. విచారణ పూర్తయ్యే వరకు అక్కడే ఉండాలి. తిరిగి ఇంటికి చేరుకోవాలి. గ్రామీణ ప్రాంతానికి చెందిన రోజువారీ కూలీకి ఇది మరింత భారమైన వ్యవహారం. ఆ రోజు పనికి వెళ్లకపోతే కూలీ పోతుంది. కార్యాలయానికి రావాలంటే బస్సు లేదా ఆటో ఖర్చు. తిరుగు ప్రయాణానికి మరో ఖర్చు. రోజంతా సమయం పోతుంది. ఒక కుటుంబానికి ఇది వందల రూపాయల ప్రత్యక్ష భారం కావచ్చు. అయితే వేలాది కుటుంబాలపై పడే మొత్తం భారం ఎంత, ప్రత్యేకంగా వృద్ధులు, ఒంటరిగా జీవిస్తున్న వారు, మహిళలు, దివ్యాంగులు, రోజువారీ కూలీలు, చిన్న వ్యాపారులు ఈ ప్రక్రియలో ఎక్కువగా ఇబ్బంది పడే అవకాశం ఉంది.

పదుల సార్లు ఓటేసిన వారికే నోటీసులా....

ఒక వ్యక్తి గత రెండు దశాబ్దాలుగా ఎన్నికల్లో ఓటు వేస్తున్నాడు. ఓటరు కార్డు ఉంది. కుటుంబం అదే చిరునామాలో ఉంది. పొరుగువారికి కూడా అతను తెలుసు. ఎన్నికల సమయంలో ఓటు వేసిన రికార్డు ఉంది. అయినా 2002 నాటి నమోదులో ఇంటిపేరు లేకపోవడం లేదా ఇంగ్లీష్ స్పెల్లింగ్‌లో తేడా ఉండటంతో విచారణకు హాజరు కావాలి అనే నోటీసు అందుతోంది. 282 మందికి ఇప్పటికే విచారణ తాజా గణాంకాల్లో ఇప్పటి వరకు 282 హియరింగ్స్ నిర్వహించినట్లు నమోదైంది. ఇందులో చిలమత్తూరు మండలంలోనే అత్యధికంగా 255 విచారణలు జరిగాయి. హిందూపురం అర్బన్‌లో 14, లేపాక్షిలో 6, హిందూపురం రూరల్‌లో 7 విచారణలు జరిగినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అంటే నోటీసులు పంపిణీతో పాటు విచారణ ప్రక్రియ కూడా ప్రారంభమైంది. ఇంకా 12,042 నోటీసులు పంపిణీ కావాల్సి ఉండటంతో తదుపరి దశలో విచారణలకు వచ్చే వారి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.



ఇంటిపేరు మారితే.. వ్యక్తి మారిపోతాడా, అంజనమ్మ, బసప్పల ఉదంతం ఇప్పుడు ఒక పెద్ద ప్రశ్నను లేవనెత్తుతోంది. పాత ఓటరు కార్డులో ఇంటిపేరు లేకపోవడం.. కొత్త ఓటరు కార్డులో ఇంటిపేరు ఉండటం వల్ల వ్యక్తి గుర్తింపు మారిపోతుందా. ఒక కుటుంబం తరతరాలుగా ఒకే ప్రాంతంలో నివసిస్తూ ఉంటే పొరుగువారికి తెలుసు, కుటుంబ సభ్యులు తెలుసు, స్థానికంగా గుర్తింపు ఉంది, ఎన్నో ఎన్నికల్లో ఓటు వేసిన చరిత్ర ఉంది. అయినప్పటికీ కేవలం ఇంటిపేరు తేడా ఆధారంగా విచారణకు హాజరు భావాలని భార్య భర్తలకు నోటీసులు జారీ చేశారు.

తప్పు వ్యవస్థదా.. శిక్ష ఓటరుకా.....

నరసింహప్ప పేరు, మూడు పత్రాలు, మూడు రూపాలు, కొల్లకుంటకు చెందిన ఉప్పర నరసింహప్ప విషయంలోనూ ఇదే తరహా పరిస్థితి. 2002 ఎస్ఐఆర్‌లో నరసింహప్ప తండ్రి పేరు వెంకటప్పగా నమోదైంది. 2006 జాబితాలో యూ. నరసింహప్ప ఉప్పర.. తండ్రి పేరు వెంకటప్ప ఉప్పరగా ఉంది. ఆధార్‌లో గుడిపల్లి నరసింహప్పగా నమోదైంది. ఒకే వ్యక్తి పేరు మూడు చోట్ల మూడు విధాలుగా కనిపించడం వెనుక కారణం ఏమిటో విచారణలో తేలాల్సిందే. అయితే ముందుగా క్షేత్రస్థాయిలో ఆ వ్యక్తి ఒకరేనా, కాదా అన్నది నిర్ధారించే అవకాశం ఉన్నప్పటికీ నోటీసు ఇచ్చి కార్యాలయానికి రప్పించడం ప్రజల్లో చర్చకు దారితీసింది. 2002లోని సాంకేతిక పరిస్థితిని 2026తో ఎలా పోలుస్తారు, 2002 నాటి ఓటరు జాబితా, ప్రస్తుత డిజిటల్ ఓటరు జాబితా మధ్య సాంకేతికంగా భారీ మార్పులు వచ్చాయి. అప్పట్లో పేర్ల నమోదు విధానం వేరు. ఇప్పుడు సాఫ్ట్‌వేర్ ఆధారిత డేటా నమోదు విధానం వేరు. అప్పటి వివరాలు తర్వాత డిజిటలైజ్ అయ్యాయి. కొత్త సాఫ్ట్‌వేర్ ప్రమాణాలు వచ్చాయి. పేర్లను ఇంగ్లీషులో నమోదు చేసే విధానం మారింది. ఈ మొత్తం ప్రక్రియలో ఒకే వ్యక్తి పేరు వేర్వేరు విధాలుగా కనిపించడం అసాధారణం కాదు. అయితే ఆ సాంకేతిక వ్యత్యాసాలను ఓటరు చేసిన తప్పుగా పరిగణించడం ఎంతవరకు సమంజసం, తెలుగులో సరిగ్గా ఉంది, ఇంగ్లీష్‌లో తప్పుంటే, హిందూపురం వంటి ప్రాంతాల్లో పేర్లను ఇంగ్లీషులో నమోదు చేసే సమయంలో ఉచ్చారణ ఆధారంగా వివిధ స్పెల్లింగ్‌లు రావచ్చు. తెలుగులో



పేరు ఒకటే అయినా ఇంగ్లీష్‌లో అక్షరాల క్రమం మారవచ్చు. ఇంటిపేరు ముందు లేదా తర్వాత రావచ్చు. తండ్రి పేరులో కూడా స్వల్ప మార్పులు ఉండవచ్చు. అందుకే ఒక వ్యక్తిని గుర్తించడానికి కేవలం ఇంగ్లీష్ స్పెల్లింగ్‌ను కాకుండా తెలుగు పేరు, వయసు, చిరునామా, కుటుంబ సభ్యుల వివరాలు, పాత ఓటరు కార్డు, ఇతర గుర్తింపు పత్రాలు అన్నింటినీ కలిపి పరిశీలించాల్సిన అవసరం ఉంది. లేకపోతే సాంకేతిక తప్పిదాలకు సామాన్య ఓటరే మూల్యం చెల్లించాల్సి వస్తుంది.

బీఎల్ఓ ఇంటికి వెళ్లలేరా...

క్షేత్రస్థాయిలో పనిచేసే బూత్ స్థాయి అధికారులు సంబంధిత ఓటరు ఇంటికి వెళ్లి పరిశీలిస్తే చాలా సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించవచ్చు. ఈ వ్యక్తి ఇక్కడే నివసిస్తున్నాడా, కుటుంబ సభ్యులు ఎవరు, పాత ఓటరు జాబితాలోని వ్యక్తి, ప్రస్తుత వ్యక్తి ఒకరేనా, ఇంటిపేరు ఎందుకు మారింది ఇలాంటి ప్రశ్నలకు ఇంటి వద్దే సమాధానాలు దొరికే అవకాశం ఉంది. అయితే ప్రతి చిన్న వ్యత్యాసానికీ కార్యాలయానికి రమ్మని ఆదేశిస్తే ఓటరుపై అదనపు భారం, అధికారులకు అదనపు పని, ఎన్నికల వ్యవస్థపై అదనపు ఒత్తిడి తప్ప మరేమీ మిగలదని ప్రజలు అంటున్నారు.

ఇతర ప్రాంతాల్లో ఉన్న ఓటర్ల పరిస్థితి ఏమిటి..

ఉపాధి కోసం బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, ఇతర నగరాలకు వెళ్లినవారు ఉన్నారు. విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నవారు కూడా ఉన్నారు. రోజువారీ కూలీ పనుల కోసం వలస వెళ్లిన కుటుంబాలు ఉన్నాయి. వారికి నిర్దిష్ట తేదీ, సమయానికి వ్యక్తిగతంగా హాజరు కావాలని నోటీసు ఇస్తే ఉద్యోగాన్ని వదిలి రావాలి. వందలు, వేల రూపాయలు ఖర్చు చేసి ప్రయాణించాలి. ఒకరోజు సెలవు తీసుకోవాలి. ఓటరు జాబితాలోని ఒక అక్షర తేడా కోసం ఇంత పెద్ద మూల్యం చెల్లించాల్సి వస్తుంది. నోటీసు అంటే భయం కాకూడదు, భరోసా కావాలి, ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో నోటీసు అందుకున్న వెంటనే సామాన్య ఓటరులో సహజంగానే ఆందోళన మొదలవుతుంది. నా ఓటు పోతుందా, నేను ఏ పత్రాలు తీసుకెళ్లాలి, విచారణకు వెళ్లకపోతే ఏమవుతుంది అనే ప్రశ్నలు తలెత్తుతాయి. ప్రత్యేకంగా వృద్ధులు, నిరక్షరాస్యులు, రోజువారీ కూలీలు, దూర ప్రాంతాల్లో నివసిస్తున్నవారికి ఈ ప్రక్రియ మరింత క్లిష్టంగా మారుతుంది. అందువల్ల నోటీసు జారీ చేసే ముందు సాధ్యమైనంతవరకు క్షేత్రస్థాయి పరిశీలన, ఫోన్ ద్వారా సమాచారం, కుటుంబ సభ్యుల వివరాల పరిశీలన వంటి ప్రత్యామ్నాయాలను వినియోగించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజాభూమి
వైఎస్ఆర్ కడప, శ్రీ అన్నమ్మయ్య 7
శనివారం 22 ఆగష్టు 2026

## తొండూరు మోడల్ స్కూల్‌లో మహిళా భద్రతపై అవగాహన

### విద్యార్థినులకు మహిళా భద్రత, సాధికారత, సోషల్ మీడియా వినియోగంపై అవగాహన కల్పించిన ఎస్ఐ శివ నాగిరెడ్డి

ప్రజా భూమి తొండూరు: తొండూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థినులకు మహిళా భద్రత, సాధికారత, సోషల్ మీడియా వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొండూరు ఎస్ఐ శివ నాగిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులకు పలు ముఖ్యమైన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శివ నాగిరెడ్డి మాట్లాడుతూ మహిళలు, బాలికలు తమ భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



ముఖ్యంగా సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, వ్యక్తిగత వివరాలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు, బ్యాంకు సంబంధిత సమాచారాన్ని అపరిచితులతో ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని సూచించారు. సైబర్ మోసాలు, సోషల్ మీడియా ద్వారా ఎదురయ్యే సమస్యల పట్ల విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద లింకులు, మెసేజ్‌లను క్లిక్ చేయకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. ఎవరైనా వేధింపులకు గురిచేసినా, ఇబ్బందులకు గురిచేసినా భయపడకుండా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులను సంప్రదించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 112 నంబర్‌కు, బాలల సహాయం కోసం 1098 హెల్ప్‌లైన్‌ను వినియోగించుకోవాలని విద్యార్థినులకు వివరించారు. మహిళలు, బాలికల భద్రతకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ఎలాంటి సమస్య ఎదురైనా ధైర్యంగా పోలీసులను ఆశ్రయించాలని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## వరలక్ష్మీవ్రతం సందర్భంగా దివ్యాంగులకు చీరల పంపిణీ

### - వికలాంగుల నెట్వర్క్ రాష్ట్ర అధ్యక్షులుడా. రఘునాథరెడ్డి



ప్రజాభూమి,పులివెందుల

వరలక్ష్మీ వ్రతం సందర్భంగా వికలాంగుల నెట్‌వర్క్ ఆధ్వర్యంలో దివ్యాంగ మహిళలకు చీరలు, తాంబూలాలు పంపిణీ చేశారు. స్థానిక వికలాంగుల శిక్షణ కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షులు డా. ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి పాల్గొని కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలకు సారె చీరలు అందజేశా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరాల తల్లి ఆశీస్సులతో ప్రతి ఇల్లు సిరిసంపదలతో తులతూగాలని, ముఖ్యంగా దివ్యాంగులకు స్వస్థత, ఆయురారోగ్యాలు కలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో టైలరింగ్ టీచర్ మల్లీశ్వరి, శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హరి వేదాంత్ పుట్టిన రోజు వేడుకలు

### - వృద్ధాశ్రమంలో సేవాకార్యక్రమాలు, అన్నదానం



ప్రజాభూమి, సిద్ధవటం: మాధవరం-1 గ్రామానికి చెందిన 'మన ఊరి కోసం' స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యుడు నందం హరికృష్ణ, మాధవి దంపతుల కుమారుడు హరి వేదాంత్ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం కొత్తమాధవరం సమీపంలోని కాశినాయన వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వేదాంత్ కుటుంబ సభ్యులు ఆశ్రమంలోని అవ్వాతాతలకు మధ్యాహ్నం భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ అవ్వారు రవిశంకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో ఆలోచించి సమాజ సేవలో భాగస్వాములు కావాలని కోరారు. వేదాంత్ భవిష్యత్తులో మరిన్ని పుట్టినరోజు వేడుకలను సేవా కార్యక్రమాలతో జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ సంస్థ తరఫున ఆశీస్సులు అందించారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు హరికృష్ణ, మాధవి, ఆశ్రమ నిర్వాహకులు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



## ఈడీ అధికారులు భూముల డాక్యుమెంట్లు మాత్రమే అడిగారు

### - డాక్యుమెంట్ వెరిఫికేషన్ చేసి వెళ్లారు ఎలాంటి ఇబ్బందులు లేవు -వైఎస్ మనోహర్ రెడ్డి



ప్రజాభూమి, పులివెందుల

ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఇంట్లో జరిగిన ఈడీ సోదాల్లో ఎలాంటి ఇబ్బందులు లేవని,అధికారులు కేవలం భూములకు సంబంధించిన డాక్యుమెంట్లుమాత్రమే అడిగారని మున్సిపల్ వైకాపా ఇన్చార్జి వైఎస్ మనోహర్ రెడ్డి తెలిపారు. ఈడీ అధికారులు శుక్రవారం ఉదయం 6 గంటలకు అవినాష్ రెడ్డి ఇంటికి రాగా, సమాచారం అందుకుని తాను అక్కడికి వెళ్లానని ఆయన చెప్పారు. విలేకరులతో మాట్లాడుతూ ఈడీ అధికారులు నాలుగు చోట్ల ఉన్న భూముల పత్రాలను మాత్రమే అడిగారు. వాటిని చూపించడం జరిగింది. డాక్యుమెంట్ వెరిఫికేషన్ చేసి తిరిగి నాకే వెనక్కు ఇచ్చారు. ఇంటి లోపల ఇతర ప్రశ్నలు ఏమీ అడగలేదు. మొత్తం నలుగురు అధికారులు వచ్చారు. వారు మళ్లీ వచ్చే అవకాశం లేదు అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఈడీ అధికారులు మీరు కూడా ఈ కేసులో ఉన్నారా అని మాత్రమే అడిగారని, అంతకు మించి ఏమీ అడగలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి,ఉపాధ్యక్షుడు వారణపల్లె కిషోర్, మాజీ కౌన్సిలర్ కోడి రమణ,షమీవుల్లా తదితర వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీరామ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా సీతారాముల కళ్యాణం



ప్రజాభూమి పోరుమామిళ్ల :

పోరుమామిళ్ల మండలం తిమ్మారెడ్డి పల్లె పంచాయతీ తోకలపల్లి గ్రామంలో శుక్రవారం అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం అత్యంత వైభవోపేతంగా శ్రీ రామ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కాటసాని వెంకటరెడ్డి దంపతులు కుటుంబ సభ్యులు గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున నిర్వహించారు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. అలాగే వరలక్ష్మి వ్రతం సందర్భంగా లక్ష కుంకుమార్చన నిర్వహించారు అనంతరం భక్తాదులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. మహిళలు పిల్లలు వేసిన కోలాటం అందరిని ఆకట్టుకున్నాయి.

## సేవే ధ్యేయమంటూ ముందుకు సాగుతున్న మానవత

### -శాంతి ర్యాలీలో సి. ఐ. శ్రీరామ్.




ప్రజాభూమి, పులివెందుల

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సామాజిక సేవలో తరిస్తోందని పులివెందుల అర్బన్ సీఐ శ్రీరాం అన్నారు. మానవత శాంతి వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం నాలుగు రోడ్ల కూడలి లోని గాంధీ విగ్రహం వద్ద జెండా ఊపి ఆయన ర్యాలీని ప్రారంభించారు. అంతకుముందు మానవత సభ్యులు గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం మానవత సభ్యులను ఉద్దేశించి సీఐ శ్రీరామ్ మాట్లాడుతూ సమాజంలో స్వార్థం పెరిగి తాను, తన కుటుంబం తప్ప ఇతరుల గురించి ఆలోచించే తత్వమే మనిషికి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో సామాజిక సేవే ధ్యేయంగా ముందుకు సాగుతున్న మానవతను ఆయన అభినందించారు. సంస్థకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. నాలుగు రోడ్ల కూడలి నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ పూలంగళ్ళ కూడలిలో గల పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు కొనసాగింది. సంస్థ చైర్మన్ డివి కొండారెడ్డి, కన్వీనర్ బివి కృష్ణారెడ్డి, అధ్యక్ష కార్యదర్శులు చెవ్వ కృష్ణారెడ్డి, గురు ప్రసాద్ లతో కలసి మానవత వ్యవస్థాపకులు ఎన్. రామచంద్రారెడ్డి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం మానవహారంగా ఏర్పడిన సభ్యులను ఉద్దేశించి వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి, చైర్మన్ డివి కొండారెడ్డి లో ప్రసంగించారు. పులివెందుల మానవత ఇదే స్ఫూర్తితో సేవా కార్యక్రమాలను సాగించాలని రామచంద్రారెడ్డి కోరారు. ఆయా కార్యక్రమాల్లో చైర్మన్ డివి కొండారెడ్డి, కన్వీనర్ బివి కృష్ణారెడ్డి, అధ్యక్ష కార్యదర్శులు చెవ్వ కృష్ణారెడ్డి, గురు ప్రసాద్, రీజియన్ సభ్యులు ఎంవి శేషయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు జి .చంద్రశేఖర్ రెడ్డి, పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు ఏవి గోపాల్ రెడ్డి, ఆత్మీయ కమిటీ అధ్యక్షులు రాజేశ్వర్ రెడ్డి, అడ్వైజరీ బోర్ సభ్యులు టి రామమోహన్, మాజీ అధ్యక్ష కార్యదర్శులు జయరాజ్, అంగడి నాగేంద్ర, సుబ్బారెడ్డి లతోపాటు పలువురు మానవత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## వరలక్ష్మి దేవిగా శ్రీ వాసవి మాత దర్శనం

### - వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ప్రత్యేక పూజలు

### - మంగళవాయిద్యాల నడుమ ప్రాకారోత్సవం



ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక పట్టణంలోని 122 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్‌శర్మ నేతృత్వంలో వాసవి కన్యకాపరమేశ్వరి దేవికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్ తెలిపారు. అనంతరం శ్రీ వాసవి మాతను వరలక్ష్మీదేవిగా ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి అమ్మవారిని పీఠంపై కొలువుదీర్చి భుజాలపై మోస్తూ మంగళవాయిద్యాల నడుమ ఆలయం చుట్టూ ప్రాకారోత్సవం నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళలు అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించారు. ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో లలితా సహస్రనామావళి, వాసవి అష్టోత్తర శతనామావళి పారాయణం చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు మిట్టా ప్రవీణ్, ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు దొంతు సుబ్బారావు, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు రాయవరం సుబ్బు, ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు బచ్చు భాగేశ్వరమ్మతో పాటు ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, శ్రీ వాసవి కళ్యాణ మండపం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ఎంపీ అవినాష్ రెడ్డి ఇళ్లలో ఏకకాలంలో ఈడీ సోదాలు

### పులివెందుల, హైదరాబాద్‌లో తనిఖీలు - వైకాపా నేతల్లో ఉత్కంఠ



ప్రజాభూమి, పులివెందుల

వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో మనీలాండరింగ్ కోణంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు శుక్రవారం సంచలన చర్య చేపట్టారు. పులివెందుల, హైదరాబాద్‌లోని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి నివాసాలతో పాటు సన్నిహితుల ఇళ్లలో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. పులివెందులలో ఎంపీ అవినాష్ రెడ్డి ఇంట్లో దాదాపు 5 గంటల పాటు ఈడీ అధికారులు తనిఖీలు చేశారు. అలాగే దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి,ఎర్ర గంగిరెడ్డి,డ్రైవర్ దస్తగిరి,సునీల్ యాదవ్ ఇళ్లలోనూ తనిఖీలు కొనసాగించారు. శివశంకర్ రెడ్డి ఇంట్లో 30 వేల నగదు, బంగారు గొలుసు లభించినట్లు, అయితే వాటిని తిరిగి అప్పగించినట్లు సమాచారం. హైదరాబాద్‌లోని అవినాష్ రెడ్డి ఇంట్లో కీలక ఆధారాలు లభించలేదని తెలుస్తోంది. ఈడీ సోదాల సమాచారం తెలుసుకున్న వైకాపా నాయకులు, కార్యకర్తలు భారీగా అవినాష్ రెడ్డి నివాసం వద్దకు చేరుకున్నారు. దీంతో పులివెందులలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సీఆర్‌పీఎఫ్ బలగాలను మోహరించి ఈడీ అధికారులకు భద్రత కల్పించారు. వివేకా హత్య కేసులో ఆర్థిక లావాదేవీలపై ఈడీ ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. పులివెందుల నుంచి హైదరాబాద్ వరకు జరిగిన ఈ సోదాలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న బీటెక్ రవి

### మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో మహాలక్ష్మి ఆలయంలో వరలక్ష్మీ వ్రత పూజలు



ప్రజాభూమి, పులివెందుల

వరలక్ష్మీ వ్రతం సందర్భంగా పులివెందుల ముద్దనూరు రోడ్డులోని మహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పులివెందుల టిడిపి ఇంచార్జ్ బీటెక్ రవి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమాన్ని మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ తూగుట్ల మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో జరిగిన పూజల్లో బీటెక్ రవి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్, నల్లగారి భాస్కర్ రెడ్డి,హాజ్ , ఉర్దు అకాడమీ డైరెక్టర్ మహబూబ్ బాషా, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు విజయవంతం చేద్దాం

### నేత్రదానంపై అవగాహన పెంచాలని పిలుపు



ప్రజాభూమి, పులివెందుల

దేశవ్యాప్తంగా ఈ నెల 25వ తేదీనుండి ప్రారంభమయ్యే జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను విజయవంతం చేయాలని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధి ప్రతినిధి పవన్ కుమార్,స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజు పిలుపునిచ్చారు. పులివెందులలో ని నేత్ర సేకరణ కేంద్రాన్ని వారు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా టెక్నీషియన్ అరవింద్ తో కలిసి నేత్రదానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను చైతన్యవంతులను చేయాలని సూచించారు. వారు మాట్లాడుతూ, మరణానంతరం దానం చేసే నేత్రాలు ఇద్దరు అంధులకు వెలుగును ప్రసాదిస్తాయని తెలిపారు. కార్నియా సమస్యలతో బాధపడుతున్న వారికి చూపు అందించే అత్యంత గొప్ప మానవతా సేవ ఇదేనని పేర్కొన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ నేత్రదాన ప్రతిజ్ఞ చేసి, తమ కుటుంబ సభ్యులకు కూడా ఈ విషయంపై అవగాహన కల్పించాలని కోరారు. అంధత్వ నివారణకు అందరూ కృషి చేయాలన్నారు. స్నేహిత అమృత హస్తం సేవాసమితిఆధ్వర్యంలో పులివెందులలో కొనసాగుతున్న నేత్ర సేకరణ కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నేత్రదానం చేసేందుకు 9966509364 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ వ్యాధిగ్రస్తునికి మందులు పంపిణీ

### - ఆరు సంవత్సరాలుగా ఉచితంగా మందులు అందిస్తున్న స్వచ్ఛంద సంస్థ



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని మాధవరం-1 గ్రామానికి చెందిన మన ఊరికోసం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న బాబ్జీకి శుక్రవారం మందులు పంపిణీ చేశారు. కడప ఇందిరానగర్‌కు చెందిన బాబ్జీకి గత ఆరు సంవత్సరాలుగా ప్రతి నెలా రూ. 2 వేల విలువైన మందులను సంస్థ అందిస్తోంది. ఇందులో భాగంగా సంస్థ చైర్మన్ అవ్వారు రవిశంకర్ బాబ్జీని కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని రూ. 2 వేల విలువైన మందులను అందజేశారు. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ బాబ్జీ ఆరోగ్యం ప్రస్తుతం మెరుగుపడిందని, త్వరగా పూర్తిగా కోలుకుని ఆరోగ్యవంతంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రతినెలా మందుల పంపిణీకి సహకరిస్తున్న దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సామల చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## మాధవరం-1 లో నేడు దీర్ఘకాలిక వ్యాధులకు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం



ప్రజాభూమి, సిద్ధవటం: సిద్ధవటం మండలం మాధవరం-1లోని శాంతి హెల్త్ కేర్ క్లినిక్‌లో శనివారం దీర్ఘకాలిక వ్యాధులకు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆయుర్వేద వైద్యులు డాక్టర్ ప్రసన్నకుమార్, డాక్టర్ లక్ష్మీనారాయణ (దీఎమీా) శుక్రవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. శిబిరంలో వివిధ రకాల వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తామని తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## వరలక్ష్మివ్రతం సందర్భంగా శీతల గంగమ్మకు ప్రత్యేక పూజలు



ప్రజాభూమి, సిద్ధవటం: వరలక్ష్మి వ్రతాన్ని పురస్కరించుకుని మాధవరం-1 పార్వతీపురం గ్రామంలోని శ్రీ శీతల గంగమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి రంగమ్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, కలశ పూజ, కుంకుమార్చనతో పాటు అమ్మవారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. మహిళా భక్తులకు పసుపు, కుంకుమ, గాజులను అందజేశారు. సకాలంలో వర్షాలు కురిసి ప్రజలు సుభిక్షంగా, సిరిసంపదలతో సంతోషంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు పూజారి తెలిపారు. రాత్రి భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

## వరలక్ష్మీవ్రతం వేళ.. శ్రీవారికి వెండి పాదాలు- భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

ప్రజాభూమి, వేంపల్లె

శ్రావణ మాసంలోని పవిత్రమైన వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారికి వెండి పాదాలను సమర్పించారు. వల్లూరి వెంకటసుబ్బారెడ్డి--పూర్ణమ్మ దంపతులు ఉభయదాతలుగా వెండి పాదాలను దేవస్థానం కార్యనిర్వహణాధికారి సుభాష్‌కు, ఆలయ చైర్మన్ పీవీ రమణ, అర్చకులు తిరుమల వేణు సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ వేంకటేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఉభయదాతలు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఉభయదాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేశారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఆలయంలో భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించడంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు



శనివారం 22 ఆగష్టు 2026

## నాయుడుపేట శ్రీ పోలేరమ్మ ఆలయంలో వరలక్ష్మీ వ్రతం పూజలు



ప్రజా భూమి ప్రతినిధి (నాయుడుపేట) తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణంలో వెలసి ఉన్న గ్రామ దేవత శ్రీ శ్రీ పోలేరమ్మ ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం పర్వదినం సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు,కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ పోలేరమ్మ అమ్మవారి తోపాటు ఆలయాన్ని 11 వేల 11 వందల 11 డజన్ల గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ఈ వో నవీన్ కుమార్,శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు,కమిటీ సభ్యులు నిత్య కృష్ణారెడ్డి,ఆబోతుల బాబు,హైమావతి,వినుకొండ ధనుంజయ,బాలు శెట్టి,కంచర్ల సురేష్,పి మురళి పాల్గొన్నారు.

## వివాహ వేడుకలో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



ప్రజా భూమి ప్రతినిధి (నాయుడుపేట)

తంబిరెడ్డి మనోహర్ రెడ్డి మేనకోడలు,డాక్టర్ శ్రీధర్ రెడ్డి మేనల్లుడి వివాహ వేడుకకు తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య ముఖ్య అతిథులుగా వివాహ వేడుకల్లో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.శుక్రవారం ఈ సందర్భంగా నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ,వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో,ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట పట్టణ అధ్యక్షులు కలికి మాధవ రెడ్డి,రవీంద్ర రెడ్డి,మాచవరం మధు రెడ్డి,తదితర పార్టీ నాయకులు,సోదరులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

## నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న రెడ్డివారి గురవారెడ్డి




ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.

శుక్రవారం ఏర్పేడు మండలం బండా రుపల్లి గ్రామంలో టీచరైన నత్తం భక్తి రెడ్డి నూతన గృహప్రవేశం కార్యక్రమానికి హాజరై వారికి వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని బహుకరించి శుభాకాంక్షలు అందజేసిన ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మరియు నెల్లూరు అర్బన్ నియోజకవర్గ పార్టీ పరిశీలకులు డాక్టర్ రెడ్డి వారి గురువారెడ్డి మాజీ సర్పంచ్ మండల తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు ఆర్ శివ శంకర్ రెడ్డి గ్రామ పార్టీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం యాదవ్ శ్రీకాళహస్తి మండల పార్టీ నాయకులు మహేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో శ్రీ వరలక్ష్మి వ్రతం పూజలు

### పూజలో పాల్గొన్న మాతాజీ శ్రీ రమ్యానంద భారతి స్వామిని



ప్రజా భూమి ప్రతినిధి రామచంద్రపురం

రామచంద్రపురం మండలం రాయలచెరువు గ్రామంలో శ్రీ వరలక్ష్మీ వ్రత మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శ్రీశక్తి పీఠాధిస్వరి మాతాజీ శ్రీ రమ్యానంద భారతి మహాస్వామిని ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాతాజీ రమ్యానంద భారతి మాట్లాడుతూ ఎక్కడైతే స్త్రీలను గౌరవించి పూజిస్తారో, అక్కడ లక్ష్మీదేవి కటాక్షం తప్పక ఉంటుందని అన్నారు. కుటుంబంలో మహిళలను గౌరవించడం భారతీయ సంస్కృతిలో ఎంతో గొప్ప సంప్రదాయమని తెలిపారు. మాతాజీకి మండల టీడీపీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి కుటుంబ సభ్యులు పుష్పాలతో ఘన స్వాగతం పలికి పాదాభిషేకం నిర్వహించారు. అనంతరం పండితులు ప్రదీప్ అయ్యంగార్ ఆధ్వర్యంలో అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు, వ్రత కార్యక్రమాలను నిర్వహించారు.వరలక్ష్మీ వ్రతం విశిష్టతను భక్తులకు వివరించిన పండితులు.. అమ్మవారి అనుగ్రహంతో కుటుంబాల్లో సుఖసంతోషాలు, ఐశ్వర్యం కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పూజలో పాల్గొన్న ప్రతి మహిళకు మేకల మాధవి తిరుమలరెడ్డి దంపతులు పసుపు కుంకుమ పసుపుదారు, జాకెట్టు పండ్లు వావినంగా ఇచ్చారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## రేకలచేను గ్రామంలో ఘనంగా శ్రీ వారాహి దేవి కుంకుమార్చన



ప్రజా భూమి ప్రతినిధి రామచంద్రపురం

రామచంద్రాపురం శ్రీ శక్తి పీఠాధీశ్వరి, మంత్ర మహేశ్వరీ మాతాజీ శ్రీ రమ్యానంద భారతీ మహాస్వామినిలి వారి దివ్య ఆశీస్సులతో, వాడ వాడలా వారాహీ కార్యక్రమంలో భాగంగా రామచంద్రాపురం మండలం, అనుపల్లి పంచాయతీ, రేకలచేను గ్రామంలోని జన్మస్థల శివాలయం నందు శ్రీ వారాహి దేవి కుంకుమార్చన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం లో చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు, గ్రామస్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంకల్ప హాస్పిటల్ ఫౌండర్ శ్రీ సోమేశ్వర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శ్రీ శక్తి పీఠం వారు నిర్వహిస్తున్న 'వాడ వాడలా వారాహీ' కార్యక్రమం ప్రజలలో ఆధ్యాత్మిక భావాన్ని, భక్తి విశ్వాసాలను పెంపొందించేలా ఎంతో అద్భుతంగా సాగుతోందని కొనియాడారు. పూజా కార్యక్రమాల అనంతరం విచ్చేసిన భక్తులందరికీ తీర్థ ప్రసాదాల అందజేశారు.

## గొలుసు దొంగతనాలకు చెక్ పెట్టిన పోలీసులు. ఇద్దరు అరెస్టు



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

రేణిగుంట, ఏర్పేడు పోలీస్ స్టేషన్ల పరిధిలో వరుసగా జరిగిన గొలుసు దొంగతనాల కేసులను పోలీసులు ఛేదించారు. ఇద్దరు యువకులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 67 గ్రాముల బంగారు ఆభరణాలు, కేటీఎం డ్యూక్ 250 ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు. స్వాధీనం చేసుకున్న సొత్తు మొత్తం విలువ రూ.10.21 లక్షలు ఉంటుందని అడిషనల్ ఎస్పీ శ్రీనివాసులు, డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఏర్పేడు పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల దర్యాప్తులో భాగంగా విక్కీ విజయ్‌రాజ్ (22), కుమార్ (19)ను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. వారి నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాల విలువ రూ.8.71 లక్షలు కాగా, కేటీఎం డ్యూక్ 250 బైక్ విలువ రూ.1.50 లక్షలుగా అంచనా వేశారు. 2024, 2025, 2026లో నమోదైన పలు గొలుసు దొంగతనాల కేసులతో నిందితులకు సంబంధం ఉన్నట్లు దర్యాప్తులో తేలిందన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు, తమ పిల్లలపై ప్రత్యేక నిఘా ఉంచాలని పోలీసులు కోరారు. యువత సామాజిక మాధ్యమాలు, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌ల వినియోగంపై తల్లిదండ్రులు ప్రత్యేకంగా దృష్టి ఉంచాలని పోలీసులు సూచించారు. పిల్లల ప్రవర్తన, స్నేహాలు, కార్యకలాపాలను ఎప్పటికప్పుడు గమనించాలని కోరారు. ప్రజలు ఒంటరిగా ప్రయాణించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, బహిరంగ ప్రదేశాల్లో విలువైన ఆభరణాలను ప్రదర్శించవద్దని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు, యువకులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో సీఐ జయచంద్ర, ఎస్ఐలు శ్రీకాంత్‌రెడ్డి, ఇమామ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## నాలుగు రోజుల పాటు స్పెషల్ క్యాంపైన్ డే నిర్వహణ

### నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి ఎం.జయకృష్ణ.



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణలో భాగంగా తిరుపతి నియోజకవర్గ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో నాలుగు రోజులు పాటు స్పెషల్ క్యాంపైన్ డే నిర్వహించనున్నామని 167-నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి ఎం.జయకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి సూచనల మేరకు ఈనెల 22,23, 29,30 వ తేదీల్లో 167- తిరుపతి నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈ స్పెషల్ కాంపెయిన్ డే నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం నందు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో భాగంగా క్లైములు మరియు అభ్యంతరాల్ని స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవెల్ అధికారులు మరియు సూపర్వైజర్స్ ఖచ్చితంగా పాల్గొనాలని, లేని యెడల శాఖపరమైన చర్యలు తీసుకుంటామని నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి ఎం.జయకృష్ణ ఆ ప్రకటనలో హెచ్చరించారు. ఓటర్లు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## గూడూరులో ఘనంగా శ్రావణ మాస వరలక్ష్మి వ్రత పూజలు



ప్రజా భూమి ప్రతినిధి గూడూరు,

గూడూరు పట్టణంలోని సత్రపు వీధిలో ఉన్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి పాలు పెరుగు తేనె తదితర సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణ ఏర్పాటు చేశారు అన్నదాన



కార్యక్రమం నిర్వహించారు భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించి పూజా కార్యక్రమాల్లో పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు అలాగే బొడ్డు చౌక్ ప్రాంతంలో ఉన్న శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు బంగారు చీరలో దర్శనమిచ్చారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గూడూరు రెండో పట్టణ పరిధిలోని దిగువ వీరారెడ్డి పల్లి లో ఉన్న శ్రీ మహాలక్ష్మమ్మ వారి దేవస్థానంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి విశేష అలంకరణ ఏర్పాటు చేశారు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు అలాగే సొసైటీలో ఉన్న నారాయణమ్మ పేరంటాలు దేవస్థానంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించి పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## చంద్రగిరి పరిధిలో అంతర్ జిల్లా ద్విచక్ర వాహనాల దొంగల ముఠా అరెస్ట్

### ఆరుగురు నిందితుల అరెస్ట్ -- రూ.20 లక్షల విలువైన 18 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో స్వాధీనం

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్ ఆదేశాల మేరకు ద్విచక్ర వాహనాల చోరీలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా, సమర్థవంతమైన దర్యాప్తు చేపట్టిన చంద్రగిరి పోలీసులు అంతర్ జిల్లా వాహన దొంగల ముఠాను అరెస్ట్ చేశారు. చంద్రగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన వాహన చోరీ కేసుల దర్యాప్తులో భాగంగా ఆరుగురు నిందితులు పఠాన్ అఫ్రోజ్ (21), ఎణిమేటి లోచన్ నివాస్ (19), కృష్ణప్ప ఆచారి సాయి కృష్ణ (18), మదారపు వంశీకృష్ణ (19), నీరుకొండ జితేంద్ర బెనర్జీ (20), పందల సతీష్ బాబు (28)లను ఆగస్టు 21 ఉదయం నారావారిపల్లి--భీమవరం రోడ్డులోని శేషాపురం శివాలయం సమీపంలో అరెస్ట్ చేశారు. నిందితులు ఇచ్చిన సమాచారంతో శ్రీనివాసమంగాపురం సమీపంలోని రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో దాచిన 18 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.20 లక్షలు. దర్యాప్తులో చంద్రగిరి, ఎస్వీయూ క్యాంపస్, తిరుపతి రూరల్, తిరుచానూరు, శ్రీకాళహస్తి, నెల్లూరు రూరల్, వేదాయపాళెం, మనుబోలు తదితర పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగిన చోరీలకు ఈ ముఠా పాల్పడినట్లు గుర్తించారు. కేసు ఛేదనలో చంద్రగిరి బి. ప్రసాద్, సురేష్ కుమార్, బి. రవి ప్రకాష్ రెడ్డి, ఈ. అరుణాచలం, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్ల సమన్వయంతో పనిచేశారు. సాంకేతిక ఆధారాలతో సమర్థవంతంగా దర్యాప్తు చేసి కేసును ఛేదించిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్ అభినందించారు. ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడే వ్యక్తులు, ముఠాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని పోలీసులు తెలిపారు. ప్రజలు తమ వాహనాలను భద్రంగా ఉంచుకోవడంతో పాటు అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.




## 24న దళిత గిరిజనులకు ఇంటీ స్థలాలు స్మశాన స్థలాలు చూపించాలని ఆర్డీవో కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయండి:

### -సిపిఐ మించల శివ కుమార్ పిలుపు



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్ర టౌన్

శ్రీకాళహస్తి వ్యవసాయం కార్మిక సంఘం రాష్ట్ర సమితి పిలుపుమేరకు ఈనెల 24వ తేదీన స్థానిక ఆర్డిఓ కార్యాలయం వద్ద దళిత గిరిజన సమస్యలపై ఉపాధి హామీ కూలీల సమస్యలపై జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు జిల్లా నాయకులు వీ శివ కుమార్ జే తులసి రాజన్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు వాగ్దానాలు అమలు చేయాలని పేదలకు గ్రామాలలో 3 సెంట్లు పట్టణ ప్రాంతాలలో రెండు సెంట్లు ఇంటి స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని అన్ని రకాల ప్రభుత్వ భూములు పేదలకు కుటుంబానికి రెండు ఎకరములు ఇవ్వాలని ప్రభుత్వ భూములు పేదలకు పంచాలని భూ సమస్యలు పరిష్కరించి 22ఏ లో పెట్టిన పేదల ప్రభుత్వ భూములకు ఒరిజినల్ అడంగల్ లో 1బీ వచ్చేలా చేసి ప్రభుత్వము నుండి అన్ని రకాల సహాయం అందించాలని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని ఎ బి గ్రామ్ జి రద్దు చేయాలని దళిత గిరిజన గ్రామాలలో స్మశాన స్థలాలు కబ్జాకు గురైన భూములను సర్వే చేసి చూపించాలని జరిగే ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మికులు ఉపాధి పథకం కార్మికులు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలు ప్రజలు పాల్గొని ఆర్డిఓ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునివ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు రుద్రపాకు శ్రీనివాసులు పరశురామయ్య సుబ్బమ్మ మల్లమ్మ వెంకట కృష్ణయ్య వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు

## గ్రామ శ్రేయస్సు కొరకు గ్రామ దేవత శ్రీ నాగాలమ్మ తల్లికి పూజలు

### ప్రతి ఇంటి నుంచి పొంగళ్ళు సమర్పించిన మహిళలు



ప్రజా భూమి ప్రతినిధి రామచంద్రపురం

రామచంద్రపురం మండలం సికె పల్లి పంచాయతీ చిట్టత్తూరు గ్రామంలో గ్రామ మహిళలు శుక్రవారం వరలక్ష్మి దేవి వ్రతంలో భాగంగా ప్రతి ఒక్కరూ వారి ఇంటి దగ్గర అష్టైశ్వర్యాలకు మూల దేవత అయిన శ్రీ వరలక్ష్మీ దేవికి ప్రత్యేక పూజలు చేసి మొక్కలు తీర్చుకుని అనంతరం గ్రామ శ్రేయస్సు కొరకు గ్రామంలో ప్రజలు, పాడి పశువులు అందరూ సుభిక్షంగా ఉండాలని గ్రామ దేవత శ్రీ నాగాలమ్మ తల్లికి ప్రతి ఇంటి నుంచి పొంగళ్ళు తీసుకువెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. నాగదేవతలకు పాలు పెరుగు సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేసి పసుపు కుంకుమ పూలు పండ్లు ప్రతి ఒక్కరూ అమ్మవారికి నైవేద్యంగా తీపి పొంగలి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా గ్రామ దేవత శ్రీ నాగాలమ్మ తల్లికి ప్రదక్షిణలు చేసి వారి కుటుంబము మరియు గ్రామము సుభిక్షంగా ఉండాలని గ్రామంలో ఎలాంటి దుష్టశక్తులు, అనారోగ్య సమస్యలు, పాడి పశువులకు ఆరోగ్య సమస్యలు, ముఖ్యంగా రైతులకు పొలాలలో పాముల నుంచి అనునిత్యం కాపాడాలని కోరుకున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం నాగదేవతలకు అనునిత్యం పూజలు చేస్తామని తెలిపారు. నాగదేవత మమ్మల్ని మా పిల్లల్ని మా గ్రామాన్ని అనునిత్యం కాపాడి మమ్మల్ని ఆశీర్వదించి సుఖశాంతులు కల్పిస్తుందని వాళ్ల అపార నమ్మకమని తెలిపారు.

## డీఎస్సీ పరీక్షలో ఎలాంటి అక్రమాలు జరగలేదు

### ప్రతిభ ఆధారంగానే ఉద్యోగం పొందా



ప్రజా భూమి ప్రతినిధి గూడూరు,

కష్టపడి చదువుకొని ఉపాధ్యాయ ఉద్యోగం కొరకు ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నామని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రకటించిన డీఎస్సీ పరీక్షల్లో మంచి మార్కులు సాధించి ఉద్యోగం పొందామని ప్రతిపక్ష వైసిపి పార్టీ చెబుతున్నట్లుగా ఏటువంటి అక్రమాలు జరగలేదని గూడూరు పట్టణానికి చెందిన డీఎస్సీ ఉద్యోగిని జీవన శ్రీ వెల్లడించారు . గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ స్థానిక రెండవ పట్టణ పరిధిలో డీఎస్సీ పరీక్షల్లో ఉత్తీర్ణురాలై ఉద్యోగం పొందిన మహిళ జీవన శ్రీ నివాసానికి వెళ్లి ఆమెతో మాట్లాడారు డీఎస్సీ పరీక్షలపై ప్రతిపక్ష వైసిపి చేస్తున్న ప్రచారం గురించి ఆమెకు వివరించి ఆమె అభిప్రాయాన్ని తెలుసుకున్నారు జీవన శ్రీ మాట్లాడుతూ 2018 సంవత్సరంలో టిడిపి ప్రభుత్వంలోనే డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు ఇచ్చారని తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 16500 ఉద్యోగాలు న్యాయబద్ధంగా పరీక్షలు నిర్వహించి ఇచ్చారని ఎటువంటి అక్రమాలు జరగలేదని అన్నారు మా ఉద్యోగాలు తీసివేయాలని వైసీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారని చదువుకొని ఉద్యోగాలు పొందిన మా ఉద్యోగాలు తీసివేస్తే ఉద్యోగాలు పొందిన అందరం వారి ఇంటి ముందు కూర్చుంటామని వారి సంగతి తెలుస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో నాయకులు బిల్లు చెంచురామయ్య ,కిరణ్ కుమార్, రహీం ,రత్నం, నరసింహులు, చంద్రమౌళి ,తదితరులు పాల్గొన్నారు



## దైవ స్వభావం... ఆధ్యాత్మిక భావం

### రచయిత,అధ్యయనకారుడు టీవీఎల్ ప్రసాద్

**ముత్తూట్ ఎంక్రేడ్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శ్రీ వరలక్ష్మి వ్రతకల్పం పుస్తకాలు పంపిణీ**



ప్రజా భూమి ప్రతినిధి గూడూరు,

దైవ స్వభావంతో కూడిన ఆధ్యాత్మిక భావాన్ని ప్రతి ఒక్కరూ అవలంభించాలని రచయిత,అధ్యనకారుడు టీవీఎల్ ప్రసాద్ అన్నారు.శుక్రవారం నాడు గూడూరు రెండో పట్టణంలోని స్వర్ణ భారత్ నగర్ లో ముత్తోట్టు ఎంక్రెడ్ లిమిటెడ్ ఆధ్వర్యంలో 2026 శ్రీ వరలక్ష్మి వ్రతం సందర్భంగా "వ్రతకల్పం" పుస్తకాలను ముద్రించి ఉచితంగా ప్రజలకు అందజేయడం జరుగుతుంది. శ్రీ వరలక్ష్మి వ్రతకల్పం పుస్తకాలు టీవీఎల్ ప్రసాద్ దంపతుల చేతుల మీదుగా విడుదల చేసి ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీవీఎల్ ప్రసాద్ మాట్లాడుతూ గోల్డ్ రంగంలో ప్రసిద్ధి గాంచిన "ముత్తోట్టు ఎంక్రెడ్ లిమిటెడ్" సామాజిక సేవ కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలకు తోడ్పాటును అందించడం అభినందనీయమన్నారు.మహిళా సాధికారతకు కుట్టు మిషన్లు,విద్యను ప్రోత్సహించేందుకు విద్యా సామాగ్రి అందించి తమ ఘనతను సంస్థ చాటుకుందన్నారు. మహిళాలు,చిరు వ్యాపారులకు అతి తక్కువ వడిఢకి రుణాలను అందిస్తూ వారి అభ్యున్నతికి పాటుపడుతూ పండుగ దినాలకు ప్రత్యేకంగా పూజ పుస్తకాలనుఅందించడం మంచి పరిణామం అన్నారు.అనంతరం స్థానికులకు ఉచితంగా పుస్తకాలను అందించారు.శ్రీ మహాలక్షమ్మ, శ్రీ రాజా రాజేశ్వరి,శ్రీ కన్యకా పరమేశ్వరీ దేవస్థానంలో భక్తులకు ఉచితంగా పుస్తకాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ముత్తూట్ ఎంక్రేడ్ లిమిటెడ్ మేనేజర్ ఉడతా శశిధర్,సిబ్బంది ఉస్మాన్, శ్రావణి,శిరీష తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 9

శనివారం 22 ఆగష్టు 2026

# శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో వైభవంగా వరలక్ష్మీ వ్రతం

- భక్తిశ్రద్ధలతో పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు
- శోభాయమానంగా ముస్తాబైన అష్టలక్ష్మీ మండపం
- సాయంత్రం వైభవంగా స్వర్ణరథోత్సవం









ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి రూరల్

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం శుక్రవారం భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ ఆస్థాన మండపంలో నిర్వహించిన ఈ పవిత్ర వేడుకలో టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సిహెచ్. వెంకయ్య చౌదరి పాల్గొన్నారు.

విశేష పూజలతో వరలక్ష్మీ వ్రతం

వేకువజామున అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి సహస్రనామార్చన, నిత్యార్చన, మూలవర్లకు, ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహించారు. ఈ పర్వదినాన శ్రీ పద్మావతి అమ్మవారు బంగారు చీరతో విశేషంగా అలంకరించుకుని భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. అనంతరం ఉత్సవమూర్తిని ఆస్థాన మండపానికి వేంచేపు చేసి పద్మపీఠంపై ఆశీనులను చేశారు. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, కలశస్థాపన, అమ్మవారి ఆరాధన, అంగపూజ, లక్ష్మీ సహస్రనామార్చన, అష్టోత్తర శతనామావళి తదితర వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. రోజా, మల్లె, చామంతి, సంపంగి, తామర, తులసి తదితర సుగంధ, సంప్రదాయ పుష్పాలతో అమ్మవారిని భక్తిశ్రద్ధలతో అర్చించారు. తొమ్మిది గ్రంథులతో అమ్మవారిని అలంకరించి, ఒక్కో గ్రంథిని ఒక్కో దేవతకు ప్రతీకగా పూజించారు. అనంతరం 12 రకాల నైవేద్యాలను సమర్పించి మంగళహారతితో వ్రతాన్ని ముగించారు.

మహిళలకు మంగళప్రదమైన వరలక్ష్మీ వ్రతం

వరలక్ష్మీ వ్రతం ఆచరించడం ద్వారా సత్సంతానం, దీర్ఘమాంగల్య సౌఖ్యం, సిరిసంపదలు, ఆరోగ్యం, కుటుంబ సౌఖ్యం కలుగుతాయని పురాణాలు తెలియజేస్తున్నాయని ఆలయ అర్చకులు తెలిపారు. సాక్షాత్తు శ్రీ మహాలక్ష్మి అనుగ్రహంతో తిరుచానూరులో శ్రీ పద్మావతి అమ్మవారు అవతరించినందున, అమ్మవారి సన్నిధిలో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించడం అత్యంత విశిష్టమైనదని పేర్కొన్నారు. అమ్మవారి కరుణాకటాక్షాలు భక్తులపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఐశ్వర్యం, ఆరోగ్యం, శాంతి నెలకొనాలని భక్తులు ప్రార్థించారు.

భక్తులకు విస్తృత ఏర్పాట్లు

టీటీడీ జేఈవో ఏ. శరత్ మాట్లాడుతూ, వరలక్ష్మీ వ్రతానికి మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక క్యూలైన్లు, అన్నప్రసాదం, తాగునీరు, మజ్జిగ తదితర ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. భక్తులందరికీ అమ్మవారి ప్రసాదాలు అందించేలా చర్యలు చేపట్టామన్నారు. వ్రత కార్యక్రమాన్ని భక్తులు వీక్షించేలా ఎస్వీబీసీ ద్వారా ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పుష్ప సౌందర్యంతో కనువిందు చేసిన వ్రత మండపం

టీటీడీ ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వ్రత మండపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. 60 మంది సిబ్బంది మూడు రోజుల పాటు శ్రమించి సుమారు మూడు టన్నుల సంప్రదాయ పుష్పాలు, 14 రకాల 30 వేల కట్ ఫ్లవర్స్‌తో ఆలయం, ఆస్థాన మండపం, వ్రత మండపాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. డ్రాగన్ ఫ్రూట్, ద్రాక్ష, ముసాంబి, పైనాపిల్ తదితర పండ్లు, వివిధ రకాల పుష్పాలతో వ్రత మండపాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు. మండపం పైభాగంలో గజలక్ష్మి అమ్మవారు, ఇరువైపులా ఐరావతాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అష్టలక్ష్మి మూర్తులు, రంగురంగుల రోజాలు, తామరపూలతో ఆస్థాన మండపం శోభాయమానంగా అలంకరించారు.

7 ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా ప్రత్యక్ష వీక్షణ

భక్తులందరూ వరలక్ష్మీ వ్రతాన్ని వీక్షించేందుకు ఆస్థాన మండపం, పుష్కరిణి, వాహన మండపం, ఫ్రైడే గార్డెన్స్, తొలప్ప గార్డెన్, గేట్ నం.3 తదితర ప్రాంతాల్లో మొత్తం ఏడు ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు.

స్వర్ణరథంపై అమ్మవారి దివ్య విహారం

వరలక్ష్మీ వ్రతం సందర్భంగా శుక్రవారం సాయంత్రం 6 గంటలకు శ్రీ పద్మావతి అమ్మవారు స్వర్ణరథంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు జీ. భానుప్రకాశ్ రెడ్డి, ఎన్. సదాశివరావు, సురేష్ కుమార్, జానకి దేవి, రంగశ్రీ, సీవీఎస్వో మురళీకృష్ణ, ఆలయ డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఇతర అధికారులు, సిబ్బంది, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## తిరుపతి వెంకటేశ్వర స్వామి సన్నిధిలో వాసుదేవ యాదవ్ సేవా సంఘం ఆధ్వర్యంలో కొత్త భవన నిర్మాణం



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

తిరుపతి వెంకటేశ్వర స్వామి సన్నిధిలో వాసుదేవ యాదవ్ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్మితమవుతున్న యాదవ భవన్ పురోగతి మీకందరికీ తెలిసిన విషయమే. శుక్రవారం వరలక్ష్మీ వ్రతం శుభదినం ఉదయం 5 గంటల నుండి ఆరు గంటల మధ్య గ్రౌండ్ ఫ్లోర్ నందు యాదవ భవన్ ఆఫీసుకు దాల్మందరం నిండు ముత్తయిదువులచే ఏర్పాటు చేయడమైనది ఈ కార్యక్రమంలో గొల్ల ఉమా నరసింహ యాదవ్ వెంకట పుష్పావతి యాదవ్ ఈతమాకుల గీతారాణి యాదవ్ గంగా పుష్పలత యాదవ్ కట్టమంచి రేఖ యాదవ్ మందడి హరిత యాదవ్ నక్కఅనురాధ యాదవ్ వీరి చేతుల మీదుగా దాల్మంద్రాన్ని ఆఫీసుకు ప్రతిష్ట చేసాము. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ వాసుదేవ యాదవ్ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి ఈతమాకుల హేమంత్ కుమార్ యాదవ్ సంఘం కోశాధికారి వెంకట రామచంద్ర యాదవ్ ఉపాధ్యక్షులు ఉల్లిపాయల మునుమేఘనాథం యాదవ్ మరో ఉపాధ్యక్షులు కట్టా జయరామ్ యాదవ్ సంయుక్త కార్యదర్శి చింతాభరణ యాదవ్ కొమ్ము చెంచయ్య యాదవ్ టీటీడీ ఎంప్లాయిస్ బ్యాంక్ అధ్యక్షులు గంగా రాజ్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేసినందుకు వాసుదేవ యాదవ్ సేవా సంఘం తరపున వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాం.

# నాయుడుపేటలో డివైడర్‌పైనే సంచార జాతుల జీవనం

### మృతదేహానికి ఫ్రీజర్ పెట్టేందుకు కరెంట్ లేక అవస్థలు -మృతదేహానికి కరెంట్ కష్టాలు.. అధికారుల స్పందనపై ఆగ్రహం

ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట.

తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణంలో ఇల్లు, స్థలం లేక డివైడర్లపైనే జీవనం సాగిస్తున్న సంచార జాతి కుటుంబాలకు కనీస సౌకర్యాలు కూడా అందడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఆ వర్గానికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందడంతో మృతదేహాన్ని భద్రపరిచేందుకు ఫ్రీజర్ ఏర్పాటు చేసినప్పటికీ, విద్యుత్ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బంధువులు మృతదేహం కోసం ఫ్రీజర్‌ను ఏర్పాటు చేయగా, దానిని వినియోగించేందుకు విద్యుత్ అవసరం ఏర్పడింది. దీంతో విద్యుత్ శాఖ అధికారులను సంప్రదించగా అధికారులు స్పందించి లైన్‌మన్‌ను పంపించారు. అయితే, ఈ ప్రాంతంలోని విద్యుత్ లైన్ మున్సిపల్ పరిధికి సంబంధించినదని, ముందుగా మున్సిపల్ కమిషనర్‌ను సంప్రదించాలని లైన్‌మన్ సూచించినట్లు సంచార జాతి ప్రజలు తెలిపారు. కమిషనర్‌ను ఫోన్ ద్వారా సంప్రదించేందుకు ప్రయత్నించినప్పటికీ ఫోన్‌కు స్పందించలేదని వారు ఆరోపిస్తున్నారు. మరోవైపు మృతదేహం ఎక్కువసేపు ఫ్రీజర్ లేకుండా ఉండటంతో దుర్వాసన వస్తోందని, చుట్టుపక్కల ఉన్న దుకాణాల యజమానులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇల్లు, స్థలం లేక డివైడర్లపైనే జీవిస్తున్న తమకు కనీసం మృతదేహాన్ని భద్రపరుచుకునేందుకు అవసరమైన విద్యుత్ సౌకర్యం కూడా కల్పించకపోవడం ఎంతవరకు సమంజసమని సంచార జాతి ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు, సంచార జాతి కుటుంబాల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని వారు కోరుతున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని చుట్టుపక్కల దుకాణాల యజమానులు కూడా విజ్ఞప్తి చేస్తున్నారు.



## వాకాడు ప్రెస్ క్లబ్ యూనియన్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు

### - అన్యోన్యతను చాటుకున్న వాకాడు విలేకరులు



ప్రజాభూమి ప్రతినిధి,వాకాడు

వాకాడు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి ఎంబేటి. సురేష్ జన్మదిన వేడుకలను గురువారం రాత్రి స్వర్ణముఖి గెస్ట్ హౌస్ లో నిర్వహించారు. ప్రెస్ క్లబ్ యూనియన్ జనరల్ సెక్రెటరీ సురేష్ జన్మదినాన్ని వాకాడు ప్రెస్ క్లబ్ యూనియన్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్‌కు కేక్ కట్ చేయించి, శాలువాతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకాడు ప్రెస్ క్లబ్ యూనియన్ అధ్యక్షులు కొండయ్య, గౌరవ అధ్యక్షులు వల్లి ప్రసాద్ ముఖ్యులుగా పాల్గొని సురేష్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వాకాడు మండలానికి చెందిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు పరస్పర స్నేహభావంతో ఒకరికొకరు అండగా నిలుస్తూ, అన్యోన్యతను చాటుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ యూనియన్ సభ్యులు, వాకాడు మండల విలేకరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కమిటీలు లేక.. క్యాడర్ గందరగోళం!

### ఎన్నికలకు సిద్ధమంటున్న అధినేత.. జిల్లాలో మాత్రం కొలిక్కిరాని పార్టీ వ్యవస్థ

ప్రజా భూమి ప్రతినిధి గూడూరు.

స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన పార్టీ సిద్ధంగా ఉండాలని ఆ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిలుపునిస్తున్న వేళ.. నెల్లూరు జిల్లాలో మాత్రం పార్టీ సంస్థాగత వ్యవహారాలపై స్పష్టత లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. గతంలో ఉన్న కమిటీలను రద్దు చేసి కొత్త కమిటీల కోసం దరఖాస్తులు స్వీకరించి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు జిల్లా, నియోజకవర్గ స్థాయి కమిటీలను ప్రకటించకపోవడంతో పార్టీ శ్రేణుల్లో అయోమయం నెలకొంది. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లాలోని ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాలెం, కావలి, గూడూరు పురపాలక సంఘాల్లో పార్టీ తరఫున ఎన్నికల వ్యవహారాలను ఎవరు ముందుండి నడిపించాలనే దానిపై స్పష్టత అవసరమవుతోంది. అభ్యర్థుల ఎంపిక, కార్యకర్తల సమన్వయం, బూత్ స్థాయి బాధ్యతలు, ప్రచార కార్యక్రమాల నిర్వహణకు స్థానికంగా నాయకత్వ వ్యవస్థ కీలకంగా మారనుంది. ప్రస్తుతం జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, బూత్ స్థాయి కమిటీలపై స్పష్టత లేకపోవడంతో క్రియాశీలక కార్యకర్తలు కూడా తమ బాధ్యత ఏమిటన్న విషయంలో సందిగ్ధంలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రజా సమస్యలపై అధికారులను ప్రశ్నించడంతో పాటు పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బాధ్యతలు కలిగిన నాయకత్వం అవసరమని కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. ఒకవైపు అధినేత ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తుండగా.. మరోవైపు జిల్లాలో సంస్థాగత కమిటీల ఏర్పాటులో జాప్యం జరగడం జనసేన ఎన్నికల సన్నద్ధతపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది. ఎన్నికల చివరి దశలో కమిటీలను ప్రకటించడం కంటే ముందుగానే బాధ్యతలు అప్పగించి బూత్ స్థాయి నుంచి పార్టీ యంత్రాంగాన్ని సిద్ధం చేయాలని పలువురు కోరుతున్నారు. ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాలెం, కావలి, గూడూరు పురపాలక సంఘాల్లో పార్టీ వ్యవహారాలను ఎవరు పర్యవేక్షించాలి? నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలు ఎప్పుడు ఖరారవుతారు? బూత్ స్థాయిలో క్యాడర్‌కు ఎప్పుడు బాధ్యతలు అప్పగిస్తారు? అన్న ప్రశ్నలు ప్రస్తుతం నెల్లూరు జిల్లా జనసేనలో వినిపిస్తున్నాయి. ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో అధిష్ఠానం త్వరితగతిన సంస్థాగత వ్యవస్థను పూర్తి చేస్తుందా అన్నదే ఆసక్తికరంగా మారింది.



## వాకాడు లో అంగరంగ వైభవంగా శ్రీ వరలక్ష్మివ్రతం పూజలు



ప్రజాభూమి ప్రతినిధి,వాకాడు

వాకాడు మండల కేంద్రంలోని బజారు వీధిలో శుక్రవారం శ్రీశ్రీశ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం నందు అంగరంగ వైభవంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు వరలక్ష్మి వ్రతం, శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి విశేషాలు పూజలు, అభిషేకాలు కుంకుమార్చనలు వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో పుష్పాలంకరణలతో అర్చనలతో వేద పండితులచే నిర్వహించారు పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు గ్రామ పెద్దలు,పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించి అనంతరం అమ్మవారి,అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ కార్యక్రమాలు దాతలు సహకారంతో వాకాడు గ్రామంలోని పెద్దల సహకారంతో ప్రతి ఏటా ఎనిమిది సంవత్సరాల నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు లేబురు మణి, ఆయన కుమారుడు కలిసి దైవకార్యాన్ని నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు శుక్రవారం రాత్రి అత్యంత వైభవంగా విద్యుత్ దీపాలంకరణలతో బాణసంచా వేడుకలతో నాదస్వర వాయిద్యాలతో కోలాటాలతో అమ్మవారి గ్రామం ఉత్సవం,అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

# ఇరుగుళం లో జాడలేని ఇంటింటికి తెలుగుదేశం ..?!

### ఏమైంది అక్కడి నాయకులకు..? - ఇదే ఎవరి నోట విన్న చర్చ..?




ప్రజా భూమి ప్రతినిధి సత్తివేడు.

నియోజకవర్గంలోని కొన్ని కీలక పంచాయతీల్లో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించే దిక్కే లేదు ఇదే అంశంపై ప్రతి ఒక్కరూ చర్చించుకోవడం కొద్దిరోజులుగా ఎక్కువైంది. ప్రధానంగా సత్యవేడు మండలం ఇరుగుళం ఎంపీటీసీ స్థానం గత నాలుగున్నర సంవత్సరాల క్రితం టిడిపి ఏకగ్రీవంగా కైవసం చేసుకుంది. ఈ ఎంపిటిసి స్థానం పరిధిలో వైసిపి మండల అగ్ర నాయకులు కూడా ఉన్నారు రాజీ ఫార్ములా తో అప్పట్లో ఇరుగుళం ను టిడిపి దక్కించుకోగా.. సత్యవేడు - 02 ఎంపిటిసి స్థానాన్ని వైసిపి ఏకగ్రీవం చేసుకున్న విషయం తెలిసిందే ఇదిలా ఉండగా ఇరుగుళంలో పసుపు జెండా నాయకులు రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమం జరపాల్సి ఉంది వివిధ కారణాలతో అక్కడ నాయకులు, కార్యకర్తలు పై కార్యక్రమం జరపడానికి ఆసక్తి కనపరచడం లేదు. వీటివెనుక బలమైన కారణాలు ఉన్నాయని కొందరు చెబుతున్నారు. ఇరుగుళం పాతూరులో ఓ యువకునికి విద్యుత్ శాఖలో తాత్కాలిక ఉద్యోగం కొందరు కల్పించారు ఈ విషయంలో పార్టీ సీనియర్లకు, పార్టీ పటిష్టత కోసం శ్రమించిన వారికి ఒక్క మాటైనా చెప్పకుండా ఇష్టానుసారం వ్యవహరించారని, ఈ కారణంతో నిప్పులు కక్కుతూ పార్టీ కార్యక్రమాలకు వారు దూరంగా ఉంటున్నారని ప్రచారం సాగుతోంది. అధికార పార్టీకి సంబంధం లేని ఓ పెద్ద భూస్వామి సిఫార్సుకు పచ్చజెండా ఊపి పంచాయతీలో నిశ్శబ్ద వాతావరణం తీసుకువచ్చారని కార్యకర్తలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారని పార్టీ వర్గాల సమాచారం. ఇదే పంచాయతీలో ఓ మహిళకు ఇచ్చిన నామినేటెడ్ పోస్ట్ వ్యవహారం కూడా అప్పట్లో తీవ్ర దుమారంకు దారితీసింది. మరికొన్ని చోట్ల కూడా ఇలాంటి పరిస్థితి జరిగిందని అందువల్ల స్థానిక ఎన్నికల్లో తాము కూడా నటనకు అగ్ర తాంబూలం వేస్తామని సీనియర్లు వాపోతున్నారు ఇక్కడ( ఇరుగుళం ) పరిస్థితులు చక్కదిద్దే దిక్కేలేదా అంటూ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు కూడా దగ్గర పడటంతో ఇకనైనా అధిష్టానం పార్టీ బలోపేత కార్యక్రమాలపై చొరవ తీసుకోవాలని కార్యకర్తలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీ వరలక్ష్మీవ్రతం వేడుకలు



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

మహాలక్ష్మి స్వరూపిణి, సకల శుభాలను ప్రసాదించే తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి అనుగ్రహంతో శ్రీ వరలక్ష్మీ వ్రత పూజా కార్యక్రమాన్ని బీసీ సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు జగన్నాథం గారి నివాసంలో నేడు అత్యంత భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు, అర్చనలు, నైవేద్యాలు సమర్పించి భక్తిపూర్వకంగా పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ పద్మావతి అమ్మవారు కరుణామయి, భక్తుల కోరికలను తీర్చే తల్లిగా, సకల ఐశ్వర్యాలను ప్రసాదించే మహాలక్ష్మి స్వరూపంగా భక్తులచే కొలువబడుతున్నారని జగన్నాథం పేర్కొన్నారు. అమ్మవారి కృపాకటాక్షాలు ప్రతి కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి, సిరిసంపదలు కలగాలని ఆకాంక్షించారు. అమ్మవారి దివ్య ఆశీస్సులతో సమాజంలో ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందుతూ, కుటుంబాలు సుఖశాంతులతో వర్ధిల్లాలని కోరుకున్నట్లు జగన్నాథం ఒక ప్రకటనలో తెలిపారు. "శ్రీ పద్మావతి అమ్మవారి ఆశీస్సులతో ప్రతి ఇంటా సిరిసంపదలు, సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ప్రజలందరి జీవితాల్లో ఆనందం, శాంతి, శ్రేయస్సు నిండాలని కోరుకుంటున్నాను" అని జగన్నాథం తెలిపారు.

# వినాయక చవితి, తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు

- తిరుపతి పట్టణంలో వినాయక చవితి నిమజ్జనంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చూడాలి
- శ్రీవారి బ్రహ్మోత్సవాల దృష్ట్యా వినాయక విగ్రహాల నిమజ్జనం సెప్టెంబర్ 20 లోపు పూర్తి కావాలి
- నిమజ్జన ఘాట్ల వద్ద భద్రత, విద్యుత్, వైద్య, పారిశుధ్య సదుపాయాలు కల్పించాలి -జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్
- పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్, ప్రజా భద్రతపై ప్రత్యేక దృష్టి :జిల్లా ఎస్. పి ఎల్. సుబ్బారాయుడు

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.

తిరుపతి వినాయక చవితి, తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఒకే సమయంలో జరుగుతున్న నేపథ్యంలో రెండు ప్రధాన కార్యక్రమాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ప్రణాళిక రూపొందించి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు వినాయక చవితి ఉత్సవాల నిర్వహణ, నిమజ్జనం పై జిల్లా ఎస్పి ఎల్. సుబ్బారాయుడు, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ ఎం.జయకృష్ణ లతో కలసి జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది వినాయక చవితి కార్యక్రమాలు సెప్టెంబర్ 14వ తేదీ నుంచి ప్రారంభం కానుండగా, తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 15 నుంచి 23వ తేదీ వరకు జరగనున్నాయని, అదే సమయంలో ముఖ్యమంత్రి సెప్టెంబర్ 15వ తేదీ సాయంత్రం తిరుపతికి రానున్న నేపథ్యంలో భద్రత, ట్రాఫిక్, ప్రజల రాకపోకలు, పోలీసు బందోబస్తు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రాధాన్యత కలిగిన గరుడ సేవ రోజున భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్నందున, ఆ రోజుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి. వినాయక నిమజ్జన కార్యక్రమాల సమయాలు, శోభాయాత్ర మార్గాలు, భక్తుల రాకపోకలు, ట్రాఫిక్ మళ్లింపులు తదితర అంశాలను ముందుగానే సమన్వయం చేసుకోవాలని సూచించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల దృష్ట్యా తిరుపతి పట్టణంలో వినాయక నిమజ్జనం కార్యక్రమం 1, 3, 7వ రోజులైన సెప్టెంబర్ 14, 16, 20వ తేదీలలో లోపు పూర్తి చేసుకోవాలని ప్రజలను కోరారు. ప్రధాన నిమజ్జన కార్యక్రమం వినాయక సాగర్ వద్ద నిర్వహించడంతో పాటు, దామినేడు, తూకివాకం, చెన్నయ్యగుంట చెరువులను ప్రత్యామ్నాయ నిమజ్జన ప్రాంతాలుగా గుర్తించి అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని



అధికారులను ఆదేశించారు. వినాయక చవితి కార్యక్రమాల నిర్వహణలో మున్సిపల్ శాఖ కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని, కొత్తగా బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్ మొత్తం కార్యక్రమాలపై సమగ్ర పర్యవేక్షణ, సమన్వయం చేపట్టాలని సూచించారు. నిమజ్జన ఘాట్లు, శోభాయాత్ర మార్గాలు, పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, లైటింగ్, ట్రాఫిక్, తాత్కాలిక సదుపాయాలు, ప్రజా భద్రత తదితర అంశాలపై సంబంధిత శాఖలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని తెలిపారు. నిమజ్జన ఘాట్ల వద్ద లైటింగ్, క్రేన్లు, బారికేడింగ్, ఈతగాళ్లు, బోట్లు, లైఫ్ జాకెట్లు తదితర భద్రతా ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా చెరువుల వద్ద ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి ప్రజలు నీటిలోకి వెళ్లకుండా తగిన బారికేడింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్‌డీఆర్ఎఫ్/ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలతో పాటు స్థానిక శిక్షణ పొందిన ఈతగాళ్లను కూడా అందుబాటులో ఉంచాలన్నారు. నిమజ్జన శోభాయాత్ర మార్గాలు, నిమజ్జన ఘాట్ల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా ఎస్పీ డీసీల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ వైర్లు, కేబుళ్లు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రజలకు ప్రమాదం జరగకుండా బారికేడింగ్ ఏర్పాటు చేయడంతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో వినియోగించేందుకు జనరేటర్లను సిద్ధంగా ఉంచాలి. మున్సిపల్, పంచాయతీ అధికారులు నిమజ్జన శోభాయాత్ర మార్గాల్లో రోడ్ల పరిశుభ్రత, చెత్త తొలగింపు, తాగునీటి సరఫరా వంటి ఏర్పాట్లు చేపట్టాలన్నారు. శోభాయాత్రలకు ఆటంకం కలిగించే చెట్ల కొమ్మలను ముందుగానే ట్రిమ్మింగ్ చేయాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో పారిశుధ్య చర్యలను నిరంతరం చేపట్టి అవసరమైన చోట్ల బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు. మహిళల సౌకర్యార్థం నిమజ్జన ఘాట్ల వద్ద తాత్కాలిక చేంజింగ్ రూమ్‌లు ఏర్పాటు చేయాలి. భక్తులు, నిర్వాహకులు, స్వచ్ఛంద కార్యకర్తలకు అవసరమైన కనీస సదుపాయాలను కల్పించాలన్నారు. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో నిమజ్జన ప్రాంతాల వద్ద ఫైర్ ఇంజన్లను సిద్ధంగా ఉంచాలన్నారు. బాణసంచా వినియోగించే ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టి, అగ్ని ప్రమాదాలకు అవకాశం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా ఫైర్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ బృందాలను అప్రమత్తంగా ఉంచాలన్నారు. నిమజ్జన ప్రాంతాలు, ప్రధాన శోభాయాత్ర మార్గాల్లో వైద్య శిబిరాలు, అంబులెన్సులు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. అత్యవసర వైద్య సేవలు అవసరమైనప్పుడు సమీప ఆసుపత్రులకు వేగంగా తరలించేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలన్నారు. శోభాయాత్ర మార్గాల్లో టీటీడీ తరఫున ప్రసాదం, ఆధ్యాత్మిక పుస్తకాల పంపిణీ, లైవ్ టెలికాస్ట్ వంటి ఏర్పాట్లను పరిశీలించాలన్నారు. కార్యక్రమ నిర్వహణలో ఎన్‌సీసీ, సేవా స్వచ్ఛంద కార్యకర్తల సేవలను వినియోగించుకుని జన సమూహాల నియంత్రణ, మార్గనిర్దేశం, అత్యవసర సహాయక చర్యల్లో వారి సహకారం తీసుకోవాలన్నారు. వినాయక నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించే కమిటీ నిర్వాహకులు నిమజ్జనం తేదీ, శోభాయాత్ర వివరాలు, నిర్వాహకుల పూర్తి వివరాలతో సంబంధిత పోలీస్/ఆర్డీఓ కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించి ముందస్తు అనుమతులు పొందాలన్నారు. నిమజ్జన కార్యక్రమాలను ప్రభుత్వ మార్గదర్శకాలు, పోలీసు శాఖ సూచనలకు అనుగుణంగా నిర్వహించాలన్నారు. అలాగే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రాత్రి 10 గంటల తర్వాత మైక్ సిస్టమ్‌ల వినియోగంపై నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలన్నారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, వినాయక నిమజ్జన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో, పూర్తి భద్రతతో జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులు ఆదేశించారు. జిల్లా ఎస్ పి మాట్లాడుతూ వినాయక విగ్రహాల శోభాయాత్రలకు సంబంధించి ముందుగానే రూట్ మ్యాప్ సిద్ధం చేసి, ట్రాఫిక్ మళ్లింపులు, పార్కింగ్, జన సమూహాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. నిమజ్జన విగ్రహాలను తరలించే వాహనాల డ్రైవర్లకు తప్పనిసరిగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించాలని, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. భారీ వాహనాలు మార్గమధ్యంలో నిలిచిపోయిన సందర్భాల్లో వెంటనే తొలగించేందుకు టోయింగ్ వాహనాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వినాయక సాగర్‌తో పాటు ఇతర నిమజ్జన ప్రాంతాల్లో సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేసి, కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పరిస్థితులను పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఆర్డిఓ రామ్మోహన్, అడిషనల్ ఎస్పిలు రవి మనోహరాచారి, శ్రీనివాస రావు, కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, కమిటీ సభ్యులు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విరుపాక్షపురం ఎస్టీ కాలనీలో డోర్ టు డోర్ తెలుగుదేశం కార్యక్రమం

ప్రజా భూమి ప్రతినిధి
తొట్టంబేడు



తొట్టంబేడు మండలం విరుపాక్షపురం ఎస్టీ కాలనీలో డోర్ టు డోర్ తెలుగుదేశం కార్యక్రమం ఘనంగా జరిగింది. మండల అధ్యక్షుడు రావెళ్ల మునిరాజు నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పార్టీ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా గిరిజన కాలనీ వాసులు తమ సమస్యలను మండల అధ్యక్షుడి దృష్టికి తీసుకొచ్చారు.

కాలనీ వాసులు వెల్లడించిన సమస్యలు: గత వైసీపీ ప్రభుత్వంలో ఇంటి పట్టాలు ఇస్తామని చెప్పి తమ ఇంటి స్థలాలను ఆక్రమించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ నివాసాలపై నుండే హైటెన్షన్ విద్యుత్ లైన్లు వెళ్తున్నాయని, దీనివల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. 'తల్లికి వందనం' పథకం ఒకే కుటుంబంలో ఒకరికి వచ్చి మరొకరికి రాలేదని, దీనిపై అధికారులు దృష్టి సారించాలని కోరారు. సమస్యలను విన్న మండల అధ్యక్షుడు మునిరాజు నాయుడు స్పందిస్తూ, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పార్టీ నాయకులు గాలి మురళి నాయుడు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు చింతపట్ల భాస్కర్ నాయుడు,కొన్నలి రమేష్, బీమాల భాస్కర్, చిల్లకూరు మణి, బీజేపీ కృష్ణయ్య, కమల్, సాలి రాజా, గున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## తొట్టంబేడులో డోర్ టు డోర్ తెలుగుదేశం కార్యక్రమం

ప్రజా భూమి ప్రతినిధి
తొట్టంబేడు



మండలంలో ని తొట్టంబేడు గ్రామంలో డోర్ టు డోర్ తెలుగుదేశం కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తంగేళ్లపాలెం సింగిల్ విండో సహకార బ్యాంక్ చైర్మన్ బీమాల భాస్కర్ ముదిరాజ్, తెలుగుదేశం పార్టీ తొట్టంబేడు మండల ప్రధాన కార్యదర్శి చిల్లకూరు బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కరపత్రాలను పంపిణీ చేసి పార్టీని బలోపేతం చేయాలని కోరారు. అనంతరం గ్రామంలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, చందు, సుబ్రహ్మణ్యం, వెంకటయ్య, రంగయ్య, సుబ్బయ్య,కార్యకర్తలు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు భద్రత ఎక్కడ సిపిఐ మించల శివకుమార్ డిమాండ్



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

శ్రీకాళహస్తి విజయనగరం జిల్లా పూసపాటి దేగ మండలం విశాలాంధ్ర విలేఖరి గోవిందపై దాడి చేసిన వారినీ వెంటనే అరెస్ట్ చేయాలని శ్రీకాళహస్తి సిపిఐ నాయకులు మించల శివకుమార్ డిమాండ్ చేశారు రాష్ట్రంలో జర్నలిస్టులకు భద్రతకు ప్రత్యేక చట్టం తెచ్చేందుకు చర్యలు చేపట్టాలని కోరారు విజయనగరం జిల్లా పూసపాటి తేజ మండలం లో ప్రభుత్వ భూమల ఆక్రమణలపై వార్తలు రాశాడని కక్షతో రియల్ ఎస్టేట్ మాఫియా పెట్టలేకపోయి గోవింద పై విచక్షణ రహితంగా దాడి చేయడం అమానుషమని ఇది పత్రిక స్వేచ్ఛపై దాడిగా పేర్కొన్నారు ఇటీవల రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వ ఆన్లైన్ల భూములు సహజ సంపదమైన ఇటుక మట్టి మైనింగ్ వంటివి ఆక్రమణలకు కబ్జాలకు గురవుతున్నాయని కబ్జాదారులు అక్రమాలను వెలుగులోకి తీస్తూ సమాజ హితం కోసం వార్తలు రాయడాన్ని ఏమాత్రం సహించలేక దుండగులు జర్నలిస్టులపై చేయడం దుర్మార్గపు చర్య అని దాడి చేసిన వారిని వెంటనేఅరెస్టు చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని ప్రభుత్వం జర్నలిస్టులకు భద్రత కల్పించే చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు

## శ్రీ సీతా అమ్మవారికి విశేషాలంకరణ

### శ్రావణ శుక్రవారం సందర్భంగా శ్రీ సీతా అమ్మవారికి విశేష అలంకరణ

ప్రజా భూమి ప్రతినిధి గూడూరు,

శ్రీ కోదండ రామస్వామి వారి దేవస్థానంలో శ్రావణ శుక్రవారాలను పురస్కరించుకుని శ్రీ సీతా అమ్మవారికి వివిధ రకాల అలంకరణలు, కుంకుమార్చనలు, పల్లకీ సేవలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శ్రావణ మాసం రెండవ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఉదయం శ్రీ సీతా అమ్మవారికి లిధనలక్ష్మి అలంకరణ, గోపూజ నిర్వహించారు. అనంతరం సామూహిక వరలక్ష్మీ వ్రత కుంకుమార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సామూహిక కుంకుమార్చనలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కుంకుమార్చనలు సమర్పించారు. సాయంత్రం అమ్మవారికి పల్లకీ సేవను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీ వి. గిరికృష్ణ, ఆలయ చైర్మన్ శ్రీ కోట సతీష్ యాదవ్, ధర్మకర్తలు రామయ్య, సుబ్రహ్మణ్యం, గ్రామస్థులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ వరలక్ష్మీ వ్రతత కార్యక్రమానికి ఉభయదాతలుగా శ్రీ కోట సతీష్ యాదవ్, శ్రీమతి వాణి దంపతులు వ్యవహరించారు. ఆలయంలో నిర్వహించిన విశేష పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.







## వరలక్ష్మీ వ్రతం సందర్భంగా తాళ్లపాక పెద్ద గంగమ్మ ఆలయంలో సేవా కార్యక్రమాలు

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

తాళ్లపాక పెద్ద గంగమ్మ ఆలయంలో వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని ఆలయ చైర్మన్ వేదవతి రాయల్ చేతుల మీదుగా వలు సేవా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, అమ్మవారికి విశేష నైవేద్యాలు సమర్పించారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా భక్తులకు, స్థానిక ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. చైర్మన్ వేదవతి రాయల్ స్వయంగా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అన్నదానం మహాదానమని, ఆకలితో ఉన్న వారికి ఆహారం



అందించడం ఎంతో పుణ్యకార్యమని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు నిండాలని ఆకాంక్షించారు. అదేవిధంగా పట్టణ పారిశుధ్యాన్ని, ప్రజా సేవలను నిరంతరం అందిస్తున్న మున్సిపల్ కార్మికులు, ప్రజల రవాణా అవసరాలను తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఆటో కార్మికులను సత్కరించి వారికి వస్త్రదానం చేశారు. సమాజం కోసం నిరంతరం శ్రమిస్తున్న కార్మికుల సేవలను గుర్తించి వారికి గౌరవం అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ వేదవతి రాయల్ మాట్లాడుతూ, దేవాలయాల్లో పూజా కార్యక్రమాలతో పాటు సమాజ సేవకు కూడా ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. వరలక్ష్మీ వ్రతం వంటి పవిత్రమైన రోజున అన్నదానం చేయడంతో పాటు, ప్రజలకు సేవలందిస్తున్న కార్మికులను గౌరవించడం ఎంతో సంతోషకరమైన విషయమని అన్నారు. కార్మికుల కష్టాన్ని, వారి సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించాలని పిలుపునిచ్చారు. తాళ్లపాక పెద్ద గంగమ్మ అమ్మవారి కృపాకటాక్షాలతో ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని, ప్రతి కుటుంబంలో ఆనందం, సిరిసంపదలు వెల్లివిరియాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, నిర్వాహకులు, మున్సిపల్ కార్మికులు, ఆటో కార్మికులు, భక్తులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## శ్రీ తాతయ్యగుంట గంగమ్మ దేవస్థానంలో ఘనంగా వరలక్ష్మీ వ్రతం

ప్రజా భూమి ప్రతినిధి -తిరుపతి

తిరుపతి పట్టణంలోని శ్రీ తాతయ్యగుంట గంగమ్మ దేవస్థానంలో వరలక్ష్మీ వ్రత పండుగను పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఉదయం 5 గంటలకు అమ్మవారికి ప్రత్యేక అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అమ్మవారికి వజ్రకిరీటం, బంగారు ముఖబింబాలను అలంకరించి, సౌభాగ్యానికి ప్రతీకలైన గాజులు, వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.



అనంతరం ఉదయం 9 గంటలకు ఆలయ ప్రాంగణంలో సామూహిక వరలక్ష్మీ వ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించారు. కుటుంబాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు వెల్లివిరియాలని, అమ్మవారి కృపాకటాక్షాలు ప్రతి ఒక్కరిపై ఉండాలని భక్తులు ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ, తిరుపతి మల్టీజోన్--×× ప్రాంతీయ సంయుక్త కమిషనర్ బొంతు మహేశ్వరరెడ్డి, ఆలయ పాలకమండలి సభ్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దర్శనం, పూజా కార్యక్రమాలు సజావుగా జరిగేలా ఆలయ అధికారులు చర్యలు చేపట్టారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలు, సామూహిక వ్రత కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం భక్తి శ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆలయ చైర్మన్ నైనార్ మహేష్ యాదవ్, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ. జయకుమార్ ఒక ప్రకటనలో ఆకాంక్షించారు.

## శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానంలో మాజీ బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దర్శనం

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానాన్ని బాంబే హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నరేష్ హెచ్. పాటిల్ సందర్శించి, శ్రీకాళహస్తీశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు ఆలయ సంప్రదాయాల ప్రకారం న్యాయమూర్తికి స్వాగతం పలికి, స్వామివారి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ విశిష్టత, స్వామివారి క్షేత్ర మహత్యం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రోటోకాల్ ఏఈఓ పి. లోకేష్ బాబు పాల్గొన్నారు.



## అంగరంగ వైభవంగా వరలక్ష్మీ వ్రతం

### శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం

ప్రజా భూమి ప్రతినిధి
శ్రీకాళహస్తి టౌన్



ఈరోజు వరలక్ష్మీ వ్రతం వేద పండితులచే అంగరంగ వైభవంగా దేవస్థానం నందు నిర్వహించడం జరిగింది. అమ్మవారి సేవలో భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితా రెడ్డి దేవస్థాన చైర్మన్ కే సాయి ప్రసాద్ కార్యనిర్వహణాధికారి బికే వెంకటేశులు బిజెపి రాష్ట్ర ఉప అధ్యక్షులు కోలా ఆనంద్ ధర్మకర్తల మండలి సభ్యులు గుర్రప్ప శెట్టి కోలా వైశాలి లక్ష్మమ్మ ప్రత్యేక ఆహ్వానితులు శైలజ పాల్గున్నారు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటరు జాబితా పరిశీలనపై అప్రమత్తంగా ఉండాలి

## జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్య క్షురాలు ఎన్.డి. విజయ జ్యోతి కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు సూచన

ప్రజా భూమి, కడప సిటీ :
వైఎస్సార్ కడప జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గ నియోజకవర్గాల కాంగ్రెస్ పా ర్టీ సమన్వయకర్తలు, కాంగ్రె స్ నాయకులు,బూత్ స్థా యి కార్యకర్తలు ఓటరు జా బితా ప్రత్యేక సవరణ పక్రి యపై పూర్తి స్థాయిలో అప్ర మత్తంగా ఉండాలని ఆమె సూచించారు.ప్రత్యేక నవర ణ ప్రక్రియలో భాగంగా దా వాలు,అభ్యంతరాలు స్వీక రించే గడువు 31-07-2026 నుండి 30-08-2026 వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ కాలంలో ఓటరు జాబిత లో తమ పేరు ఉందో లేదో ప్రతి ఒక్కరూ పరిశీలించుకో వడంతో పాటు,అర్హత ఉన్న ప్పటికీ ముసాయిదా ఓటరు జాబితాలో పేరు లేని వారు తమ పేర్లను నమోదు చేసు కునేలా కాంగ్రెస్ పార్టీ నాయ కులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

**ఆగస్టు22, 23, 29, 30 తేదీల్లో ప్రత్యేక ప్రచార దినాలు.**

వార్షిక ప్రత్యేక సవరణ పక్రి యలో భాగంగాఆగస్టు 22, 23,29,30 తేదీలను ప్రత్యేక ప్రచార దినాలుగా నిర్ణయించినట్లు శ్రీమతి విజయ జ్యోతి తెలిపారు. ఈ ప్రత్యేక ప్రచార దినాల్లో ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద సంబంధిత బూత్ స్థాయి అధికారిలిలితో పాటు కాంగ్రెస్ పార్టీ నియమించిన బూత్ స్థాయి ఏజెంట్ తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ముసాయిదా ఓటరు జాబితాలు ఏఎస్‌డీడీ జాబితాలు అందుబాటులో ఉంచి, వాటిని పూర్తిగా పరిశీలించాలని సూచించారు. ఓటర్ల పేర్లు, వివరాలు సక్రమంగా ఉన్నాయా లేదా, అర్హులైన ఓటర్ల పేర్లు ముసాయిదా జాబితాలో చేరాయా లేదా అనే విషయాలను పరిశీలించాలి. అర్హులైన ప్రజలు తమ పేర్ల



నమోదు, మార్పులు, చేర్పులు లేదా అభ్యంతరాలకు సంబంధించిన దరఖాస్తులు సమర్పించేలా వారికి నరైన మార్గదర్శకత్వం అందించి, వారి సందేహాలను నివృత్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి ఏజెంట్లకు సూచించారు. యువ ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి ఈ ప్రత్యేక ప్రచార దినాలను 18--19 సంవత్సరాల వయస్సు గల యువ ఓటర్లను పెద్ద సంఖ్యలో ఓటరుగా నవెూదు చేయడానికి సమర్థవంతంగా వినియోగించుకోవాలని విజయ జ్యోతి పిలుపునిచ్చారు. అర్హత ఉన్నప్పటికీ ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు నమోదు కాని ప్రతి ఒక్కరినీ గుర్తించి, వారి పేర్లు ఓటరు జాబితాలో చేరేలా అవసరమైన సహకారం అందించాలని తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజక వర్గసమ న్వయకర్త తమపరిధిలోని బూత్థాయి ఏజెంట్లతో సమన్వయం చేసుకుని, ప్రత్యేక ప్రచార దినాల్లో పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటరు జాబితాలు, ఏఎస్‌డీడీ జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించాలని శ్రీమతి ఎన్.డి. విజయ జ్యోతి స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా, ఒక్క అర్హుడి పేరు కూడా నమోదు కాకుండా మిగిలిపోకుండా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బాధ్యతతో పనిచే యాలని ఆమె కోరారు.

# రాయలసీమ అభివృద్ధి నిరోధకుడు చంద్రబాబు..

## -వెన్నుపోటు పార్టీ కూటమి ప్రభుత్వాన్ని నిలదీసిన సాకే శైలజానాథ్

ప్రజాభూమి ప్రతినిధి,తాడేపల్లి:
చంద్రబాబు నాయుడు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా రాయలసీమ ప్రాంతానికి తీవ్ర అన్యాయమే జరుగుతుందని, ఆయన పక్కా రాయలసీమ అభివృద్ధి నిరోధకుడని వైఎస్సార్సీపీ నేత మాజీ మంత్రి సాకే శైలజనాథ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తా రు. తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన గ్రేటర్ రాయలసీమ టాస్క్ ఫోర్స్ కమిటీ, పార్టీ రైతు, యువజన, విద్యార్థి, సోషల్ మీడియా విభాగాల నేతలతో కీలక సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీశైలం జలాశ యం నిండుకుండలా ఉన్నప్పటికీ రాయలసీమ ప్రాజెక్టులకు నీళ్లు విడుదల చేయకుండా కూటమి ప్రభుత్వం రైతుల పొట్ట కొడుతోందని మండిప డ్డారు. పాలకుల మొద్దునిద్రను విదిదీసేందుకు, రాయలసీమ రైతుల హక్కులను కాపాడేందుకు ఈ నెల 24న వైఎస్ జగన్ ఆదేశాల మేరకు సీమ ప్రాంత రైతులు, మేధావులు, అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ వద్ద ప్రజా పోరాటానికి దిగుతున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ ఆయన ఏమన్నారంటే...చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్నప్పుడల్లా రాయలసీమ ప్రాంతం కరువుతో అల్లాడాల్సిందే. ఆయన పరిపాలన సీమకు అన్యాయం చేయడానికే అన్నట్లుగా సాగుతోంది. రాష్ట్రంలో వర్షాలు లేకపోయినా ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద వచ్చి శ్రీశైలం రిజర్వాయర్‌లో దాదాపు 185 టీఎంసీల నీరు చేరింది. డ్యామ్ 90 శాతం నిండి పూర్తి స్థాయికి చేరువలో ఉంది. కానీ దానిపై ఆధారపడిన రాయలసీమ రిజర్వాయర్లన్నీ సగానికి పైగా ఎండిపోయి ఉన్నాయి. రైతులకు మేలు చేయాల్సింది పోయి, పంటలు వేసుకోవద్దని బాబు ఉచిత నలహాలు ఇస్తున్నారు. రైతులను వ్యవసాయానికి, భూములకు దూరం చేయడమే ఆయన లక్ష్యంగా కనిపిస్తోంది. పోతిరెడ్డిపాడు ద్వారా పూర్తిస్థాయి నీటిని ఎందుకు విడుదల చేయడం లేదు? శ్రీశైలం నిండితే దిగువన ఉన్న వెలుగోడు, బ్రహ్మం సాగర్, సోమశిల, కండలేరు, గోరకల్లు, ఔకు, గండికోట, పైడిపాలెం, వామికొండ, చిత్రావతి ప్రాజెక్టులు ఎందుకు నిండటం లేదు? 11 టీఎంసీల సామర్థ్యం ఉన్న గోరకల్లులో కేవలం 4 నుంచి 5 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. రాయలసీమ ప్రాజెక్టులకు నీళు ఇవ్వకుండా ఆపుతున్నది ఎవరు? సీమ ప్రాజెక్టులను ఎండగడతామని పక్క రాష్ట్ర ముఖ్యమంత్రికి ఏమైనా మాట ఇచ్చారా? పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యం 40,400 క్యూసెక్కులు అయితే.. కేవలం 8 వేల క్యూసెక్కులు మాత్రమే వదులుతున్నారు. 850 అడుగులు దాటిన తర్వాత కనీసం 30 నుంచి 40 వేల క్యూసెక్కుల నీటిని వదిలే అవకాశం ఉన్నా ఎందుకు తాత్సారం చేస్తున్నారు?.

గతంలో వైఎస్. జగన్ రాయలసీమ ప్రాంతానికి ఒక రక్షణ కవచంలా 'రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్' ప్రాజెక్టును తలపెట్టారు. 90 శాతం పనులు పూర్తయిన ఆ ప్రాజెక్టును చంద్రబాబు నాయుడు.. తెలంగాణా సీఎం రేవంత్ రెడ్డితో కుమ్మక్కై నిలిపివేశారు. ఆ ప్రాజెక్టు పూర్తయి ఉంటే 800 అడుగుల నుంచే రోజుకు 80 వేల క్యూసెక్కుల వరద నీటిని ఒడిసిపట్టి సీమ ప్రాజెక్టులన్నింటినీ క్షణాల్లో నింపేవాళ్లం. అలాంటి మహోన్నత ప్రాజెక్టును గతంలో 'బురద నీళ్లు' అంటూ చంద్రబాబు హేళన చేశారు. అలాగే హంద్రీ-నీవా ప్రవాహ సామర్థ్యాన్ని 6,300 క్యూసెక్కులకు పెంచుతూ వైయస్.జగన్ ఇచ్చిన టెండర్లను రద్దు చేసి, దాన్ని 3,800 క్యూసెక్కులకు కుదించి రాయలసీమ రైతుల నోట్లో మట్టి కొట్టారు.

కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వంలో భాగస్వామిగా ఉంటూ రోజుకోసారి జపం చేసే చంద్రబాబు.. కర్ణాటకలో ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచుతుంటే ఎందుకు నోరు మెదపడం లేదు? అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణం వల్ల తుంగభద్రకు 25 టీఎంసీల నీరు ఆగిపోయి ఏపీ ప్రయోజనాలు దెబ్బతింటుంటే ఎందుకు కేంద్రాన్ని నిలదీయడం లేదు? పులిచింతల పరివాహక ప్రాంత రైతుల గొంతు కోస్తుంటే చూస్తూ ఊరుకుంటారా? చంద్రబాబుకు నీళ్ల మీద, రైతుల మీద ప్రేమ లేదు. కేవలం రాజకీయ స్వలాభం కోసం రాష్ట్రాన్ని తాకట్టు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజల్లో ఎండగట్టడానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సిద్ధమైందని శైలజనాథ్ స్పష్టం చేశారు. అందులో భాగంగానే ఈ నెల 24వ తేదీ సోమవారం నాడు గ్రేటర్ రాయలసీమ జిల్లాల పార్టీ ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు, రైతు విభాగాలతో కలిసి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌ను సందర్శిస్తున్నామన్నారు. పోతిరెడ్డిపాడును పూర్తి సామర్థ్యంతో, హంద్రీ-నీవాను పూర్తి సామర్థ్యంతో నడిపించి రాయలసీమ ప్రాజెక్టులను నింపాలని.. 6,300 క్యూసెక్కుల హంద్రీ-నీవా సామర్థ్యాన్ని తగ్గించి 3,800 క్యూసెక్కులకు పరిమితం చేయడం ఎందుకని నిలదీశారు. దీనిపై రైతులు, మేధావులు, ప్రజా సంఘాలతో కలిసి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని... తక్షణమే శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడు, మాల్యాల, ముచ్చుమర్రి ద్వారా పూర్తి సామర్థ్యంతో 40 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసి రాయలసీమ రిజర్వాయర్లన్నింటినీ నింపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాయలసీమ వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని శైలజానాథ్ హెచ్చరించారు.

# ఓటరు జాబితాలో మీ పేరుందా...-ఇప్పుడే పరిశీలించుకోండి

- **22, 23, 29, 30న పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ప్రచారం**
- **అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తాం**
- **తహసీల్దార్ వెంకటేశు**

ప్రజాభూమి, హిందూపురం టౌన్
ఎస్ఐఆర్--2026లో భాగంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియను మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు ఈ నెల 22, 23, 29, 30 తేదీల్లో ప్రత్యేక ప్రచార రోజులను నిర్వహిస్తున్నట్లు హిందూపురం సహాయ ఎన్నికల అధికారి, తహసీల్దార్ వెంకటేష్ తెలిపారు. శుక్రవారం ఆయన ప్రత్యేక ప్రచార రోజులకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ప్రత్యేక ప్రచార రోజుల్లో పోలింగ్ కేంద్రాల్లో ప్రదర్శించిన ముసాయిదా ఓటరు జాబితాను ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాలని వెంకటేష్ సూచించారు. ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో, పేరు, చిరునామా, ఇతర వివరాలు నక్రమంగా ఉన్నాయెూ లేదో నిర్ధారించుకోవాలన్నారు. జాబితాలో పేరు లేని అర్హులు కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఓటరు జాబితాలో పేరు చేర్పు కోసం ఫారం--6, అనర్హుల లేదా మరణించిన వారి పేర్ల తొలగింపునకు ఫారం--7, పేరు, చిరునామా తదితర వివరాల్లో మార్పులు, సవరణల కోసం ఫారం--8 ద్వారా క్లెయిమ్‌లు, అభ్యంతరాలు సమర్పించవచ్చని తెలిపారు. ఒకే వ్యక్తి పేరు ఒకటి కంటే ఎక్కువసార్లు నమోదై ఉండటం, ఇతర కారణాలతో జాబితాలో అనుమానాస్పదంగా ఉన్న వివరాలను కూడా పరిశీలించుకునే అవకాశం



ఉందన్నారు. ప్రత్యేకంగా 18--19 సంవత్సరాల వయసు కలిగిన అర్హులైన యువత ఓటరుగా నవెూదు కావడంపై దృష్టి సారిస్తున్నామని తహసీల్దార్ వెంకటేష్ తెలిపారు. అర్హత ఉన్నప్పటికీ ఇప్పటివరకు ఓటరుగా నమోదు కాని యువత ప్రత్యేక ప్రచార రోజుల్లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. బీఎల్ఓలకు అందిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం పరిశీలిస్తామని తెలిపారు. అవసరమైన చోట భౌతిక పరిశీలన, స్థానిక విచారణ నిర్వహించిన అనంతరం అర్హతను నిర్ధారిస్తామన్నారు. ఎన్నికల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు తగిన చర్యలు తీసుకుంటారని చెప్పారు. హిందూపురం 157 అసెంబ్లీ నియోజ కవర్గ పరిధిలో ఈ నెల 22, 23, 29, 30 తేదీల్లో జరిగే ప్రత్యేక ప్రచార రోజులను ప్రజలు సద్విని యోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు. ప్రతి ఓటరూ తమ పేరు, వివరాలను పరిశీలించుకో వడంతో పాటు కుటుంబ సభ్యులు, ముఖ్యంగా 18 ఏళ్లు నిండిన యువత పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని సూచించారు. ఓటరు జాబితాను తప్పుల్లేకుండా, పారదర్శకంగా రూపొందించేందుకు ప్రజలు అధికారులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# విభజన సమస్యలపై సీఎం చంద్రబాబు ప్రస్తావించడం హర్షణీయం

## - ఏపీసీసీ మీడియా ఛైర్మన్ డా. ఎన్. తులసి రెడ్డి

ప్రజాభూమి, పులివెందుల
రాష్ట్ర విభజన జరిగి 12 ఏళ్లు దాటినా ఇప్పటికీ పరిష్కారం కాని విభజన సమస్యలను ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రస్తావించడం హర్షణీయమని ఏపీసీసీ మీడియా ఛైర్మన్ డా. ఎన్. తులసి రెడ్డి అన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అధ్యక్షతన తమిళనాడులోని మహాబలిపురంలో జరిగిన దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ మండలి సమావేశంలో సీఎం చంద్రబాబు విభజన సమస్యలను ప్రస్తావించడాన్ని తులసి రెడ్డి అభినందించారు. రాష్ట్ర విభజన సందర్భంగా



అప్పటి కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం నవ్యాంధ్రప్రదేశ్‌కు పలు హామీలు, వరాలు ప్రకటించిందని తులసి రెడ్డి తెలిపారు. ప్రత్యేక హోదా, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీలు, కడప ఉక్కు పరిశ్రమ, కొత్త ఓడరేవు, విశాఖపట్నం--విజయవాడ మెట్రో రైలు, పారిశ్రామిక కారిడార్ తదితర అంశాలను అమలు చేస్తామని కేంద్రం ప్రకటించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చి ఉంటే రాష్ట్ర విభజన చట్టంలోని హామీలతో పాటు పెండింగ్‌లో ఉన్న సమస్యలు ఇప్పటికే పరిష్కారమై ఉండేవని తులసి రెడ్డి అభిప్రాయపడ్డారు. నవ్యాంధ్రప్రదేశ్ స్వర్ణాంధ్రప్రదేశ్‌గా అభివృద్ధి చెందేందుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన అవసరం ఉ ందన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఏపీకి సంబంధించిన విభజన సమస్యలను ఇకనైనా ప్రాధాన్యతతో పరిగణించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని డా. తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# ఏపీపీఎస్సీపై బురదజల్లే ప్రయత్నాలు ఇప్పుడు ఎందుకు..?

**జగన్ హయాంలో ఒక్క ఆరోపణైనా వచ్చిందా..? -:జుపూడి ప్రభాకర్ ధ్వజం**

ప్రజాభూమి ప్రతినిధి,తాడేపల్లి:
డిఎస్సీతో పాటుగా ఏపీపీఎస్సీపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూటమి ప్రభుత్వానికి విసిరిన సవాల్‌కు సమాధానం చెప్పే ధైర్యం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఉందా అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకర్ సవాల్ విసిరారు. ఏపీపీఎస్సీపై ప్రభుత్వం చేసిన ఆరోపణలపై సీబీఐ విచారణకు సిద్ధమని వైఎస్ జగన్మహన్ రెడ్డి స్పష్టంగా సవాల్ విసిరారని ఆయన గుర్తు చేసారు. ఆ సవాల్‌ను స్వీకరించి విచారణకు ఆదేశించే ధైర్యం ప్రభుత్వానికి ఉందా అని నిలదీసారు. అలాగే డీఎస్సీ జరిగన అక్రమాలు, అవకతకలపై నిజానిజాలు నిగ్గు తేల్చేందుకు సీబీఐ సంస్థతో విచారణ జరిపించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేందుకు సీబీఐ విచారణ జరిపించే దమ్ము, ధైర్యం చంద్రబాబు, లోకేశ్ కు ఉందా అని ప్రశ్నించారు. తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో జరిగన మీడియా సమావేశంలో జుపూడి ప్రభాకర్ మాట్లాడుతూ, సంఖ్యాబలం ఉందని అధికారంలో ఉన్నవారు శాశ్వతంగా అధికారంలో ఉంటారని అనుకోవద్దు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలు. నిరుద్యోగుల ఆవేదనకు, విద్యార్థుల ప్రశ్నలకు, తల్లిదండ్రుల ఆందోళనలకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిందే. డీఎస్సీపై విచారణ జరిగే వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుంది" అని జూపూడి ప్రభాకర్ స్పష్టం చేశారు. డీఎస్సీ పరీక్షలో జరిగిన అక్రమాలు, అవకతవకలపై ప్రభుత్వం వెంటనే సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. నిరుద్యోగులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆందోళనలకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందని స్పష్టం చేసారు. ఈ ప్రెస్ మీట్ లో ఆయన ఇంకా ఏం మాట్లాడరంటే... క్రీడా రంగంలో ప్రతిభ కనబరిచిన వారికి ఇచ్చే ప్రత్యేక అవకాశాలను, పాఠశాలల్లో క్రీడలను బోధించాల్సిన ఉపాధ్యా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను పెంచేందుకు గత ప్రభుత్వం తీసుకున్న చర్యలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది. విద్యా వ్యవస్థను రాజకీయ కక్షలకు వేదికగా మార్చడం సరికాదు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటే వారికే మంచిద"ని జూపూడి అన్నారు.

# 629 ఏఈఈ పోస్టులకు 1.05 లక్షల అభ్యర్థులు

## -ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:
రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఎలక్ట్రికల్) పోస్టుల భర్తీకి ఈ నెల 23 నుంచి 27 వరకు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో పరీక్షలు నిర్వహించనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి తెలిపారు. పరీక్షలను పూర్తి పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. పరీక్షలు రోజుకు రెండు షిఫ్టుల్లో జరుగుతాయి. మొదటి షిఫ్ట్ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో షిఫ్ట్ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహిస్తారు. అభ్యర్థులు ఒరిజినల్ హాల్‌టికెట్‌తో పాటు ఆధార్, పాన్, ఓటర్ ఐడీ, పాస్‌పోర్ట్ లేదా డ్రైవింగ్ లైసెన్స్ వంటి ఫొటో గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో ఫేస్ వెరిఫికేషన్, మెటల్ డిటెక్టర్‌తో తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచీలు, కాలిక్యులేటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, పుస్తకాలు, కాగితాలు అనుమతించబోమన్నారు. ఉద్యోగం ఇప్పిస్తామంటూ దళారులు చేసే ప్రచారాన్ని నమ్మొద్దని, అధికారిక ప్రకటనలను మాత్రమే విశ్వసించాలని సీఎండీ సూచించారు.

# భక్తిశ్రద్ధలతో శ్రీ వరమహాలక్ష్మి పూజలు

ప్రజాభూమి పోరుమామిళ్ల :
శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి దేవస్థానం నందు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు విశ్వనాధుల ప్రసాదు ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహిళ మండలి సంఘం అధ్యక్షురాలు పలుకూరి రాధా నిర్వహ ణలో శ్రీ వరలక్ష్మీ దేవి వ్రతం అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగినది మరియు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి అమ్మవారి మూల విరాట్ కు గాజులతో అలంకారం పురోహితులు కౌశిక్ శర్మ గారు చేయడం జరిగినది రాత్రి 7 గంటలకు అమ్మవారి గుడిఉత్సవం కలదు శ్రీ వరలక్ష్మీ వ్రతం లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజ నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు ఆర్య సంఘం వారు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేయడం జరిగినది.



# ఘనంగా మాజీ చైర్మన్ కృష్ణతేజ జన్మదిన వేడుకలు

ప్రజాభూమి, వేంపల్లె
గండి క్షేత్రం శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ కావలి కృష్ణతేజ జన్మదిన వేడుకలు ఇడుపులపాయులోని ఆయున వ్యవసాయ క్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణతేజ కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి సన్నిహితులు, మిత్రులు హాజరై కృష్ణతేజకు పుష్పగుచ్ఛాలు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. జన్మదిన వేడుకల సందర్భంగా వ్యవసాయ క్షేత్రంలో సందడి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో పోతిరెడ్డి శ్రావణ్ కుమార్, శివ, కమాల్, అజీమ్, పీరా, దర్బార్, చాను, పుల్లయ్య, బాబు, గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

ప్రజాభూమి ప్రతినిధి:-అనకాపల్లి:
స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ఈనెల 22న అనకాపల్లి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఈ ఏర్పాట్లను విశాఖపట్నం రేంజ్ ఐజీ గోపినాథ్ జట్టి, ఐపీఎస్, అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఐపీఎస్‌లు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కె.కోటపాడు మండలం ఎ.కోడూరు గ్రామంలో పర్యటించిన ఉన్నతాధికారులు ముఖ్యమంత్రి పాల్గొనే కార్యక్రమ ప్రాంగణం, హెలిప్యాడ్, వీఐపీ రూట్, బందోబస్తు ఏర్పాట్లను నిశితంగా సమీక్షించారు. భద్రతా విధుల్లో ఎలాంటి అలసత్వానికి తావులేకుండా అధికారులు, సిబ్బంది అత్యంత అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఐజీ గోపినాథ్ జట్టి సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా పూర్తయ్యేలా విధుల్లో ఉన్న సిబ్బంది పాటించాల్సిన నిబంధనలు, భద్రతా చర్యలపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. వివిధ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎలాంటి భద్రతా లోటుపాట్లు లేకుండా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీసు ఉన్నతాధికారులు, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు

**ఎ.కోడూరు వద్ద ట్రాఫిక్ మళ్లింపులు.. ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు**

ప్రజా భూమి ప్రతినిధి:-అనకాపల్లి: కె.కోటపాడు మండలం ఎ.కోడూరు గ్రామంలో ఈ నెల 22న నిర్వహించనున్న 'స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరుకానున్న నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఐపీఎస్ తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి ఎ.కోడూరు మీదుగా వాహనాల రాకపోకలను అనుమతిం చబోమని పేర్కొన్నారు. పినగాడి నుంచి దేవరాపల్లి వెళ్లే భారీ వాహనాలు కొత్తవలస మీదుగా వెళ్లాలని సూచించారు. దేవరాపల్లి నుంచి విశాఖపట్నం వెళ్లే వాహనాలు కూడా కొత్తవలస మార్గాన్ని వినియోగించాలి. దేవరాపల్లి నుంచి అనకాపల్లి, చోడవరం వెళ్లే వాహనాలు లంకవానిపాలెం, పిండ్రంగి, దాలివలస, రామచంద్రాపురం, కె.కోటపాడు మీదుగా వెళ్లాలని సూచించారు. వెంకన్నపాలెం నుంచి దేవరాపల్లి వెళ్లే వాహనాలు చౌడువాడ, పాచిలవానిపాలెం మార్గంలో వెళ్లాల్సి ఉంటుంది. కార్యక్రమానికి వచ్చే ప్రజలు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధుల వాహనాల కోసం పలు ప్రాంతాల్లో ప్రత్యేక పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. వి.మాడుగుల, చౌడువాడ, గొండుపాలెం తదితర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను సూరెడ్డిపాలెం లేఅవుట్‌లో పార్కింగ్ చేయాలి. చీడికాడ, దేవరాపల్లి మండలాల నుంచి వచ్చే వారు ఎ.కోడూరులోని రంగరాయ చెరువు వద్ద, లంకవానిపాలెం తదితర గ్రామాల ప్రజలు గంగరాజు చెరువు వద్ద వాహనాలు నిలపాలి. దాలివలస, సింగన్నదొరపాలెం వాసులకు సూరెడ్డిపాలెం సా మిల్ వద్ద, మర్రివలస, శృంగవరం, పిండ్రంగి తదితర గ్రామాల నుంచి వచ్చే వారికి ఎ.కోడూరు ప్రభుత్వ హాస్టల్ ఎదురుగా ఉన్న గాయత్రి స్కూల్ ఆవరణలో పార్కింగ్ సౌకర్యం కల్పించారు. కోటపాడు జంక్షన్ నుంచి వారాడ గ్రామం వరకు రహదారిపై ఎక్కడా వాహనాలను నిలపడం పూర్తిగా నిషేధం అని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజలు ట్రాఫిక్ ఆంక్షలను పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.





## కమనీయంగా దేవి అలంకారాలు

మచిలీపట్నం ప్రజాభూమి ప్రతినిధి

శ్రావణమాసం రెండవ శుక్రవారం సందర్భంగా నగరంలోని పలు ఆలయాల్లోని దేవత మూర్తులను కన్నుల పండుగగా అలంకరించారు. స్థానిక అజాద్ రోడ్ లోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవార్లకు వివిధ రంగుల పుష్పాలు, ఆభరణాలతో చేసిన అలంకారాలు భక్తులను మంత్రముగ్ధులుగా చేశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సామూహిక కుంకుమార్చనలో సువాసినులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పూజా ద్రవ్యాలను దేవస్థానం పాలకమండలి సమకూర్చింది. ఆలయ పాలకవర్గ చైర్మన్ మామిడి మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి మోటమర్రి వెంకట బాబా ప్రసాద్, ఉపాధ్యక్షుడు సామ వెంకట లక్ష్మీ కాంతారావు, కోశాధికారి ఉడత్తు శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి బైసాని హయగ్రీవ రావు అన్ని ఏర్పాట్లు చేశారు.

## భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

జగ్గయ్యపేట, ప్రజా భూమి



శ్రావణమాసం రెండవ శుక్రవారం సందర్భంగా ప్రతి ఇంట వరలక్ష్మి వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మి శుక్రవారంగా పరిగణిస్తారు. సిరులను కటాక్షించే వరలక్ష్మి అమ్మవారి అనుగ్రహం కోసం ముత్తైదవలు వె కువ జామినే లేచి ఇళ్లను శుద్ధి చేసుకుని అమ్మవారి పూజా మంది శుభ్రం చేసి, నయన మనోహరంగా పూజా మందిరాన్ని అలంకరించి , అమ్మవారిని పీఠంపై ప్రతిష్టించి భక్తిశ్రద్ధలతో అమ్మవారి వ్రతాన్ని ఆచరిస్తారు. పూజా మందిరంలో పీఠంపై కొలువైన అమ్మవారినీ వివిధ రకాల పూలతో పూజించి, పళ్ళు పాయసాలు పూర్ణాలతో అమ్మవారికి నైవేద్యాలను సమర్పిస్తారు .కొత్తగా పెళ్లయిన యువతులు శ్రావణమాసం వరలక్ష్మి శుక్రవారం రోజు అమ్మవారికి విశేష పూజలను నిర్వహిస్తారు. బంగారు వరలక్ష్మి రూపు కొత్త కోడళ్ళకు అత్తింటివారు అందిస్తారు. వరలక్ష్మి వ్రతాలను నిర్వహించిన వారుముత్తయిదువులకు వాయనాలను సమర్పిస్తారు. సాయంత్రం అమ్మవారిని పూజించి , ముత్తైదువులకు పేరంటాలని నిర్వహించి. వారికి శక్తి కొలదిపువ్వు పండు తాంబూలం సమర్పించి వారి ఆశీర్వచనాలను కొత్తకోడళ్ళు, ముత్తైదువులు అందుకుంటారు. శ్రావణమాసం వరలక్ష్మి శుక్రవారం సందర్భంగా అమ్మవారి పూజలతో ముత్తైదువులతో ప్రతి ఇల్లు శ్రావణ శుక్రవారం శోభ తో కళకళలాడుతున్నాయి .

## పెదపట్నం మంచినీటి చెరువులో ఉప్పునీరు.. ప్రజలకు తాగునీటి తిప్పలు

**మంచినీటి చెరువుకు పసుపు రంగు పులిమి.. గ్రామస్తులపై కక్షసాధింపా?**

**మంత్రి కొల్లు రవీంద్రపై వైఎస్సార్‌సీపీ మచిలీపట్నం ఇంచార్జ్ పేర్ని కిట్టు తీవ్రధ్వజం**

మచిలీపట్నం రూరల్ ప్రజాభూమి ప్రతినిధి



శాసనసభ ఎన్నికల్లో గెలిపించి మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాయకులు, తమను గెలిపించిన ప్రజల తాగునీటి అవసరాలను కూడా తీర్చకపోవడం పట్ల పెదపట్నం గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "సాగునీరు రైతులకు ఇవ్వమంటే ఇవ్వలేము గానీ, కనీసం తాగేందుకు మంచినీరు ఇస్తామని చెప్పి, తీరా చూస్తే ఆ తాగునీరు కూడా లేకుండా చేస్తున్నారు" అని పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) మండిపడ్డారు. పెదపట్నం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పెదపట్నం గ్రామపంచాయతీలో నెలకొన్న తీవ్ర తాగునీటి సమస్యపై అధికార కూటమి ప్రభుత్వం, స్థానిక మంత్రి కొల్లు రవీంద్ర వైఖరిని ఎండగట్టారు.పిడికెడు నీటికి తిప్పలు.. పశువులకూ తప్పని అగ్నిపరీక్ష!మచిలీపట్నం నియోజకవర్గ పరిధిలోని పెదపట్నం పంచాయతీలో గల మూడు గ్రామాలు తాగునీటి కోసం స్థానిక మంచినీటి చెరువుపైనే ఆధారపడి ఉన్నాయి. గత 20 రోజులుగా ఈ మంచినీటి చెరువులోకి ఉప్పునీటిని నింపడం వల్ల మంచినీరు కలుషితమై ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.ప్రజల ఆవేదన: తాగేందుకు బొట్టు మంచినీరు లేక గ్రామస్తులు, మూగజీవాలు అలమటించిపోతున్నాయి.నాయకుల విమర్శ: "సారన్ వేసుకుంటూ తిరిగేందుకు కారణమైన పెదపట్నం ప్రజలకు తాగునీరు ఇవ్వకపోవడం శోచనీయం. మంత్రి స్వచ్ఛమైన నీరు తాగుతూ.. తనను గెలిపించిన ప్రజలను ఉప్పునీరు తాగమని చెప్పడం ఎంతవరకు న్యాయం?" అని పేర్ని కిట్టు ప్రశ్నించారు.పటిక బెల్లం వేస్తే ఉప్పునీరు మంచినీరవుతుందా?ప్రతిపక్ష నాయకుడు పేర్ని కిట్టు గ్రామానికి వస్తున్నారనే ముందస్తు సమాచారంతో టీడీపీ నాయకులు హడావుడి మొదలుపెట్టారని వైఎస్సార్‌సీపీ పెదపట్నం పంచాయతీ అధ్యక్షుడు మందపాటి రాజారావు ఎద్దేవా చేశారు.

హడావుడి చర్యలు: అప్పటివరకు మౌనంగా ఉన్న నాయకులు కంగారుగా నాలుగు ట్యాంకర్ల నీళ్లు పోసి చేతులు దులుపుకునే ప్రయత్నం చేశారని విమర్శించారు.తాత్కాలిక పరిష్కారాలు వద్దు: చెరువులో ఉన్న పసుపు రంగు ఉప్పునీళ్లను పటిక బెల్లం వేసినంత మాత్రాన మంచినీరుగా మారవని, వెంటనే చెరువులోని ఉప్పునీటిని బయటకు తోడి, కొత్త మంచినీటిని నింపాలని ఆయన డిమాండ్ చేశారు.కక్ష సాధింపులు విడనాడి.. చట్టపరమైన చర్యలు తీసుకోండివైఎస్సార్‌సీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు గడిదేసి బాలజేష్, నార్త్ మండల రైతు అధ్యక్షుడు గడిదేశి రాజు మాట్లాడుతూ.. కూటమి పార్టీకి 95 ఓట్ల మెజార్టీ ఇచ్చారనే కక్షతోనే గ్రామ ప్రజలను సాగు, తాగునీటి కష్టాలకు గురిచేస్తున్నారా అని ప్రశ్నించారు.పేర్ని నాని మార్గం: గతంలో మాజీ మంత్రి పేర్ని నాని తలకటూరు సి.డబ్ల్యూ స్కీమ్ ద్వారా మంచినీళ్లు తీసుకురాకపోతే గ్రామం మరింత దారుణమైన పరిస్థితిలోకి వెళ్లేదని గుర్తుచేశారు.నిందితులపై చర్యలు: మంచినీటి చెరువులోకి ఉప్పునీరు వదిలిన నాగ పున్నయ్యపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.కేసులు వద్దూ - నీళ్లివ్వండి: ప్రజా సమస్యలను లేవనెత్తిన వారిపై కక్షపూరితంగా కేసులు పెట్టే ఆలోచనలు విడనాడి, తక్షణమే పెదపట్నం పంచాయతీ తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో రూరల్ పార్టీ అధ్యక్షులు మట్ట నాంచారయ్య, పెదపట్నం వైఎస్ఆర్ పార్టీ అధ్యక్షులు మందపాటి రాజారావు,గడిదేసి డేవిడ్ రాజ్, గడిదేసి బాలయేసు మండల పార్టీ ఉపాధ్యక్షులు భట్రాజు వాకల రావు,ఎర్రం చెట్టు యుగంధర్ రావు,రూపారావు,పాతపాటి పండు ఇవాని శ్రీనివాసరావు,బోయిన పూర్ణ,ఎలిశెట్టి వెంకటేశ్వరరావు,వెన్న నాంచారయా తదితరులు పాల్గొన్నారు

## లంకపల్లిలో రూ.36లక్షలతో నిర్మించిన గ్రామీణ ఆరోగ్య కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే

### మల్లంపల్లిలో రూ.2కోట్ల 79లక్షలతో ఐదు కిలోమీటర్లు నూతన తారు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

ప్రజా భూమి ప్రతినిధి అవనిగడ్డ



గోగినేనిపాలెంలో సాస్కి నిధులు రూ.2కోట్ల 10లక్షలతో 3.80 కిలోమీటర్లు నూతన తారు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వైసీపీ ఐదేళ్ల విధ్వంస పాలనా కాలంలో అభివృద్ధి కానరాక అధ్వాన్న స్థితికి చేరుకున్న గ్రామీణ రహదారుల రూపురేఖలు మార్చేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఘంట సాల మండలంలో విస్తృత పర్యటన ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించారు. మండల పరిధిలోని లంకపల్లిలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.36లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామీణ ఆరోగ్య కేంద్రం ప్రారంభించారు. మల్లంపల్లిలో సాస్కి నిధులు రూ.2కోట్ల 79లక్షలతో ఐదు కిలోమీటర్లు నూతన తారు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి, పనులు



ప్రారంభించారు. అనంతరం గోగినేనిపాలెంలో సాస్కి నిధులు రూ.2కోట్ల 10లక్షలతో 3.80 కిలోమీటర్లు నూతన తారు రోడ్డు నిర్మాణా నికి శంకుస్థాపన చేసి శిలాఫలకం ఆవిష్కరించి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా సభల్లో ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో అన్ని ఆర్.అండ్.బీ, పంచాయతీ రాజ్ రహదారులు దారుణంగా దెబ్బతిన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ తెచ్చిన సాస్కి నిధులతో నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధి చేపట్టినట్లు తెలిపారు. రూ.14.57 కోట్లు సాస్కి నిధులతో మల్లంపల్లి, గోగినేనిపాలెంతో పాటు నియోజ కవర్గంలో మరిన్ని రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో మంజూరు చేయించిన రోడ్లను వైసీపీ అధికారంలోకి రాగానే రివర్స్ టెండరింగ్ పేరుతో అభివృద్ధికి అడ్డుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. మళ్ళీ కూటమి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో రహదారుల నిర్మాణం వేగవంతం చేశామన్నారు. పంచాయతీరాజ్ - గ్రామీణ అభివృద్ధి త్వరగా పవన్ కళ్యాణ్ ఆలోచన మేరకు డొంక రోడ్లు అభివృద్ధి చేస్తామన్నారు. గ్రామీణ వైద్యసౌకర్యాల బలోపేతానికి నియోజకవర్గంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.5.04 కోట్లతో 14 నూతన ఆరోగ్య కేంద్రాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కేంద్రం నిధులు ఇచ్చినా వైసీపీ చేతగానితనానికి అసంపూర్తిగా నిలిచిన 15 ఆరోగ్య కేంద్రాలను పూర్తి చేసేందుకు రూ.కోటి 36లక్షలతో పనులు చేపట్టినట్లు తెలిపారు. రైతులకు అండగా ఉంటాం-ఆందోళన చెందవద్దుఆయా సభల్లో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ రైతులకు ప్రస్తుతం నెలకొన్న ఎల్-నీనో పరిస్థితి వివరించారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆందోళన చెందవద్దని సూచించారు. తాను రాజకీయ ప్రయోజనాల కంటే రైతు ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తాన్నారు. కృష్ణాడెల్టా ఉద్యమ సమయంలో నాగార్జున సాగర్ నీరు ఉన్నప్పటికీ, తెలంగాణ నేతల ఒత్తిడికి ప్రభుత్వం లొంగిపోయిన నేపధ్యం లో తాను ఆనాడు రాజకీయాలకు అతీతంగా పోరాడి సాగునీటిని సాధించినట్లు తెలిపారు. రైతు పక్షాన నిలిచి పోరాడే సత్తా నేటికీ తనలో ఉన్నప్పటికీ, ప్రస్తుతం అన్ని ప్రాజెక్టుల్లో నీటి కొరత ఏర్పడిన దశలో ప్రకృతి కరుణిస్తేనే సాగునీటిపై భరోసా వస్తుందన్నారు. వాతావరణ శాస్త్రవేత్తలు ఎల్-నినో దుష్పరిణామాలు మరో రెండేళ్లపాటు ఉంటాయని, త్రాగునీటికి కూడా ఇబ్బంది ఎదురవుతుందని చెబుతున్న నేపథ్యంలో రైతులు ప్రభుత్వ సూచన మేరకు తప్పనిసరిగా ప్రతి ఒక్కరు పంటల బీమా చేయించుకోవాలని సూచించారు. వ్యవసాయ సీజన్ ముగిసే లోపు పరిస్థితి ఎలా ఉంటుందో ప్రభుత్వం చేతిలో లేని నేపథ్యంలో ప్రకృతిపై విశ్వాసం, వరుణుడి కరుణ కోసం ఎదురుచూపు మాత్రమే కాకుండా కనీస భరోసాగా పంటల బీమా నమోదు చేయించుకోవాల ని పిలుపునిచ్చారు. తనకు ధనబలం లేకున్నా ప్రజలే తన బలం అన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలకు మేలు చేయడమే తన కర్తవ్యం అన్నారు. తమ నియోజకవర్గంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందిని తీర్చేందుకు సాధ్యమైనంత మేరకు కృషి చేస్తానని తెలిపారు. రైతులు ఎట్టి పరిస్థితిలోనూ మనో ధైర్యం కోల్పోవద్దని, వైసీపీ ప్రభుత్వం మాదిరిగా కాకుండా కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని స్పష్టం చేశారు.కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, వైస్ చైర్మన్ అత్తులూరి గోపీచంద్, జెడ్పీ వైస్ చైర్మన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ, డీసీ వైస్ చైర్మన్ పరసే చలపతిరావు, ఎంపీటీసీ సభ్యులు కొలుసు రూశన్‌లక్ష్మి, సిద్దినేని కుమార్ రాజా, పీఏసీఎస్ చైర్మన్ బండి పరత్తారావు, ఎస్ఐ వేమన చందన, మాజీ సర్పంచులు బెల్లంకొండ అమరేశ్వరరావు, ముప్పనేని రవిప్రసాద్, అంకం మారుతీరావు, మునిపల్లి బుజ్జి, పెనుమాక సుదర్శన్, మాజీ ఎంపీటీసీ గువ్వాలత్తిన నాగేశ్వరావు, టీడీపీ నేత దిరిశం వెంకట్రావ్, ఏఎంసీ డైరెక్టర్ కోలపల్లి శ్రీధర్, జనసేన, బీజేపీ మండల అధ్యక్షులు కోనే రాజశేఖర్, తాళ్ళూరి హరిప్రసాద్, తహసీల్దార్ డీ.విజయ ప్రసాద్, పంచాయతీరాజ్ శాఖ డీఈఈ పరగాల సురేష్, ఏఈ బ్రహ్మానంద బాబు, ఈఓఆర్డీ కొండేటి వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు కొండా సందీప్ రెడ్డి, యక్కలి సుబ్రహ్మణ్యం, వీఆర్ఓ గిరిప్రసాద్, వైద్య అధికారులు డాక్టర్ నరేంద్ర నాయక్, డాక్టర్ ప్రియాంక, పంచాయతీ కార్యదర్శి కొండా సందీప్ రెడ్డి, పీఆర్ డీ.శివారావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పీతా వంశీకృష్ణ, ఎంఎల్ హెచ్.పీ ఎన్.దివ్య, ఏఎన్ఎం ఏ.నాగమాధవి, ఆశా ఝాన్సీరోజా, టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యదర్శి దిరిశం బాలకోటయ్య, కూటమి నాయకులు పాటిబండ్ల నరేష్, వైవీ కిరణ్, కుంపటి సుబ్బారావు, కుంపటి ప్రవీణ్, గుడివాక శివరావు, కొమ్మారెడ్డి లీలాకృష్ణయ్య, కొల్లూరి సాయిరాం, కనుమూరి సుబ్రహ్మణ్యం, కమ్మిలి సాయి భార్గవ, పెనుమాక శ్రీనివాస్, వీరమాచినేని ప్రసాద్, కోనేరు సుబ్బారావు, చల్లపల్లి దుర్గా నాగేశ్వరరావు, జువ్వనపూడి కిరణ్, కుంపటి నాగమల్లి, ఉంగ్రకొండ ఈశ్వర్, సుగ్గన పవన్ కుమార్, ఏసుగు పాండు, కోలపల్లి కిరణ్, కొండవీటి శ్రీనివాస్, కోనేరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఐదేళ్లు నెత్తురు పారించి... జగన్ రెడ్డి ఇప్పుడు నీతులు చెబుతున్నాడు

### టీడీపీ అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాష్

ప్రజాభూమి ప్రతినిధి అమరావతి:



రాష్ట్ర ప్రజలందరికీ వరలక్ష్మీ వ్రత శుభాకాంక్షలు తెలియజేస్తూ.. గతంలో అధికార బలంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో తీవ్ర అరాచకాలు సృష్టించిన గొడ్డలిపార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డి, ఇప్పుడు ఏమీ తెలియనట్లు 'స్వాతిముత్యంలాగా' నటిస్తూ ఎన్నికల్లో యుద్ధం చేద్దాం అనడం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. టీడీపీ కార్యాలయానికి కార్యకర్తలు ఎవరైనా స్వేచ్ఛగా రావచ్చని, కానీ వైసీపీ ఆఫీసుకు కేవలం ఎంపిక చేసుకున్న కొద్దిమందిని మాత్రమే అనుమతించే పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. అలాంటి కొద్దిమందిని కూర్చోబెట్టుకుని.. గంజాయి బ్యాచ్‌లకు, హత్యలు చేసేవా రికి, గొడ్డళ్లతో విన్యాసాలు చేసేవారికే టికెట్లు ఇస్తామని చెప్పే రీతిలో జగన్ ఆలోచనలు ఉన్నాయని మండిపడ్డారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో జరిగిన దౌర్జన్యాలు ప్రజలందరికీ గుర్తున్నాయని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఎక్కడా పోటీ ఉండకూడదని, వీలైనన్ని ఎక్కువ ఏకగ్రీవాలు చేయాలని మంత్రులకు, ఎమ్మెల్యేల కు లక్ష్యాలు పెట్టి అరాచకాలు చేయించింది జగన్ కాదా అని ప్రశ్నించారు. ఆనాడు ప్రజాస్వామ్యాన్ని కాలరాసి బలవంతపు ఏకగ్రీవాలు చేసుకుని, నేడు అధికారం పోయాక ఏమీ ఎరగనట్లు 'స్వాతిముత్యంలాగా' మాట్లాడుతూ 'యుద్ధం చేద్దాం, స్వేచ్ఛగా ఎన్నికలు జరిగితే మనదే విజయం' అనడం దొంగ ఇంట్లోని కుక్క పోలీసులను చూసి మొరిగినట్లు ఉందని ఎద్దేవా చేశారు. జగన్ పాలన రాష్ట్రానికి అరిష్టమని భావించే గత ఎన్నికల్లో ప్రజలు ఆయన పార్టీని 11 సీట్లకే పరిమితం చేశారని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎంతో విజ్ఞులని, ఒకసారి వదిలించుకున్న దరిద్రాన్ని మళ్లీ తెచ్చుకునేందుకు సిద్ధంగా లేరని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రత్యర్థులు నామినేషన్లు వేయకుండా బెదిరించారని, పోటీలో నిలిచిన వారిని వేధించి తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. అటువంటి అరాచకాలకు పాల్పడిన వారు ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల పేరిట సాగిన హింస, దౌర్జన్యాలకు సంబంధించిన ఆధారాలు ప్రజల వద్ద ఇంకా పదిలంగానే ఉన్నాయని హెచ్చరించారు. జగన్ ఎన్ని నాటకాలు ఆడినా, స్వాతిముత్యంలా ఎన్ని కబుర్లు చెప్పినా స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీకి ఘోర పరాభవం తప్పదని, కూటమి ప్రభుత్వానికే ప్రజలు మరోసారి స్పష్టమైన తీర్పునిస్తారని ఆయన తేల్చిచెప్పారు. కూటమి ప్రభుత్వ హయాంలో ఎలాంటి భయభ్రాంతులు లేకుండా పూర్తి స్వేచ్ఛాయుత వాతావరణంలో స్థానిక ఎన్నికలు జరుగుతాయని, ప్రజాభిప్రాయం ప్రకారం కూటమి విజయకేతనం ఎగురవేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సార్వత్రిక ఎన్నికల ముందు 'సిద్ధం' సభలు పెట్టి 'వై నాట్ 175' అంటూ ప్రగల్భాలు పలికిన జగన్ మోహన్ రెడ్డి, చివరికి కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకోలేకపోయారని ఎద్దేవా చేశారు. గతంలోలాగే ఇప్పుడు కూడా కార్యకర్తలను మభ్యపెట్టి మళ్లీ నట్టేట ముంచే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. యువనేత నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో భాగంగా 99 బహిరంగ సభల్లో 'రెడ్ బుక్'ను ప్రజలకు చూపించారని గుర్తుచేశారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టప్రకారమే చర్యలు ఉంటాయని ప్రజల సమక్షంలో స్పష్టంగా చెప్పి ప్రజామోదం పొందామని, ఇవి ఎన్నికల తర్వాత కొత్తగా తెచ్చినవి కావని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎవరిపైనా ఒక్కటంటే ఒక్క అక్రమ కేసు కూడా పెట్టలేదని, తప్పు చేసినట్లు స్పష్టమైన ఆధారాలు ఉన్నందునే చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నామని సూర్యప్రకాష్ స్పష్టం చేశారు. ప్రతిరోజూ 'రెడ్ బుక్ రాజ్యాంగం' అంటూ గగ్గోలు పెట్టే గొడ్డలి పార్టీ నాయకులకు ఆయన సూటిగా సవాల్ విసిరారు. కూటమి ప్రభుత్వం ఎవరిమీదైనా రాజకీయ కక్షతో అక్రమ కేసులు పెట్టిందా? లేక వారు చేసిన నేరాలకు ఆధారాలు ఉండబట్టే జైలుకు వెళ్లారా? అనే దానికి వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి, వారి పార్టీ నేతలు సమాధానం చెప్పాలి. బొల్లా బ్రహ్మనాయుడు దొంగ డాక్యుమెంట్లు సృష్టించి, భూకబ్జా కుట్రకు పాల్పడితే పోలీసులు అరెస్ట్ చేయకూడదా?, సీదిరి అప్పలరాజు 40 ఏళ్ల నిరుపేద గొర్రెల కాపరిని రోడ్డు ప్రమాదంలో చంపేసి, సొంత కొడుకుని కాపాడుకోవడానికి అమాయకుడైన వేరే యువకుడిపై నెపం వేసి సాక్ష్యాలను తారుమారు చేయాలని చూస్తే మాజీ మంత్రని వదిలేయాలా? కుటుంబానికి ఆధారం కోల్పోయి, పాలకు డబ్బుల్లేక నీళ్లలో బిస్కెట్ వేసి బిడ్డకు తినిపించే ఆ పేద బాధితురాలి కన్నీళ్లు మీకు కనిపించలేదా? వల్లభనేని వంశీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఏడాది పాటు వంశీపై ఎలాంటి చర్యా తీసుకోలేదు. కానీ, ఫిర్యాదుదారుడైన సత్యవర్ధన్‌ను లిఫ్ట్‌లో నుంచి కిడ్నాప్ చేసి, బెదిరించి కేసు విత్‌డ్రా చేయించాలని చూస్తే చట్టం చూస్తూ ఊరుకోవాలా? దీనికి సంబంధించిన వీడియో ఆధారాలు స్పష్టంగా ఉన్నాయి. వై. విరూపాక్షి ఇసుక దోపిడీని అడ్డుకుందన్న అక్కసుతో ఒక దళిత మహిళపై దాడి చేసి వివస్త్రను చేస్తే ప్రభుత్వం మౌనంగా ఉండాలా? కిడ్నాప్ కేసులో మాజీ ఎమ్మెల్యే ముస్తఫా, కల్తీ మద్యం కేసులో జోగి రమేష్, డ్రైవర్ హత్య కేసు సాక్షుల బెదిరింపులో ఎమ్మెల్సీ అనంతబాబు, అనుచిత వ్యాఖ్యలు చేసిన అంబటి రాంబాబు, సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసిన వర్రా రవీంద్రా రెడ్డిలపై అన్ని ఆధారాలతోనే పోలీసులు చట్టప్రకారం చర్యలు తీసుకున్నారు. బాధితుల పక్షాన నిలబడాల్సిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, సిగ్గులేకుండా నేరస్తుల పక్షాన నిలబడి వెనకేసుకు రావడం సిగ్గుచేటని మద్దిపట్ల సూర్యప్రకాష్ మండిపడ్డారు. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా చట్టం ముందు సమానులేనని, ప్రజా ప్రభుత్వం బాధితులకు న్యాయం చేసే దిశగానే పని చేస్తుందని ఆయన తేల్చిచెప్పారు. గత ఐదేళ్ల వైఎస్సార్సీపీ పాలనలో బడుగు, బలహీన, దళిత వర్గాలపై 'బ్లడ్ బుక్' రాసి అరాచకాలు సృష్టించిన జగన్ మోహన్ రెడ్డికి, నేడు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటుంటే 'రెడ్ బుక్ రాజ్యాంగం' అంటూ మాట్లాడే అర్హత లేదని మద్దిపట్ల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వంలో ఒక్కటంటే ఒక్క అక్రమ కేసు కూడా పెట్టలేదని, ఎన్నికల సమయంలో నారా లోకేష్ చెప్పినట్లుగానే చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ప్రజలను వేధించిన వారిపైనే పక్కా ఆధారాలతో చట్టబద్ధమైన చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. దళిత మహిళను వివస్త్రను చేసి కొట్టిన కేసులో నిందితుడైన ఎమ్మెల్యేను పరామర్శించడానికి వెళ్లిన జగన్, బాధిత మహిళను కనీసం ఓదార్చలేదని మండిపడ్డారు. కేసు పెట్టిన బాధితుడిని హైదరాబాద్‌కు కిడ్నాప్ చేసి, బెదిరించి విత్‌డ్రా చేయించుకోవాలని చూస్తే పోలీసులు చర్యలు తీసుకున్నారని, దాన్ని కూడా రాజకీయం చేయడం సిగ్గుచేటని అన్నారు. గత ఐదేళ్లలో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై ఏకంగా 60 వేల అక్రమ కేసులు బనాయించి పైశాచికానందం పొందారని విమర్శించారు. జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత ఉన్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాగునీటి ప్రాజెక్టుల పరిశీలనకు వెళ్తే అంగళ్లు, తంబళ్లపల్లి వద్ద వైసీపీ శ్రేణులు రాళ్ల దాడి చేశాయి. పుంగనూరు, అంగళ్లు ఘటనల్లో ఏకంగా 1200 మందిపై హత్యాయత్నం (307) కేసులు పెట్టారు. అమెరికాలో ఉన్న వారిపై, సిక్కింలో ఆర్మీలో పనిచేస్తున్న జవాన్లపై, మాచర్లలో యువగళం పాదయాత్రలో ఉన్న తమపై కూడా అంగళ్లులో దాడి చేశారంటూ తప్పుడు కేసులు నమోదు చేశారు. చంద్రబాబుపై 2 హత్యాయత్నం కేసులు, నారా లోకేష్‌పై 23 కేసులు పెట్టడమే కాకుండా.. కళా వెంకట్రావు, చింతమనేని ప్రభాకర్ (14 కేసులు), కొల్లు రవీంద్ర (25), అయ్యన్నపాత్రుడు, చల్లా బాబురెడ్డి (17), ధూళిపాళ్ల నరేంద్ర (16), రఘురామకృష్ణరాజు (11), బీటెక్ రవి (9), అచ్చెన్నాయుడు (21)లతో పాటు చివరకు ఎస్సీ, ఎస్టీ నేతలపై కూడా తప్పుడు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు బనాయించారు. చిన్న ఘటన జరిగినా వందలాది మందిపై కేసులు పెట్టి టీడీపీని నిర్వీర్యం చేయాలని చూసిన జగన్ మోహన్ రెడ్డి పాపాలను రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని అన్నారు. తప్పు చేసిన వారిపై చట్టం తన పని తాను చేసుకుపోతుంటే, ఓర్వలేక భ్రమలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని, కూటమి ప్రభుత్వం బాధితుల పక్షాన నిలబడి న్యాయం చేస్తుందని ఆయన తేల్చిచెప్పారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవాలు జరిగితే ఊరుకో నంటూ వైసీపీ కార్యకర్తలను, ఇన్‌ఛార్జ్‌లను జగన్ మోహన్ రెడ్డి రెచ్చగొట్టడం ఆయన ద్వంద్వ వైఖరికి నిదర్శనమని సూర్యప్రకాష్ మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ బలవంతపు ఏకగ్రీవాలు చేయించుకుని, ఇప్పుడు అధికారం కోల్పోయాక 'యుద్ధం చేద్దాం' అంటూ మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. అవసరానికి ఒక మాట మాట్లాడి, ఆ తర్వాత వాడుకొని వదిలేయడం జగన్ మోహన్ రెడ్డి రాజకీయ నైజమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం కోసం సొంత తల్లిని, చెల్లిని వాడుకుని.. ఆ తర్వాత వారిపైనే కేసులు వేయించిన నీచ చరిత్ర జగన్‌ది. అధికారంలో ఉన్న ఐదేళ్లూ సామాన్యుల నుంచి ప్రతిపక్ష నేతల వరకు అందరినీ వేధించారు. సొంత బాబాయి హత్య కేసు మొదలుకొని ఎందరి జీవితాలనో నాశనం చేశారు. యువత, వృద్ధులు సహా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి.. ఇప్పుడు మళ్లీ 'జెన్ జీ' (Gen Z) అంటూ కొత్త డ్రామాలకు తెరలేపుతున్నారు. 'ఒక్క అవకాశం' అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ పాలనను ప్రజలు చూశారని, ఆ 'సినిమా' పూర్తిగా అట్టర్‌ఫ్లాప్ అయిందని అన్నారు. ఒక్కసారి చూసి తల బొప్పి కట్టిన ఆ సినిమాను మళ్లీ రీ-రిలీజ్ చేస్తే చూడటానికి ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎవరూ సిద్ధంగా లేరని ఎద్దేవా చేశారు. స్థానిక సంస్థలైనా, మున్సిపాలిటీలైనా, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలైనా సరే ఫలితం ఒక్కటేనని స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 94 శాతం స్ట్రైక్ రేట్‌తో కూటమికి ఎలాగైతే పట్టం కట్టారో, భవిష్యత్తులో ఏ ఎన్నికలు వచ్చినా 94 శాతానికి పైగా స్థానాలు, 56 శాతానికి పైగా ఓట్లతో కూటమిదే ఏకపక్ష విజయమని మద్దిపట్ల సూర్యప్రకాష్ ధీమా వ్యక్తం చేశారు.


Printed by MOHANEESWAR PUBLICATIONS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at West Godavari and published at D. No.11-12-124, Nawabpetcolony,3rd Division, Eluru editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1219.cell:9502116677.

# భక్తుల సౌకర్యమే మా మొదటి ప్రాధాన్యత

**ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)**

ప్రజాభూమి ప్రతినిధి-విజయవాడ(ఇంద్రకీలాద్రి)

విజయవాడ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో దశాబ్ద కాలం నుంచి ఎదురుచూస్తున్న అన్న ప్రసాద భవనం లడ్డు పోటు భవనాలు ప్రారంభోత్సవం నేడు ఘనంగా జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామ్ నారాయణ రెడ్డి, ప్రభుత్వ విప్ ప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావు, స్వచ్ఛంద కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్, అమ్మవారి ఆలయ పాలకమండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ గాంధీ, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు ఈవో శీనా నాయక్ మరియు ఇతర అధికారులు ఆలయ సిబ్బంది తో కలిసి ఎంపి కేశినేని చిన్ని పాల్గొన్నారు. ముందుగా అన్న ప్రసాద భవనాన్ని, తరువాత లడ్డు పోటు భావనాలను ప్రజాప్రతినిధులు అధికారులు అంతా కలిసి పరిశీలించి అనంతరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) మాట్లాడుతూ ముందుగా శ్రావణ శుక్రవారం రోజున అన్న ప్రసాద భవనం లడ్డు పోటు భవనాలను ప్రారంభించడం శుభ పరిణామం అని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారం తో ఈ రోజు ఈ రెండు భవనాలు నిర్మాణం చేసుకున్నాం అని ఈరోజు అన్న ప్రసాదం భవనం, లడ్డు పోటు భవనాలు ప్రారంభించుకోవడం జరిగింది అని తెలిపారు సుమారు 53 కోట్ల రూపాయిల నిధులతో ఈరోజు రెండు భవనాలను ప్రారంభించుకున్నామని ఈరెండు



భవనాలు అమ్మవారి ఆలయానికి ఒక కానుకగా భావిస్తున్నాం అని అన్నారు దేవాదాయ శాఖ మంత్రి అమ్మవారి ఆలయం పై ప్రత్యేక దృష్టి పెట్టారు అని అందుకే ఈ రెండు భవనాల నిర్మాణం ఇంత త్వరితగతిన చేపట్టగలిగామని కూటమి ప్రభుత్వ సహకారంతో చేపట్టిగలిగామని అన్నారు. అమ్మవారి ఆలయం గత 4 నెలలుగా రాష్ట్రం లోని అన్ని దేవాలయాల్లో 1వ స్థానం సాధించింది అని దేవాదాయ శాఖ ఉద్యోగులు అందరు కలిసికట్టుగా పనిచేసారు కాబట్టే సాధ్యపడింది అని తెలిపారు భక్తుల సౌకర్యమే మా మొదటి ప్రాధాన్యత అని నిర్మితమవుతున్న రాజధాని అమరావతి లో ఈ అమ్మవారి దేవస్థానం ప్రత్యేక పాత్ర పోషించబోతుంది అని అన్నారు ప్రారంభించిన భవనాల ద్వారా 60 వేల లడ్డులు ఒక గంటలకు తయారు కానున్నాయి అని ఒకే సారి 10 వేల మందికి ఒక గంటలలో భోజనం చేసే సౌకర్యం ఏర్పాటు చేసాము అని అన్నారు రాబోయే దసరాకు ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభించాము అని దసరా ను అంగరంగ వైభవం గా జరిపిస్తాం అని కూటమి ప్రభుత్వశీ ఆధ్వర్యంలో లోనే దేవాలయాల అభివృద్ధి జరుగుతుంది అని ఎంపీ చిన్ని స్పష్టం చేశారు.

## సింగపూర్ టౌన్‌షిప్ సొసైటీ ఎన్నికల ప్రక్రియ ముగింపు



ప్రజాభూమి ప్రతినిధి-కడప

కడపలోని 450 నివాస గృహాలతో కూడిన సింగపూర్ టౌన్‌షిప్ మ్యూచువల్లి ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా ముగిసింది. ఆంధ్రప్రదేశ్ కోఆపరేటివ్ సొసైటీ చట్టం-1995 ప్రకారం ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. సొసైటీ నమోదు అనంతరం 300 మందికి పైగా కాలనీవాసులు సభ్యులుగా చేరగా, ప్రధాన నిర్వాహకులు నియమించిన ఎన్నికల పరిశీలకులు రూపొందించిన షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు జరిగాయి. ఆగస్టు 20న సాయంత్రం 5 గంటలకు నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన అనంతరం 15 మంది కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పరిశీలకులు ప్రకటించారు. అధ్యక్షుడిగా మాజీ మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డా. టి.ఎస్. రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రిమ్స్ నోడల్ అధికారి జి. రవి కుమార్, కోశాధికారిగా హోలిస్టిక్ హాస్పిటల్స్ జనరల్ సర్జన్ డా. ఎల్. వెంకటేశ్వర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు మరో 12 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. కొత్తగా ఎన్నికైన కార్యవర్గానికి సంబంధించిన అధికారిక సమాచారాన్ని జిల్లా సహకార అధికారికి పంపినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు డా. టి.ఎస్. రెడ్డి మాట్లాడుతూ, అత్యధిక విద్యావంతులైన సభ్యులతో కూడిన నూతన కార్యవర్గం ఆవీ టౌన్‌షిప్ అభివృద్ధిని ప్రణాళికాబద్ధంగా, వ్యవస్థీకృతంగా ముందుకు తీసుకెళ్తుందని తెలిపారు. ముఖ్యంగా మెరుగైన శుభ్రత, పారిశుధ్యం, స్థిరమైన నీటి సరఫరా, పటిష్టమైన భద్రతా చర్యలకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా, తాత్కాలిక కమిటీ వెంటనే నివాసుల నుంచి నిర్వహణ రుసుము వసూలు చేయడం నిలిపివేసి, సంబంధిత రికార్డులు, బాధ్యతలను నూతనంగా ఎన్నికైన కమిటీకి అప్పగించాలని ఆయన కోరారు. కొత్త కమిటీ పారదర్శకమైన, ప్రజాస్వామ్య పద్ధతిలో టౌన్‌షిప్ పరిపాలనను ముందుకు తీసుకెళ్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు

# దేవాలయాల వద్ద స్థానికేతర భక్తులకే అన్నదానం చేయాలి

ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

ఆంధ్రప్రదేశ్లోని అన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే దేవాలయాల వద్ద అన్న ప్రసాదం( భోజనాలు) కేవలం స్థానికేతర భక్తులకు మాత్రమే అన్న వితరణ చేయాలని పలువురు కోరుతున్నారు. కనీసం నియోజకవర్గం దాటి వచ్చిన భక్తులకు పెట్టిన దేవస్థానంలో దూబరా వ్యయం తగ్గుతుందని పలువురు అంటున్నారు. దీనికోసం ఆధార్ కార్డు జిరాక్స్ ఆధారంగా అమలు చేయాలని పలువురు సూచిస్తున్నారు. స్థానికులకు అవసరమైతే ఎలాగూ అన్నా క్యాంటీన్ లు ఉన్నాయి కనుక దేవస్థానంలో అన్నదానాలు అవసరం లేదని పలువురు అంటున్నారు.



**స్థానికులకు అన్న ప్రసాదం వితరణ వల్ల సమాజానికి నష్టాలు ఇలా:**

స్థానికులకు అన్నప్రసాదం వితరణ వల్ల కొందరు ఇదేపనిగా పెట్టుకొని పనులు మానేసి సోమరిపోతుల్లా మారి దేవాలయాల్లో భోజనాలు చేసి కాలం గడిపేస్తున్నారని, దీని వల్ల సమాజంలో ఏ పని కావాలి అన్న అనగా వ్యవసాయ,వ్యవసాయతర పనుల కోసం కార్మికులు లేక కొరత వస్తోందని పలువురు అంటున్నారు. అదేవిధంగా దేవస్థానంలో అనవసర ఖర్చు తగ్గించుకుని ఆ సొమ్మును దేవస్థానం అభివృద్ధికిఉపయోగించుకోవచ్చని కొందరు పలువురు సూచిస్తున్నారు. కేవలం ప్రభుత్వ అధీనంలోని దేవస్థానం వద్ద వారం, లేదా నిత్యం అన్నదానాలు జరిపే దేవస్థానంలలో ఇలా అమలు చేసిన సరిపోతుందని పలువురు అంటున్నారు. ఏడాది కి ఒక సారి జాతర, వేడుకలు ల్లో అయితే స్థానికుల కు కూడా అనుమతించ వచ్చాంటున్నారు.

# మత్స్యకారుల ఆచూకీ కోసం గాలింపు నిరంతరం కొనసాగుతోంది

- **5 నౌకలు, 2 డోర్నియర్ విమానాలు, హెలికాప్టర్‌తో విస్తృత సెర్చ్ ఆపరేషన్**
- **మయన్మార్, పోర్ట్‌బ్లెయిర్, బంగ్లాదేశ్ సరిహద్దు తీరప్రాంత అధికారులకు సమాచారం**
- **మత్స్యకారులను సురక్షితంగా తీసుకొచ్చే వరకు గాలింపు ఆగదు**
- **కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలి**
- **మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

ప్రజాభూమి ప్రతినిధి-అమరావతి

గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం భారత తీర రక్షక దళం చేపట్టిన గాలింపు చర్యలు నిరంతరంగా కొనసాగుతున్నాయని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కోస్ట్‌గార్డ్ అసిస్టెంట్ కమాండింగ్ ఆఫీసర్ రంజిత్ కుమార్‌తో సంబంధిత అధికారులు మాట్లాడి సెర్చ్ ఆపరేషన్ పురోగతిని తెలుసుకున్నారని మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం 5 నౌకలు, రెండు డోర్నియర్ విమానాలు, ఒక హెలికాప్టర్‌తో సముద్రంలో విస్తృతంగా గాలిస్తున్నట్లు కోస్ట్‌గార్డ్ అధికారులు తెలియజేశారన్నారు. మత్స్యకారుల బోటుకు సంబంధించిన సమాచారాన్ని మయన్మార్, పోర్ట్‌బ్లెయిర్‌తో పాటు బంగ్లాదేశ్ సరిహద్దు తీరప్రాంతాల్లోని కోస్ట్‌గార్డ్ అధికారులకు కూడా చేరవేశారని తెలిపారు. ఆయా ప్రాంతాల్లోనూ బోటు ఆచూకీ కోసం అప్రమత్తంగా ఉండాలని సూచించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం బోటు ఆచూకీ లభించనప్పటికీ, సెర్చ్ ఆపరేషన్‌లో ఎలాంటి విరామం ఉండదని మంత్రి స్పష్టం చేశారు. ఈ నెల 24వ తేదీ తరువాత బాధ్యతలు స్వీకరించే అధికారి కూడా గాలింపు చర్యలను కొనసాగిస్తారని కోస్ట్‌గార్డ్ అధికారులు తెలిపినట్లు వెల్లడించారు. మత్స్యకారులను సురక్షితంగా తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కోస్ట్‌గార్డ్, నేవీతో నిరంతరం సమన్వయం చేసుకుంటోందని చెప్పారు. కుటుంబ సభ్యులు ఆందోళన చెందకుండా ధైర్యంగా ఉండాలని, బోటు ఆచూకీ లభించే వరకు అన్ని మార్గాల్లో గాలింపు కొనసాగిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు.

# నగరాల సామజిక వర్గ అభివృద్ధికి కట్టుబడి ఉంటా

**ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)**

ప్రజాభూమి ప్రతినిధి-విజయవాడ

విజయవాడ 48వ డివిజన్ చిట్టినగర్ లో నగరాల సీతారామస్వామి శ్రీ మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం పాలకమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎంపీ కేశినేని చిన్ని పాల్గొన్నారు. ఈ సందర్భంగా 27 మంది నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా పోతిన బేసు కంటేశ్వరుడు, గౌరవ అధ్యక్షుడిగా రాయన ఆదిబాబు, కార్యదర్శిగా తొత్తడి భారత్, కోశాధికారిగా బెవర సాయి సుధాకర్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎంపి కేశినేని చిన్ని మాట్లాడుతూ ముందుగా



నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు శ్రావణ శుక్రవారం రోజున ప్రమాణ స్వీకారం చేయడం నిజంగా పాలకమండలి అదృష్టమని ఇది ఒక గొప్ప విషయమని అన్నారు నగరాల గురించి చెప్పుకోవాలంటే చాలా ఉందని విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో నగరాల పాత్ర అత్యంత కీలకమైనదని ఎంపీగా తన గెలుపు స్థానిక ఎమ్మెల్యే గెలుపులో కూడా నగరాల పాత్ర మరువలేనిదని తెలియజేశారు. నగరాల సామాజిక వర్గం నుండి ఎందరో మంది గొప్ప నాయకులు వచ్చారని మరిపిళ్ల చిట్టిబాబు గారి నూతన పెద్ద విగ్రహాన్ని త్వరలో ఏర్పాటు చేస్తామని తెలియజేశారు ప్రభుత్వం ఇస్తున్న అన్ని అవకాశాలను స్థానిక ఎమ్మెల్యే కూడా కలుపుకొని మరిన్ని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా కార్యక్రమాలు చేస్తున్నారని అన్నారు నగరాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వంతో పాటు తాను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని ఎలాంటి సమస్య వచ్చినా అండగా ఉంటామని ఎంపీ చిన్ని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో భక్తులు, నాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు

# ఆగస్టు 24న ఛలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి

**సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వందవాసి నాగరాజు.**

ప్రజాభూమి ప్రతినిధి-ఏర్పేడు

స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు గడిచినా దళిత వాడల్లో మౌలిక సదుపాయాల కొరత కొనసాగుతుండటం బాధాకరమని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వందవాసి నాగరాజు అన్నారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, రైతు కార్మిక సంఘం, రైతు సంఘం తదితర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన సామాజిక శంఖారావం సర్వేలో గ్రామీణ ప్రాంతాల్లో దళితులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. ఏర్పేడు మండలంలో నిర్వహిస్తున్న సామాజిక చైతన్య యాత్రలో భాగంగా శుక్రవారం పల్లంపేటలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళితవాడల్లో స్మశాన వాటికలు, స్మశానాలకు వెళ్లేందుకు రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, రోడ్లు వంటి కనీస సౌకర్యాలు కూడా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇళ్లు, సెంటు భూమి లేని దళిత కుటుంబాలు ఇంకా వున్నాయని, పాఠశాలలు, హాస్టళ్లలో విద్యార్థులకు సరైన వసతులు లేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. దళితుల సమస్యల పరిష్కారంలో జిల్లా స్థాయి నుంచి క్షేత్రస్థాయి అధికారుల వరకు జాప్యం చేస్తున్నారని ఆయన విమర్శించారు. సామాజిక శంఖారావం సర్వేలో



గుర్తించిన సమస్యలను ఇప్పటికే కలెక్టర్‌కు సమర్పించామని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 24న నిర్వహించే ఛలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలు స్వచ్ఛందంగా తమ సమస్యలను అర్జీల రూపంలో తీసుకుని తిరుపతి కలెక్టరేట్‌కు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రంగయ్య, వెంకటాద్రి, కేవీపీఎస్ నాయకులు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# నారాయణ స్కూల్లో ఘనంగా వరలక్ష్మీ పూజ

ప్రజాభూమి ప్రతినిధి-అనకాపల్లి

స్థానిక నరసింగరావుపేటలోని నారాయణ స్కూల్లో గురువారం వరలక్ష్మీ పూజా కార్యక్రమాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.ఐ. రవికుమార్ మాట్లాడుతూ ఇటువంటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో సంస్కృతి, సంప్రదాయాలు, భక్తిశ్రద్ధలు పెంపొందుతాయని తెలిపారు.

ప్రిన్సిపాల్ కె. రాజా మాట్లాడుతూ పాఠశాలలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో భక్తిభావం, ఏకాగ్రతతో పాటు సాంప్రదాయ విలువలు అలవడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డీన్ నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ శైలజ, రాజేశ్వరి, విభిత, ఏ.ఓలు శ్రీను, ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ప్రజల్లోకి టీడీపీ నేతలు.. ఇంటింటా సంక్షేమ పథకాలపై ప్రచారం



ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ఆగిరిపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ వారితో మమేకమయ్యారు. కార్యక్రమంలో ఆగిరిపల్లి గ్రామ టీడీపీ అధ్యక్షుడు పామర్తి నరసింహారావు, ఉపాధ్యక్షుడు గునిశెట్టి సత్యనారాయణ, మండల కో-కన్వీనర్ దుప్పుల సీతారామస్వామితో పాటు పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ కార్యక్రమం



ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కొవ్వూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని కొవ్వూరు నియోజకవర్గ శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. జీఐ పైప్‌లైన్ ఏర్పాటు, సీసీ రోడ్ల నిర్మాణం, పింఛన్లు మంజూరు తదితర సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు. ప్రజల సమస్యలను సానుకూలంగా పరిశీలించి, పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం చాగల్లు మండలం చాగల్లు గ్రామానికి చెందిన జుజ్జవరపు విజయలక్ష్మికి హైదరాబాద్‌లోని బసవతారకం కేన్సర్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకునేందుకు రూ. 5 లక్షల విలువైన ఎల్‌ఓసీని ఆమె కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో మద్దిపట్ల శివరామకృష్ణ, బేతిన నారాయణ, సుంకర సత్తిబాబు, కలగర రంగారావు తదితర ఎన్‌డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మలకపల్లిలో నూతన రైస్ మిల్‌కు శంకుస్థాపన



ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి

తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామంలో గ్రామ టీడీపీ అధ్యక్షులు చెరుకూరి వెంకట్రావు నూతనంగా నిర్మించనున్న రైస్ మిల్‌కు శంకుస్థాపన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొవ్వూరు నియోజకవర్గ శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. టుమెన్ కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, మద్దిపాటి ప్రకాశం, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని చెరుకూరి వెంకట్రావుకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన రైస్ మిల్ త్వరగా పూర్తై రైతులకు, స్థానిక ప్రజలకు ఉపయోగకరంగా ఉండాలని నాయకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## వైసీపీ దిమ్మకి రంగులు

ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.



వచ్చే నెల సెప్టెంబర్ 2వ తేదీన వై.యస్. రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా, మండలంలోని రామవరం పంచాయితీ సోములగూడెం గ్రామములోనీ దిమ్మకు మండల కార్యదశి ఆసు లక్ష్మణ రావు రంగులు వేయించారు. ఆ వైసీపీ పార్టీ దిమ్మకి పార్టీ పేరు, నాయకుడు ఎమ్మెల్సీ అనంత బాబు పేరు, మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి పేర్లు రాయించారు. వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ, వర్ధంతి రోజున నాయకులు కార్యకర్తల సమక్షంలో వైసీపీ జెండా ఎగరవేయడం జరుగుతుందనీ, వై.యర్.ఆర్. కాంగ్రెస్ పార్టీని గ్రామ గ్రామాన బలోపేతం చెయ్యడమే లక్ష్యం గా పనిచేయాలని, ప్రతి గ్రామములో వై.యస్.ఆర్ వర్ధంతిని జరుపుకోవాలని వి.ఆర్.పురం మండల కార్యదర్శి ఆసు, లక్ష్మణ రావు మండల కమిటీ ఆదేశాలమేరకు తెలియజేసారు.

## చెకుముకి సైన్ సంబరాల పోస్టర్ విడుదల

ప్రజా భూమి ప్రతినిధి-విజయవాడ




జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి సైన్ సంబరాల్లో భాగంగా శుక్రవారం ఇండస్ మాంటిసోరి పాఠశాలలో చెకుముకి పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మీనాక్షి, శ్రీనివాస్ రెడ్డి, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు బీడీ సుధీర్ రాజు, ఉపాధ్యక్షుడు బడే సాహెబ్, నగర అధ్యక్షుడు అజయ్, బాలోత్సవం అధ్యక్షుడు రఘుబాబు, నగర కార్యదర్శి రాజేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. చెకుముకి పరీక్షలు ఆగస్టు 27న పాఠశాల స్థాయిలో, సెప్టెంబర్ 11న మండల స్థాయిలో, సెప్టెంబర్ 27న జిల్లా స్థాయిలో, నవంబర్ 1, 2, 3 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో చెకుముకి సంబరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రజాభూమి

జనరల్ 14

శనివారం 22 ఆగస్టు 2026

# జిల్లాలో నాలుగు రోజులు ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు..!

## జిల్లాలో నాలుగు రోజులు ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు..!

ప్రజాభూమి ప్రతినిధి-కడప

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియ(ఎస్.ఐ.ఆర్.)లో భాగంగా ఈ నెల 22, 23, 29, 30 తేదీల్లో ప్రత్యేక ప్రచార, నమోదు శిబిరాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు.. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఈ నాలుగు రోజుల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రతి పోలింగ్ కేంద్రంలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు అందుబాటులో ఉండనున్నారు. ముసాయిదా ఓటరు జాబితాలు, ఏఎస్‌డీడీ జాబితాలను పరిశీలించేందుకు, సందేహాలను నివృత్తి చేసేందుకు, అవసరమైన దరఖాస్తులను స్వీకరించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా 18--19 ఏళ్ల యువ ఓటర్లను పెద్ద సంఖ్యలో నమోదు చేయడంతో పాటు, ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు నమోదు కాని అర్హులైన పౌరులను ఓటర్లుగా చేర్చేందుకు ఈ ప్రత్యేక శిబిరాలను వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. అవసరమైన 6, 7, 8, 8ఏ దరఖాస్తు పత్రాలను పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రత్యేక శిబిరాలపై జిల్లాస్థాయి నుంచి పోలింగ్ కేంద్రాల స్థాయి వరకు విస్తృత ప్రచారం నిర్వహించాలని, ఇందుకోసం ప్రింట్, ఎలక్ట్రానిక్ మాధ్యమాలతో పాటు స్థానికంగా ఇతర ప్రచార మార్గాలను కూడా వినియోగించి ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. శిబిరాల నిర్వహణను జిల్లా ఎన్నికల అధికారి స్వయంగా పర్యవేక్షించడంతో పాటు, ఎన్నికల అధికారులు పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ప్రత్యేక శిబిరాల్లో బీఎల్ఓలు గైర్హాజరైతే తీవ్రంగా పరిగణించి సంబంధిత అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సి వుంటుందన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణలో భాగంగా జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ కాలం కొనసాగుతున్నందున అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని సూచించారు

# తొలిరోజు ప్రశాతంగా సివిల్స్ మెయిన్స్..

- పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ



ప్రజాభూమి ప్రతినిధి-విజయవాడ

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సివిల్ సర్వీసెస్ మెయిన్ పరీక్షలు శుక్రవారం విజయవాడ కేంద్రంలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. నగరంలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్నిజిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తనిఖీ చేశారు. తొలిరోజు పేపర్-1 ఎస్సే పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో అభ్యర్థులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించి, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా ఏర్పాట్లను కొనసాగించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ మెయిన్ పరీక్షలు ఈ నెల 21వ తేదీ, 22వ తేదీ, 23వ తేదీ, 29వ తేదీ, 30వ తేదీల్లో అయిదు రోజులు పాటు పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. తొలిరోజు మాత్రం ఉదయం సెషన్‌లో మాత్రమే పరీక్ష ఉందని.. మిగిలిన రోజుల్లో ఉదయం, మధ్యాహ్నం కూడా పరీక్షలు జరుగుతాయన్నారు. విజయవాడలోని పరీక్షా కేంద్రంలో 124 మంది అభ్యర్థులకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. పరీక్షా కేంద్రంలో నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు, వైద్య సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు తదితర అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూస్తున్నామన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకునేలా వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక ప్రజా రవాణా సదుపాయాలను కల్పించామని.. భద్రత పరంగా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి అన్ని విధాల సహాయ సహకారాలు అందించేందుకు 91549 70454 నంబర్‌తో కంట్రోల్ రూమ్ కూడా సేవలందిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

# డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ!

- ఏళ్ల నిరీక్షణకు తెర.. కాంట్రాక్ట్ ఉద్యోగుల చిరకాల స్వప్నం సాకారం
- క్రమబద్ధీకరణకు విశేష కృషి చేసిన రాష్ట్ర నాయకత్వానికి సన్మానం
- ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు, ప్రభుత్వానికి కాంట్రాక్ట్ ఉద్యోగుల హృదయపూర్వక కృతజ్ఞతలు
- ఎన్జీవో రాష్ట్ర నాయకత్వానికి, ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు

ప్రజాభూమి ప్రతినిధి-విజయవాడ

డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ పరిధిలో రాష్ట్ర వ్యాప్తంగా సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ (రెగ్యులరైజేషన్) ప్రక్రియ విజయవంతం కావడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. తమ చిరకాల స్వప్నాన్ని సాకారం చేసేందుకు అలుపెరగని కృషి చేసిన ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్‌ని, కాంట్రాక్ట్ ఉద్యోగుల అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం విజయవాడలోని ఎన్జీవో హోమ్‌లో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తమ సమస్య పరిష్కారానికి చొరవ చూపిన నాయకత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు మరియు అభినందనలు తెలియజేశారు.



**కీలక పాత్ర పోషించిన 'సాగర్-రమణ' నాయకత్వం**

ఈ సందర్భంగా డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ... ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ అంశాన్ని ఎన్జీవో రాష్ట్ర నాయకత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని కొనియాడారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో అధ్యక్షుడు విద్యాసాగర్ నిరంతరం శ్రమించారని తెలిపారు. వారి ప్రత్యేక చొరవతోనే ముఖ్యమంత్రి ఆమోదం, క్యాబినెట్ ఆమోదం లభించడమే కాకుండా, అసెంబ్లీలో బిల్లు పాస్ అయిందని గుర్తుచేశారు. ఆ తర్వాత డిపార్ట్‌మెంట్ ప్రాసెస్ చట్ట సవరణ (అమెండ్మెంట్) ద్వారా సెకండరీ హెల్త్ కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌కు మార్గం సుగమమైందని వారు స్పష్టం చేశారు. రాష్ట్ర ఎన్జీవో సంఘం చొరవతో 8000 మంది కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ కి మార్గం ముఖ్యమంత్రి ఆమోదంతో సగం అయిందని, ఇప్పుడు యాక్ట్ 30 సవరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదం లభించడంతో డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్కు కూడా మార్గం సుగమం అయిందని తెలిపారు.

**ముఖ్యమంత్రి, మంత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు:**

ఏళ్ల తరబడి వేచి చూస్తున్న ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపి, వారి కుటుంబాలకు భరోసా కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ఆర్థిక శాఖమాత్యులు పయ్యావుల కేశవ్ గారికి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, శాఖాధికారులకు మరియు సంబంధిత ప్రభుత్వ యంత్రాంగానికి డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు సమర్పించారు.

**కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు:**

ఈ కృతజ్ఞతా కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కరెడ్ల అంజనీ కుమార్, కార్యదర్శి శ్రీదేవి, సహాయ కార్యదర్శితో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి భారీ సంఖ్యలో విచ్చేసిన కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఎన్జీవో సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

# కౌన్సిల్‌లో నా మొదటి అనుభవం..

- పెద్దల సభకు నన్ను సభ్యుడిగా ఎంపిక చేసినముఖ్యమంత్రికి, ఆమోదించిన గౌరవ గవర్నర్కి కృతజ్ఞతలు
- నా మొదటి రోజు కౌన్సిల్లో ప్రస్థానం నన్ను చాలా నిరుత్సాహపరిచింది
- పెద్దల సభలో వైకాపా సభ్యులు "పెద్దల్లా" కాకుండా "గద్దల్లా" వ్యవహరించి మండలి ఔన్నత్యాన్ని దిగజార్చారు
- రాష్ట్ర హైకోర్టు కూడా మెగా డీఎస్సీపై ఎన్ని పిటిషన్లు వేసిన చర్చకు తీసుకోలేదంటే కారణం అర్థం చేసుకోలేని అవగాహనరాహిత్యుడు జగన్
- ఎమ్మెల్సీ వర్ల రామయ్య

ప్రజాభూమి ప్రతినిధి-అమరావతి

శాసన మండలిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్సీలు వ్యవహరిస్తున్న తీరు తనను తీవ్రంగా బాధించిందని నూతనంగా ఎమ్మెల్సీగా బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్సీ వర్ల రామయ్య అన్నారు. పెద్దల సభగా పిలిచే శాసన మండలిలో చర్చలు, సమీక్షలు, బిల్లుల పై సూచనలు జరగాల్సి ఉండగా.. నినాదాలు, అరుపులు, ప్లకార్డులు, గందరగోళంతో సభా కార్యకలాపాలను అడ్డుకోవడం సరికాదని ఆయన పేర్కొన్నారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తనను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ప్రతిపాదించారని, గౌరవ గవర్నర్ ఆ ప్రతిపాదనను ఆమోదించారని వర్ల రామయ్య తెలిపారు. ఇటీవలే తాను శాసన మండలి చైర్మన్ మోషెన్ రాజు సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశానని చెప్పారు. అయితే, తాను ప్రమాణ స్వీకారం చేసిన రోజున సభ వాయిదా పడటంతో ఎలాంటి బిజినెస్ జరగలేదన్నారు. తన ఎమ్మెల్సీగా తొలి రోజు శాసన మండలిలో అడుగుపెట్టినప్పుడు సభలో పెద్ద ఎత్తున గందరగోళం కనిపించిందని రామయ్య చెప్పారు. కొత్త సభ్యుడిగా తనకు ఏదైనా స్వాగతం పలుకుతున్నారేమోనని తొలుత భావించానని, అయితే పరిస్థితిని గమనించిన తర్వాత వైసీపీ సభ్యులు నినాదాలు చేస్తూ, పెద్దగా అరుస్తూ సభా కార్యక్రమాలకు అంతరాయం కలిగిస్తున్నారని తెలిసిందన్నారు. చైర్మన్ మోషెన్ రాజు కుర్చీలో కూర్చున్న సమయంలో ఆయనకు ఇరువైపులా వైసీపీ ఎమ్మెల్సీలు నిలబడి పెద్దపెద్ద నినాదాలు చేశారని ఆయన ఆరోపించారు. చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని చైర్మన్ ముఖానికి అడ్డంగా పెట్టారని, ఆయన మైక్రోఫోన్ వద్దకు వెళ్లి తమ డిమాండ్లను చెప్పేందుకు కూడా అవకాశం లేకుండా చేశారని అన్నారు. "చైర్మన్ ముఖానికి ప్లకార్డు అడ్డుగా పెడితే ఆయనకు ఏమైనా కనిపిస్తుందా?" అని రామయ్య ప్రశ్నించారు. జగన్ మోహన్ రెడ్డి ఎంపిక చేసిన ఎమ్మెల్సీలే ఈ విధంగా సభలో వ్యవహరిస్తున్నారని ఆయన అన్నారు.

**శాసన మండలిలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీల తీరుపై తీవ్ర ఆగ్రహం**

పెద్దల సభకు సభ్యులను ఎంపిక చేసేటప్పుడు వారి వయసును మాత్రమే కాకుండా వారి నడవడి, మాట తీరు, వ్యవహారశైలి, సభను గౌరవించే విధానం, ఇతరులను గౌరవించే సంస్కారం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. 25 లేదా 30 ఏళ్ల వయసున్న వ్యక్తి కూడా తన ప్రవర్తన ద్వారా పెద్దమనిషిగా నిలవవచ్చని, పెద్దరికం వయసుతో మాత్రమే రాదని చెప్పారు. శాసన మండలి అంటే ఏమిటో ప్రతి సభ్యుడు తెలుసుకోవాలని రామయ్య అన్నారు. ద్విసభ్య శాసన వ్యవస్థలో శాసన మండలి ఎగువ సభగా పనిచేస్తుందని, శాసనసభలో ఆమోదించిన బిల్లులను సమీక్షించడం, వాటిపై చర్చించడం, అవసరమైన మార్పులు, మెరుగుదలలను సూచించడం మండలి ప్రధాన బాధ్యతల్లో ఒకటని వివరించారు. ఉదాహరణగా, శాసనసభలో అమరావతిలో సాయంత్రం ఆరు గంటల తర్వాత పురుషులు బయట తిరగకూడదనే విధంగా ఒక బిల్లు తీసుకొచ్చి ఆమోదించారని అనుకుందామని, అది శాసన మండలికి వచ్చినప్పుడు సభ్యులు దానిని పరిశీలించి, "ఇది సరికాదు, ఈ విధంగా మార్చాలి" అని సూచించవచ్చని అన్నారు. ఆ సూచనల ఆధారంగా బిల్లును సవరించి తిరిగి శాసనసభకు పంపవచ్చని వివరించారు. ఇంతటి బాధ్యత కలిగిన పెద్దల సభలో చిన్నపిల్లల మాదిరిగా, అల్లరి మూకల్లా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తన మొదటి రోజు అనుభవం తాను ఊహించిన శాసన మండలికి పూర్తిగా భిన్నంగా ఉందని రామయ్య అన్నారు. చర్చల్లో పాల్గొని, ప్రజా సమస్యలపై మాట్లాడాలని భావించి సభకు వెళ్లిన తనకు చర్చలు, డిబేట్లు కనిపించలేదని, జగన్ మోహన్ రెడ్డి బృందం చేస్తున్న అల్లరి మాత్రమే కనిపించిందని విమర్శించారు. వైసీపీ సభ్యులు సభలో నినాదాలు చేస్తూ సెల్ఫీలు తీసుకుని వాటిని జగన్ మోహన్ రెడ్డికి పంపుతున్నారని కూడా ఆయన ఆరోపించారు. "సార్.. నేను ఇంత పెద్దగా అరిచాను", "సార్.. చైర్మన్‌కు అడ్డుగా ప్లకార్డు పెట్టాను" అంటూ ఫొటోలు, సెల్ఫీలు పంపుతున్నారని, వాటికి జగన్ నుంచి "వెరీ గుడ్, యూ ఆర్ పాస్డ్" అన్నట్టుగా ప్రోత్సాహం లభిస్తోందని వ్యాఖ్యానించారు. సభను అడ్డుకోవడానికే సభ్యులను పంపించారా అని ప్రశ్నించారు.



**పెద్దల సభ ప్రాముఖ్యత, దాని బాధ్యతలు ఏమిటో తెలుసుకుని సభలో మెలగాలి**

రాజ్యాంగంలోని 169, 171 అధికరణలను చదవాలని జగన్ మోహన్ రెడ్డికి, ఆయన పార్టీ ఎమ్మెల్సీలకు వర్ల రామయ్య సూచించారు. పెద్దల సభకు సభ్యులను ఎంపిక చేసే సమయంలో ఎంతో ఆచితూచి వ్యవహరించాలని అన్నారు. దళితులపై దాడులు చేసినవారు, కుటుంబ వ్యవస్థలను నాశనం చేసినవారు, రౌడీషీటర్లు వంటి వ్యక్తులను పెద్దల సభకు పంపడం ద్వారా సమాజానికి ఎలాంటి సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు. శాసన మండలిలో మంత్రి నారా లోకేష్‌ను వైసీపీ సభ్యులు అవమానకరంగా సైగలు చేస్తూ, అసభ్యకరమైన రీతిలో వ్యవహరిస్తున్నారని రామయ్య ఆరోపించారు. సభలో అసభ్యకరమైన, పార్లమెంటరీ నిబంధనలకు విరుద్ధమైన భాషకు స్థానం లేదని అన్నారు. తనతో కొంతమంది వైసీపీ ఎమ్మెల్సీలు వ్యక్తిగతంగా మాట్లాడారని, వారి పేర్లు చెప్పడం మర్యాద కాదని రామయ్య తెలిపారు. "అన్నా.. ఇది మాకు రోజూ ఉండేదేనా? కౌన్సిల్‌లో మాకు ఇదేనా?" అని వారు తనను అడిగారని చెప్పారు. దీన్ని బట్టి సభను అడ్డుకోవడం, చర్చలు, డిబేట్లు, సమీక్షలు జరగకుండా చేయడం వెనుక నాయకత్వం నుంచి ఆదేశాలు ఉన్నాయా అనే ప్రశ్న తలెత్తుతోందన్నారు. భారతదేశంలో ఎవరైనా రాజ్యాంగబద్ధంగానే నడుచుకోవాలి. ఆర్టికల్ 169 ప్రకారం శాసనమండలి అనేది బిల్లులను లోతుగా పరిశీలించి, సమగ్ర చర్చ జరిపి, తగిన మార్పులను సూచించే సమీక్షా సభ. కానీ, ప్రజా ప్రయోజనాల కోసం పనిచేయాల్సిన సభను వైఎస్ జగన్ తన రాజకీయ ప్రయోజనాల కోసం అల్లరిపాలు చేస్తున్నారు. యువ నాయకుడు నారా లోకేష్ ప్రజల్లోకి విస్తృతంగా వెళ్తుంటే వస్తున్న ప్రజాదరణను చూసి వైఎస్ జగన్, ఆయన పార్టీ నేతలు తట్టుకోలేకపోతున్నారు. లోకేష్‌పై ఉన్న ద్వేషం, ఈర్ష్య, ఆక్రోశాన్ని తట్టుకోలేక సభను తప్పుదోవ పట్టిస్తున్నారు. 'గొడ్డలి రాజకీయం' ఎవరిదో, ఎవరికి నష్టం చేసిందో రాష్ట్ర ప్రజలందరికీ స్పష్టంగా తెలుసు. ప్రజలను తప్పుదోవ పట్టించే చర్యలను ఇప్పటికైనా వైఎస్సార్‌సీపీ మానుకోవాలి. ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ స్ఫూర్తిని గౌరవించి సభ సజావుగా సాగేందుకు సహకరించాలని, నిరాధార ఆరోపణలతో ప్రజలను మోసం చేయడం ఆపాలని ఆయన హెచ్చరించారు.

**మెగా డీఎస్సీపై వైఎస్సార్‌సీపీ తప్పుడు ఆరోపణలు.. నిరుద్యోగులు, ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురిచేయడమే లక్ష్యం**

మెగా డీఎస్సీలో అవినీతి జరిగిందంటూ వైసీపీ చేస్తున్న ఆరోపణలను కూడా రామయ్య తీవ్రంగా తప్పుపట్టారు. సంబంధిత శాఖ మంత్రి నారా లోకేష్ బహిరంగంగా చర్చకు రావాలని సవాల్ చేశారని, తనకు ఉన్న సందేహాలను తీసుకురావాలని, వాటిని క్లారిఫై చేస్తామని చెప్పారని గుర్తుచేశారు. అయితే ఆ సవాల్‌ను వైసీపీ నేతలు స్వీకరించలేదని అన్నారు. మెగా డీఎస్సీపై వైసీపీ లేవనెత్తుతున్న ప్రశ్నలకు సంబంధిత అధికారులు ఇప్పటికే సమాధానాలు ఇచ్చారని రామయ్య చెప్పారు. చీఫ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ అజయ్ జైన్, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, సచివాలయ సంబంధిత అధికారులు, శాఖ ఎండీతో పాటు ఇతర సీనియర్ అధికారులు మీడియా సమావేశాలు నిర్వహించి ఎక్కడా అవినీతి జరగలేదని స్పష్టం చేశారని తెలిపారు. ఇటీవల ఇద్దరు మహిళా అధికారులు కూడా మీడియా సమావేశం నిర్వహించి డీఎస్సీకి సంబంధించిన అంశాలను చాలా స్పష్టంగా వివరించారని చెప్పారు. తమకు ఇంకా అనుమానాలు ఉంటే ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యాలయంలో ఉంటామని, వచ్చి తమ వద్ద సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని ఆ అధికారులు చెప్పారని రామయ్య పేర్కొన్నారు. ఆరోపణలు చేస్తున్నవారు కనీసం ఆ అధికారులను కలిసి వాస్తవాలను తెలుసుకోవాలని సూచించారు. ఏడాది క్రితం ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులను కూడా వైసీపీ ఆరోపణలతో మానసికంగా వేధిస్తోందని రామయ్య విమర్శించారు. ఉద్యోగం వచ్చి ఏడాది అయినా సంతోషంగా ఉండలేకపోతున్నామని, జగన్ మోహన్ రెడ్డి తమ ఉద్యోగాలు పోతాయంటూ భయపెడుతున్నారని ఒక యువతి ఆవేదన వ్యక్తం చేసిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఒకవేళ ప్రభుత్వ నిర్ణయంలో తప్పు ఉందని, తమ వద్ద ఆధారాలు ఉన్నాయని భావిస్తే కోర్టును ఆశ్రయించాలని అన్నారు. డీఎస్సీ అంశంపై 341 పిటిషన్లు దాఖలయ్యాయని, ఆ పిటిషన్లన్నింటినీ గౌరవ న్యాయస్థానం కొట్టివేసిందని రామయ్య తెలిపారు. ఆధారాలు ఉంటే కోర్టుకు వెళ్లాలని, కానీ ఆధారాలు లేకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడి అభ్యర్థులను, ఉపాధ్యాయులను, వారి కుటుంబాలను ఆందోళనకు గురిచేయడం సరికాదని అన్నారు.

**దళిత చైర్మన్‌ను అవమానిస్తూ పెద్దల సభ గౌరవాన్ని దిగజారుస్తున్న వైసీపీ**

శాసన మండలి చైర్మన్ మోషెన్ రాజును వైసీపీ సభ్యులు ఇబ్బంది పెట్టిన తీరు తనకు మరింత బాధ కలిగించిందని రామయ్య చెప్పారు. దళిత వర్గానికి చెందిన చైర్మన్ సభను నడిపేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో ఆయన ముఖానికి ప్లకార్డులు అడ్డుపెట్టి, మైక్రోఫోన్ వద్దకు వెళ్లి నినాదాలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. చైర్మన్ వయసు, స్థానం, బాధ్యతలను కూడా గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. భారత రాజ్యాంగం ప్రకారమే ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని, తాను అయినా, జగన్ అయినా, మరెవరైనా రాజ్యాంగానికి మించి వెళ్లలేరని రామయ్య అన్నారు. ఆర్టికల్ 169 ప్రకారం శాసన మండలి చట్టాలను సమీక్షించే, బిల్లులను క్లోజ్‌గా పరిశీలించే, వాటిపై చర్చించి చట్టాలుగా మారే ముందు అవసరమైన మెరుగుదలను సూచించే సభ అని పేర్కొన్నారు. అలాంటి సభను జగన్ మోహన్ రెడ్డి తన వ్యక్తిగత రాజకీయ స్వార్థం, ఈర్ష్య, ఆక్రోశం కోసం తప్పుదోవ పట్టించకూడదని అన్నారు. తన పార్టీ సభ్యుల సంఖ్య ఎక్కువగా ఉందని వైసీపీ ఇష్టం వచ్చినట్లు వ్యవహరించకూడదని రామయ్య హెచ్చరించారు. సభలో టీడీపీ వైపు సభ్యుల సంఖ్య తక్కువగా ఉన్నా తాము ధర్మం, ప్రజల పక్షాన ఉన్నామని చెప్పారు. మహాభారతంలోని పాండవులు ఐదుగురే ఉన్నా చివరకు ధర్మమే గెలిచిందని, కౌరవులు వంద మంది ఉన్నా వారి పతనం తప్పలేదని ఉదాహరణగా చెప్పారు. ప్రజా వ్యతిరేకంగా వ్యవహరిస్తే వైసీపీకి కూడా పతనం తప్పదని అన్నారు. తన మొదటి రోజు అనుభవాన్ని "పీడకల"గా అభివర్ణించిన రామయ్య, భవిష్యత్తులో అలాంటి పరిస్థితి మళ్లీ రాకుండా జగన్ మోహన్ రెడ్డి తన పార్టీ ఎమ్మెల్సీలకు సరైన మార్గదర్శకత్వం ఇవ్వాలని కోరారు.

**పెద్దల సభ గౌరవాన్ని కాపాడేలా వైసీపీ ఎమ్మెల్సీలు హుందాగా వ్యవహరించాలి**

రానున్న శాసన మండలి సమావేశాల నుంచి వైసీపీ ఎమ్మెల్సీలు మారిన మనుషుల్లా, పెద్దల సభ సభ్యుల్లా వ్యవహరించాలని సూచించారు. వైసీపీకి చెందిన కొంతమంది ఎమ్మెల్సీలకు కూడా ఇప్పుడు శాసన మండలి అంటే ఏమిటి, పెద్దల సభలో ఎలా వ్యవహరించాలో అర్థమైందని తనకు అనిపిస్తోందని రామయ్య అన్నారు. జగన్ మోహన్ రెడ్డి తన పార్టీ సభ్యులను తీర్చిదిద్ది, సభ గౌరవాన్ని కాపాడే విధంగా వ్యవహరించేలా ఆదేశించాలని కోరారు. తనతో పాటు సహచర ఎమ్మెల్సీ రమాదేవికి కూడా తొలి రోజున సభలో తమను పరిచయం చేసుకునే అవకాశం రాలేదని రామయ్య చెప్పారు. ప్రశ్నోత్తరాల సమయంలోనే వైసీపీ సభ్యులు పైకి వెళ్లి చైర్మన్‌ను ఇబ్బంది పెట్టే కార్యక్రమం చేపట్టారని అన్నారు. తనకు మొదటి రోజే మాట్లాడే అవకాశం రాలేదని, అయితే దాని గురించి తాను బాధపడటం లేదని చెప్పారు. మరో రోజు అవకాశం వస్తుందని, అయితే సభలో వైసీపీ సభ్యులు వ్యవహరించిన తీరు మాత్రం తప్పని స్పష్టం చేశారు. శాసన మండలి రాబోయే రోజుల్లో నిజమైన "పెద్దల సభ"గా గౌరవంగా, సజావుగా పనిచేసేలా వైసీపీ సహకరించాలని వర్ల రామయ్య కోరారు. సభా నియమాలు, రాజ్యాంగ నిబంధనలు పాటించాలని, చర్చలకు అవకాశం కల్పించాలని, సభ్యత, సంస్కారం, ఇతర సభ్యుల పట్ల గౌరవం ప్రదర్శించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి తన ఆలోచనా విధానాన్ని మార్చుకుని, తన పార్టీ ఎమ్మెల్సీలను కూడా అదే విధంగా మార్చాలని ఆయన కోరారు.